# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 111 | హైదరాబాద్ | శుక్రవారం 17-10-2025 | పేజీలు : 12 | వెల : 1.00



11లో

బీసీ సంఘాల బంద్, కొండా సురేఖ అంశంపై స్పందించిన మహేశ్ కుమార్ గౌడ్

## నేటి భారతం

- హైదరాబాద్ మెరవాలంటే జీహెచ్ఎంసీ చిత్తశుద్ధిగా పని చేయాలి.
- కాగితాలపై స్మార్ట్ సిటీ... నేలమీద మాత్రం చెత్త సిటీ ఇదే జీహెచ్ఎంసీలో కనిపిస్తున్న వాస్తవం..
- రోడ్లు మునిగిపోయినా..ప్రజలు మునిగిపోయినా జీహెచ్ఎంసీ స్పందన కరువు..
- నిధులు ఖర్చయినట్టే చూపించి, అభివృద్ధి చూపించని సంస్థ జీహెచ్ఎంసీ.
- ప్రతి వర్షం జీహెచ్ఎంసీ పనితీరుకి పరీక్ష... ప్రతి సారి ఫెయిల్ అవుతోంది.
- రామ్కీ సంస్థ దోపిడి...చెత్త గుట్టలు పెరుగుతున్నా, జీహెచ్ఎంసీ కళ్ళు మూసుకుపోతున్నాయి.
- స్వచ్ఛ హైదరాబాద్ అన్న నినాదం కాగితాలపైనే మిగిలింది.
- ప్రజల డబ్బుతో అధికారుల లావిష్ లైఫ్.. ఇదే జీహెచ్ఎంసీ అవినీతి రూపం.

– వి.జీ

దీపావళికి ముందే

## ఢిల్లీలో డేంజర్ బెల్స్

కాలుష్యం గుప్పిట్లో దేశ రాజధాని!

- ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో ప్రమాదకరంగా వాయు కాలుష్యం
- దీపావళికి ముందే విషమిస్తున్న పరిస్థితి
- పలు ప్రాంతాల్లో 300 దాటిన గాలి నాణ్యత సూచీ
- 'గ్రాప్' తొలి దశ ఆంక్షలు అమలు చేసిన అధికారులు
- ప్రజలకు ఆరోగ్య నిపుణుల తీవ్ర హెచ్చరిక
- ఘజియాబాద్, నోయిడాలలో అత్యధిక కాలుష్యం నమోదు


11లో


11లో

## చంద్రబాబు, పవన్ విజన్ అద్భుతం..
## ఏపీకి అండగా ఉంటాం

- కర్నూలు జిల్లా నన్నూరులో ప్రధాని మోదీ భారీ బహిరంగ సభ
- రూ.13,429 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు వర్చువల్ శ్రీకారం
- డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ఏపీలో శరవేగంగా అభివృద్ధి అని వెల్లడి
- చంద్రబాబు, పవన్ కల్యాణ్ నాయకత్వాన్ని కొనియాడిన ప్రధాని
- వికసిత్ భారత్' లక్ష్య సాధనలో ఏపీ కీలక భాగస్వామి అని ప్రశంస
- రాయలసీమ అభివృద్ధికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని హామీ


11లో

## రాయదుర్గంలో మరోసారి భూముల వేలం
## గజం రూ.3,10,000..!

- నాలెడ్జ్ సిటీలోని 4,718.22 చదరపు గజాల వేలానికి టీజీఐఐసీ నోటిఫికేషన్
- నవంబర్ 11న మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వేలం
- ఇటీవల రాయదుర్గంలో రూ. 177 కోట్లు పలికిన ఎకరం భూమి

## అమెరికాలోని భారత టెక్కీలకు శుభవార్త..

హెచ్4 వీసాదారులకు భారీ ఊరట



11లో



## లోకేశ్ సారథ్యంలో జీఎస్టీ ప్రచారం పండుగలా సాగుతోంది

11లో

## హైడ్రా.. ఆర్భాటం తప్ప
# అసలు విషయం లేదు..



12లో

- హైడ్రా పనితీరుపై బహిరంగ విమర్శలు..
- ఉద్దేశ్యం మంచిదే.. కానీ ఉపయోగం లేదు..
- పేదలపైన ప్రతాపం..పెద్దలపై ప్రేమ..
- చెరువుల పరిరక్షణలో కొంత విజయం..
- అన్ని సమస్యలను సమానంగా చూస్తే బెటర్..
- ఎంతో ఉన్నత ఆశయంతో ప్రారంభమైన హైడ్రా..
- హైడ్రామాతో అపనిందల పాలవుతున్న వైనం..
- హైడ్రా తీరును హైకోర్టు తప్పుబట్టినా మారని తీరు...
- బడాబాబులకు కొమ్ము కాస్తోందన్న తీవ్ర ఆరోపణలు..
- ముఖ్యమంత్రి డైరెక్షన్ లో నడుస్తూ విలువలకు తిలోదకాలు ఇస్తుందన్న అపవాదు..
- హైడ్రా పనితీరుపై " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ " అందిస్తున్న ప్రత్యేక కథనం..

కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించి, డైనమిక్ లీడర్ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టాక..పలు పథకాలకు శ్రీకారం చుట్టారు..అయితే ఆయన ఆలోచనల నుంచి పురుడు పోసుకున్న అద్భుత ఆవిష్కరణ హైడ్రా..ఆక్రమణలకు గురైన చెరువులను, నీటి కుంటలను పరిరక్షించడం.. అక్రమ నిర్మాణాలను గుర్తించి కూల్చివేయడం హైడ్రా విధి.. హైడ్రా ఏర్పడిన తర్వాత సంచలనం సృష్టించింది.. ఆక్రమణదారుల గుండెల్లో దడ పుట్టించింది..హైడ్రా పేరు వినగానే వణికిపోయారు..నగర ప్రజలు చాలా సంతోషించారు.. నగరానికి మహర్దశ పట్టనుందని సంబరాలు చేసుకున్నారు..కానీ ఇది కేవలం తాత్కాలికమే అన్న విషయం అందరికీ అర్థం అయ్యింది.. ఉన్నవారికి ఒక న్యాయం.. లేనివారికి ఒక న్యాయం..ఈ కోవలోకి హైడ్రా చేరిపోయింది.. ఎన్నెన్నో అపవాదులు మూటగట్టుకుంది..చివరికి హైకోర్టు అక్షింతలు కూడా వేసింది.. ప్రారంభ ఆర్భాటం తప్ప.. హైడ్రాతో ఒరిగేది ఏమీ లేదన్నది మేధావులు, విశ్లేషకులు అంటున్న మాట..


11లో

శంషాబాద్ విమానాశ్రయంలో రూ. 2.37 కోట్ల విలువైన

## బంగారం పట్టివేత

- కువైట్ నుంచి షార్జా మీదుగా హైదరాబాద్‌కు వచ్చిన ప్రయాణికుడు
- డీఆర్ఐ అధికారుల తనిఖీల్లో 7 బంగారు కడ్డీలు గుర్తింపు
- 1.8 కిలోల బరువు ఉన్న ఈ కడ్డీల విలువ రూ. 2.37 కోట్లు ఉంటుందని అంచనా

భారత శక్తి

# వెండితెర వెలుగులే బెటర్.

సినిమా రంగం నుంచి రాజకీయాల్లోకి అడుగుపెట్టడం మన దేశంలో కొత్త కాదు. ఎన్టీఆర్, ఎంజీఆర్, జయలలిత వంటి దిగ్గజాలు వెండితెరపై తమ ఇమేజ్‌ను రాజకీయ విజయాలుగా మలచుకున్నారు. అయితే, ఈ గ్లామరస్ ప్రయాణంలో విజయ శిఖరాలను చేరుకున్నవారు కొందరైతే, క్షేత్రస్థాయి రాజకీయాల కష్టాలు, ఆర్థికపరమైన ఇబ్బందులతో నిరాశకు గురైనవారు ఎంతో మంది ఉన్నారు. రాజకీయాల వల్ల నష్టం తప్ప లాభం లేదని భావించేవారు ఈ మధ్య పెరుగుతున్నారు. తాజాగా కేరళకు చెందిన బీజేపీ ఎంపీ, కేంద్ర మంత్రి సురేశ్ గోపీ .., బాలీవుడ్ నటి, ఎంపీ కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలు ఈ వాస్తవాన్ని మరోసారి స్పష్టం చేస్తున్నాయి.కేరళ నుంచి బీజేపీ తరఫున గెలిచి కేంద్ర మంత్రివర్గంలో స్థానం పొందిన సురేశ్ గోపీ, రాజకీయాల్లో లాభం కంటే నష్టమే ఎక్కువని బహిరంగంగా ప్రకటించడం సంచలనం సృష్టించింది. సినిమాలు చేసుకుంటే మంచి ఆదాయం ఉండేదని, కానీ రాజకీయాల్లోకి వచ్చాక ఆదాయం తగ్గిపోయిందని, అవసరాలు తీరడం లేదని ఆయన వాపోయారు. మంత్రి పదవిని వదిలేసి మళ్లీ సినిమాల్లోకి వెళ్లాలని యోచిస్తున్నట్లు చెప్పడం, రాజకీయ జీవితంపై ఆయనకున్న అసంతృప్తిని తెలియజేస్తుంది.దీనికి కొనసాగింపుగా, హిమాచల్ ప్రదేశ్‌లోని మండీ నుంచి లోక్‌సభకు ఎన్నికైన కంగనా రనౌత్ కూడా ఇదే విధమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సినీ రంగాన్ని, రాజకీయ రంగాన్ని పోల్చుతూ.. రాజకీయం చాలా కష్టమని, పైగా ఇందులో ఆదాయం తక్కువ, ఖర్చులు ఎక్కువని నిట్టూర్చారు. ఒక నిజాయితీపరుడైన ఎంపీకి వచ్చే జీతం తమ నియోజకవర్గాల్లో పర్యటనలు, పీఏల జీతాలు, ఇతర అవసరాలకు సరిపోవడం లేదని, లక్షల్లో ఖర్చవుతోందని ఆమె వివరించారు. ఈ పరిస్థితి ఇలాగే ఉంటే నిజాయితీగా ప్రజా సేవ చేసేందుకు ఎవరూ ముందుకు రారని కంగనా ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ స్థాయి సమస్యలను కూడా తమ వద్దకు ప్రజలు తీసుకొస్తున్నారని, వాటిని సొంత డబ్బుతో పరిష్కరించమని అడుగుతున్నారని ఆమె అసహనం వ్యక్తం చేశారు.సినిమా రంగంలో నటులు భారీ పారితోషికాలు అందుకుంటారు. వారికి ఉండే ప్రజాదరణ, స్టార్‌డమ్ తక్కువ కాలంలోనే కోట్లలో ఆదాయాన్ని ఆర్జించి పెడుతుంది. అదే సమయంలో, రాజకీయాలు ముఖ్యంగా క్షేత్రస్థాయిలో ప్రజల కోసం పనిచేసే ప్రజాప్రతినిధులకు ఆదాయం కంటే ఖర్చులే అధికం. సినిమా స్టార్‌గా ఒక్క సినిమాకు కోట్లు తీసుకునేవారు, రాజకీయాల్లోకి వచ్చాక జీతం, అలవెన్సులు మాత్రమే ప్రధాన ఆదాయ వనరుగా ఉంటాయి. ఇది వారి మునుపటి ఆదాయంతో పోలిస్తే చాలా తక్కువ. ప్రజాప్రతినిధి అయిన తర్వాత నియోజకవర్గంలో పర్యటనలు, కార్యకర్తలను, ప్రజలను కలుసుకోవడం, వారి సమస్యలను పరిష్కరించడానికి అయ్యే ఖర్చులు ఊహించిన దానికంటే ఎక్కువగా ఉంటాయి. నటులకు తెరపై ఉండే గ్లామర్, రాజకీయాల్లో కనిపించదు. ఇక్కడ నిజమైన ప్రజాసేవ, క్షేత్రస్థాయి కష్టాలు, రాజకీయ ఒత్తిళ్లు ఉంటాయి. సినిమాలు, రాజకీయాలు రెండూ సమయాన్ని, శక్తిని డిమాండ్ చేస్తాయి. సినిమా పారితోషికం కోసం కొంత సమయం కేటాయించి, రాజకీయాలకు పూర్తి న్యాయం చేయలేకపోవడం, లేదా పూర్తిగా సినిమాలను వదులుకోలేకపోవడం వంటి సందిగ్ధత కూడా వారిలో ఆందోళన కలిగిస్తుంది.సురేశ్ గోపీ, కంగనా రనౌత్ వంటి ప్రముఖ నటుల వ్యాఖ్యలు? వెండితెర వెలుగులు, రాజకీయాల క్లిష్టత మధ్య ఉన్న ఆర్థిక, వాస్తవ వ్యత్యాసాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయి. గోపి కేరళ నుండి కొత్తగా ఎన్నికైన రాజ్యసభ సభ్యుడు, బిజెపి అనుభవజ్ఞుడైన సి సదానందన్ మాస్టర్‌ను కేంద్ర మంత్రివర్గంలో తన స్థానంలో నియమించాలని సిఫార్సు చేశారు. మాస్టర్ రాజకీయ సహకారాలను ఆయన హైలైట్ చేస్తూ "నన్ను తొలగించిన తర్వాత సదానందన్ మాస్టర్‌ను కేంద్ర మంత్రిగా చేయాలని నేను నిజాయితీగా చెబుతున్నాను. ఇది కేరళ రాజకీయ చరిత్రలో ఒక కొత్త అధ్యాయంగా మారుతుందని నేను నమ్ముతున్నాను'' అని అన్నారు. 1994లో సిపిఐ(ఎం) కార్యకర్తలు చేసిన దాడిలో రెండు కాళ్లను కోల్పోయిన రాజకీయ హింస నుండి బయటపడిన మాస్టర్, ఉత్తర కన్నూర్ రాజకీయాల్లో మంచి పేరు సంపాదించారు.మలయాళ సినిమా రంగంలో అత్యంత ప్రజాదరణ పొందిన నటులలో ఒకరైన సురేష్ గోపి 2016 అక్టోబర్‌లో బిజెపిలో చేరారు. 2024లో త్రిసూర్ నుండి లోక్‌సభకు ఎన్నికయ్యారు. జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించినప్పటి నుండి, గోపి తన సినీ కెరీర్‌ను చాలావరకు నిలిపివేశారు, కానీ తన రాజకీయ బాధ్యతలను నిర్వర్తిస్తూనే నటనకు తిరిగి రావాలని కోరుకుంటున్నట్లు అనేకసార్లు వ్యక్తం చేశారుప్రజా జీవితంలో నిజాయితీగా, నిస్వార్థంగా పనిచేయాలంటే, ఆదాయం కంటే ఖర్చులే అధికంగా ఉండే ప్రస్తుత రాజకీయ వ్యవస్థలో, తగినంత జీతం, అలవెన్సులు లేకపోవడం వల్ల నిస్వార్థ ప్రజాసేవకు అడ్డుగోడగా మారుతుందని ఈ వ్యాఖ్యలు సూచిస్తున్నాయి. సినిమా రంగం నుంచి వచ్చిన సెలబ్రిటీలకు ఇప్పుడిప్పుడే రాజకీయాల్లోని ఈ ఖర్చుల తత్వం బోధపడుతున్నట్లు కనిపిస్తోంది. ఇది కేవలం వ్యక్తిగత ఆవేదన మాత్రమే కాదు, భారత రాజకీయాల్లో నిజాయితీగా పనిచేయాలనుకునే ప్రతి ప్రజాప్రతినిధి ఎదుర్కొనే సవాలుకు అద్దం పడుతోంది.

# పరకామణి పాపం ఎవరిది...

తిరుమల, అక్టోబరు 16

దేవ దేవుడి సన్నిధి. ఏడు కొండల వాడి ఖజానా. శేషాద్రివాసుడి హుండీ లెక్కించే అవకాశమే అదృష్టం. కానీ అందులో కూడా చేతివాటం ప్రదర్శించి పావం అంటగట్టుకున్నారు కొందరు. తిరుమల తిరుపతి దేవస్థానం పరికామణి విభాగంలో జరిగిన దొంగతనం కేసు మళ్లీ




లైమ్‌లైట్‌లోకి వచ్చింది. అప్పటి ఉద్యోగి రవికుమార్ 920 డాలర్లు కొట్టేశారని టీటీడీ విజిలెన్స్ అధికారులు ఏప్రిల్ 2023లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే ఏడాది సెప్టెంబర్‌లో లోక్ అదాలత్ ముందు రవికుమార్‌తో రాజీ కుదిరింది.ఈ రాజీ నిర్ణయం చట్టపరంగా ఎంతవరకు కరెక్ట్ అన్న వివాదం మొదలైంది. ఈ చోరీపై పూర్తిస్థాయి దర్యాప్తు జరగలేదని..ఓ జర్నలిస్టు హైకోర్టులో పిటిషన్ వేయడంతో మళ్లీ చర్చ స్టార్ట్ అయింది. వరకామణి చోరీ కేసుకు సంబంధించి..ఖజానా రికార్డులు, రాజీ ఒప్పంద పత్రాలు సీజ్ చేయాలని హైకోర్టు సూచించింది. అయితే పోలీస్ అధికారులు కోర్టు ఆదేశాలను పాటించలేదని లేటెస్ట్‌గా న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏకంగా పోలీస్ స్టేషన్లనే మూసివేయండి అంటూ ఘాటుగా స్పందించింది. దీంతో వెంటనే సీఐడీ అధికారులు రంగంలోకి దిగారు. పరకామణి కేసుకు సంబంధించి టీటీడీ పాలక మండలి తీర్మానాలు.. లోక్ అదాలత్‌లో రాజీ చేసిన ఫైల్స్ అన్ని పరిశీలించారు సీఐడీ అధికారులు. ఆ డాక్యుమెంట్స్ అన్నీ సీజ్ చేశారు. సీసీ పుటేజీను కూడా పరిశీలిస్తున్నామని అధికారులు చెప్తున్నారు. పరకామణి చోరీ కేసు నమోదైన తిరుమల వన్ టౌన్ పీఎస్‌లో రికార్డుల పరిశీలించారు.లోక్ అదాలత్‌లో రాజీ తర్వాత..పరకామణి లెక్కింపులో చోరీ చేసిన రవికుమార్..టీటీడీకి రూ.14 కోట్ల విలువైన ఆస్తులను విరాళంగా ఇచ్చినట్లు గుర్తించారు. అయితే రాజీ ద్వారా నిందితుడిపై చర్యలు నిలిపివేయడమే పెద్ద వివాదం అవుతోంది. ఈ విషయంపై ఇప్పటికే టీటీడీ బోర్డు మెంబర్ భానుప్రకాశ్‌రెడ్డి ఈ మధ్యే ప్రెస్‌మీట్ పెట్టి మరీ అప్పటి టీటీడీ పెద్దలపై అలిగేషన్స్ చేశారు. స్వామివారి సొమ్మును స్వాహా చేస్తే చర్యలు తీసుకోకుండా..ప్రైవేటుగా సెటిల్ చేయడమేంటి..అలా చేయడానికి మీకు ఎవరు అధికారం ఇచ్చారని ప్రశ్నించారు.శ్రీవారి హుండీని దొంగతనం చేసిన రవికుమార్ అనే వ్యక్తిని కోర్టులో నిందితుడిగా ప్రవేశపెట్టకుండానే..లోక్ అదాలత్‌లో రాజీచేయడం, అతడు చోరీ చేస్తుండగా సీసీ పుటేజీకి చిక్కడం వంటి బలమైన ఆధారాలు ఉన్నా చర్యలు తీసుకోకపోవడంపై కూటమి పెద్దలు డౌట్స్ వ్యక్తం చేస్తున్నారు. దాదాపు రూ.వంద కోట్ల వరకు శ్రీవారి హుండీ నుంచి దోచేశారని, 40 కోట్ల రూపాయల విలువైన ఆస్తులను బినామీ పేర్లతో రాయించుకున్నారని..భూమన కరుణాకర్‌రెడ్డి టార్గెట్‌గా అలిగేషన్స్ చేస్తున్నారు కూటమి నేతలుఆ మధ్య టీటీడీ బోర్డు మెంబర్ భానుప్రకాష్ రెడ్డి బయటపెట్టిన వీడియోతో తిరుమల వేదికగా రాజకీయం మరోసారి వేడెక్కింది. అయితే తన మీద వచ్చిన ఆరోపణలపై భూమన కరుణాకర్‌రెడ్డి కూడా సీరియస్‌గానే రియాక్ట్ అయ్యారు. తాను టీటీడీ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు పరకామణిలో దొంగతనం జరిగినట్లు నిరూపిస్తే తల నరుక్కుంటానని సవాల్ చేశారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడే రవికుమార్ శ్రీవారి హుండీ లెక్కింపులో దొంగతనం చేశారని భూమన అంటున్నారు.రవికుమార్ కుటుంబ సభ్యులు పాప పరిహారంగా తమ ఆస్తులను టీటీడీకి రాసిచ్చారని చెప్తున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడే వరకామణి చోరీ జరిగిందని..రవికుమార్ అనే వ్యక్తి వెనుక వైసీపీ నేతల హస్తం ఉందని కూటమి ఆరోపిస్తోంది. ఒక ఉద్యోగి టీటీడీకి రూ.14కోట్లు రాసిచ్చారంటే..శ్రీవారి ఖజానా నుంచి ఎంత కొట్టేశారో అర్థం చేసుకోవచ్చంటున్నారు.పైగా రవికుమార్ నుంచి అప్పుడు టీటీడీలో కీలకంగా ఉన్న నేతలు ఆస్తులు రాయించుకున్నారని కూడా ఆరోపిస్తున్నారు. ఇప్పుడు సీఐడీ విచారణతో ఇది ఎవరికి మెడకు చుట్టుకుంటుందోనన్న టెన్షన్ మొదలైంది. ఇప్పటికే రోజుకో ఇష్యూ ఏపీ పాలిటిక్స్‌ను షేక్ చేస్తోంది. ఇప్పుడు వరకామణి ఎపిసోడ్ ఎటు దారితీయబోతోంతో..ఎవరెవరు బుక్ అవుతారో వేచి చూడాలి మరి.

# రెగ్యులర్ ఎపిసోడ్‌లాగా రుషికొండ భవనాలు

విశాఖపట్టణం, అక్టోబరు 16

ఎన్నికలకు ముందు అదే రచ్చ. ఎన్నికలు అయిపోయి..15 నెలలు అవుతున్నా..ఆ భవనాల చుట్టే ఏపీ పాలిటిక్స్ చక్కర్లు కొడుతున్నాయి. ఆ కట్టడాలు వైసీపీకి చేయాల్సినంత డ్యామేజ్ చేశాయి. కూటమికి కావాల్సిన ప్లస్ పాయింట్‌గా మారాయి. అయినా ఇప్పటివరకు రుషికొండ భవనాలు రెగ్యులర్ ఎపిసోడ్‌లాగా ఉండిపోతున్నాయి. ప్రతీ నెల రోజులకోసారి ఏదో విధంగా సాగరతీరంలో వైసీపీ హయాంలో కొండను తవ్వేసి కట్టిన కట్టడాల మీదే డిస్కషన్ నడుస్తోంది.ఇప్పుడు మరోసారిలైమ్‌లైట్‌లోకి వచ్చేసింది రుషికొండ ఇష్యూ. విశాఖ సాగర తీరాన వైసీపీ హయాంలో కట్టిన రుషికొండ భవనాల రచ్చ క్లైమాక్స్‌కు చేరేలా కనిపిస్తోంది. సర్కార్ క్యాబినెట్ సబ్‌కమిటీ చర్చలు స్టార్ట్ చేయడంతో..రుషికొండ నిర్మాణాలను దేనికి యూజ్ చేస్తారనే దానిపై ఆసక్తికర చర్చ నడుస్తోంది. రుషికొండ భవనాలను ఏపీ సర్కార్ ఏం చేయబోతోంది?ప్రభుత్వమే వాడుకుంటుందా? రిసార్టులు, హోటల్స్ కోసం రెంట్‌కు ఇస్తారా? సబ్ కమిటీ సూచనలు ఎలా ఉ ండబోతున్నాయి? అనేది ఉత్కంఠ రేపుతోంది. ఇదంతా ఇలా ఉ ండగానే రుషికొండ భవనాలను మెంటల్ హాస్పిటల్‌గా మార్చాలని గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు వంటి వాళ్లు ప్రతిపాదించడం హాట్ టాపిక్ అవుతోంది.మంత్రివర్గ ఉపసంఘం భేటీ అయ్యి.. రుషికొండ భవనాలను ఏ విధంగా వినియోగించుకోవాలనే దానిపై చర్చించింది. ఎలాంటి ఉపయోగం లేకుండా ఉన్న రుషికొండ కట్టడాలతో నెలకు రూ.25 లక్షలు విద్యుత్ ఛార్జీలు, మెయింటనెన్స్ ఖర్చులు భరించాల్సి వస్తోందని చెబుతోంది ప్రభుత్వం. గతంలో రూ.7 కోట్లు ఆదాయం వచ్చే చోట ఇప్పుడు ప్రభుత్వం ఎదురు చెల్లించాల్సి వస్తుందని వాపోతున్నారు మంత్రులు. రుషికొండ ప్యాలెస్ వినియోగంపై ప్రజాభిప్రాయాలు కోరుతూ ప్రకటన ఇవ్వాలని, ప్రజల అభిప్రాయం ప్రకారం డెసిషన్ తీసుకోవాలి క్యాబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. హోటల్స్ నిర్వహణ, మానసిక వికలాంగుల చికిత్సాలయ ఏర్పాటు చేయాలంటూ వచ్చిన ప్రతిపాదనలు, సలహాలను మంత్రివర్గ ఉపసంఘం



పరిశీలిస్తోందట. అయితే ప్రజల నుంచి సలహాలు, సూచనలు తీసుకున్న తర్వాతే రుషికొండ భవనాలపై ఓ నిర్ణయానికి రావాలని భావిస్తున్నారట.రుషికొండ భవనాలను విషయంలో కూటమి టార్గెట్‌గా వైసీపీ. జగన్ ఫ్యామిలీ సాగర తీరంలో సేద తీరేందుకు..అద్భుతమైన ప్యాలెస్ కట్టారని ముందు నుంచి ఆరోపిస్తూ వస్తోంది కూటమి. అందులో బాత్ టబ్‌లు, లైటింగ్ అరేంజ్‌మెంట్స్..సీ వ్యూ..అంతా జగన్ ఇష్ట ప్రకారం..అతని కుటుంబ సౌఖ్యం కోసం నిర్మించారని విమర్శిస్తున్నారు. ఈ అలిగేషన్స్‌ను తిప్పికొట్టడంతో వైసీపీ ఇప్పటికీ ఫెయిల్ అవుతూ వస్తూనే ఉంది.ఈ క్రమంలో అదే రుషికొండ భవనాలను అస్త్రంగా చేసుకుని జగన్‌ను, వైసీపీని సందర్భం దొరికినప్పుడల్లా ర్యాగింగ్ చేస్తున్నాయి కూటమి పార్టీలు. పైగా మెంటల్ హాస్పిటల్‌గా మారుస్తామన్న ప్రతిపాదనను తెరమీదకు తెచ్చి ఇండైరెక్టుగా జగన్‌ను టార్గెట్ చేస్తోంది. వైసీపీ హయాంలో తుగ్లక్ పాలన జరిగిందని..టీడీపీ, బీజేపీ, జనసేన మొదటి నుంచి విమర్శిస్తూ వస్తున్నాయ్. కానీ ఇది రాజకీయ విమర్శగానే భావించారు జనం. కానీ ఇప్పుడు రుషికొండ భవనాలను మెంటల్ హాస్పిటల్‌గా మారుస్తామన్న టాక్‌తో..మళ్లీ జగన్‌ను ర్యాగింగ్ చేస్తోంది కూటమి. రుషికొండ భవనాలపై ప్రభుత్వం నిర్ణయం ఎలా ఉ ండబోతుందో..వైసీపీ రియాక్షన్ ఏంటో చూడాలి మరి.

## పరకాల లక్ష్యం ఏమిటీ

విజయవాడ, అక్టోబరు 16 (

ఒకప్పుడు చంద్రబాబుకు అత్యంత నమ్మకమైన మిత్రుడిగా ఉన్న పరకాల ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం కలిగిస్తున్నాయి. 2014 లో రాష్ట్ర విభజన జరిగిన తర్వాత పరకాల ప్రభాకర్ చంద్రబాబు ప్రభుత్వంలో కీలకంగానే ఉన్నారు. సలహాదారుగా పనిచేశారు. తర్వాత ఆయన ఇక రాజకీయాలకు దూరమయ్యారు. కేవలం అప్పడప్పుడు విశ్లేషణలు మాత్రమే చేస్తున్నారు. పరకాల ప్రభాకర్ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భర్త. హైదరాబాద్ లో ఉన్న పరకాల ప్రభాకర్ ఒక యూట్యూబ్ ఛానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సంచలన వ్యాఖ్యలు చేశారు. అదీ గత ఎన్నికల్లో జరిగిన లోటుపాట్లను ఆయన ఎత్తి చూపారు. 2024 లో జరిగిన ఎన్నికల్లో దేశంలో ఐదు కోట్ల ఓట్లు అదనంగా లెక్కింపులో రావడం జరిగిందన్నారు. దేశ వ్యాప్తంగా 174 నియోజకవర్గాల్లో ఓట్ల శాతం పోల్ అయిన దానికంటే పెరిగితే మిగిలిన చోట్ల ఓట్ల శాతం తగ్గిందంటూ పరకాల అన్నారు. గత ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా పోలయిన ఓట్ల కటే ఐదు కోట్ల ఓట్లు లెక్కింపులో అదనంగా వచ్చాయని ఆయన చెప్పడం మాట అటుంచితే ఆయన ఆంధ్రప్రదేశ్ రాజకీయాల విషయాలను కూడా ప్రస్తావించారు. 2024 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ లో 49 లక్షల ఓట్లు అదనంగా కౌంటింగ్ లోకి రావడాన్ని పరకాల ప్రభాకర్ చెప్పడం ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. అందుకే గెలిచే వాళ్లు ఓడిపోయారు.. ఓడిపోయే వాళ్లు గెలిచారంటూ కామెంట్స్ చేశారు.గత ఎన్నికల్లో వైసీపీకి 40 శాతం ఓట్లు వచ్చాయి. కూటమిలో ఉన్న టీడీపీ, బీజేపీ, జనసేనలకు అధికారం దక్కింది. ఈవీఎంలో జరిగిన లోపాల వల్లనే తమకు అన్యాయం జరిగిందంటూ ఎన్నికల ఫలితాల తర్వాత వైసీపీ పదే పదే ఆరోపణలు చేస్తుంది. ఒంగోలులో పోటీ చేసిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులు రెడ్డి సయితం న్యాయస్థానాన్ని ఆశ్రయించి తిరిగి లెక్కించాలని కోరారు. వైసీపీ నేతలకు కేవలం పదకొండు సీట్లకు మాత్రమే పరిమితం కావడంతో వారు విమర్శలకు దిగారు. ఇప్పుడు చంద్రబాబుకు ఒకనాడు సన్నిహితంగా ఉన్న పరకాల ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలతో మరోసారి ఈ విషయం టాపిక్ గా మారింది.

# పవన్... స్వపక్షంలో విపక్షం

కాకినాడ, అక్టోబరు 16

పవన్ కల్యాణ్.. హీరోగా..ఓ పొలిటీషియన్‌గా ఈ పేరే ఓ బ్రాండ్. పార్టీ పెట్టి పదేళ్లు పోరాడిన పవన్..అప్పట్లో వైసీపీ ప్రభుత్వ తీరుపై ఓ రేంజ్‌లో మండిపడేవారు. ఎప్పటికప్పుడు సమస్యలను ఎక్స్‌పోజ్ చేస్తూ..ప్రశ్నించే గళంగా ప్రజల మన్ననలను పొందారు పవర్ స్టార్. ఇప్పుడాయన ఫ్యూర్ పొలిటిషయన్. అయినా సరే తానేం మారలేదంటున్నారు పవన్. ఎప్పుడూ ప్రజల పక్షామే..జనం సమస్యే తన ఎజెండా అన్నట్లుగా కూటమి ప్రభుత్వంలో అపోజిషన్ పాత్ర పోషిస్తున్నారుఏ చిన్న అంశమైన విపక్ష వైసీపీ కంటే పవన్ స్పందిస్తున్నారు. ఉపముఖ్యమంత్రి హోదాలో ఎక్కడికి వెళ్లినా ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న పవన్..వాటి పరిష్కారంపై స్పెషల్ కాన్సంట్రేషన్ పెడుతున్నారు. లేటెస్ట్‌గా కాకినాడ జిల్లాలో సముద్ర కాలుష్యంపై క్షేత్రస్థాయి పర్యటన చేసిన పవన్..పీసీబీ అధికారులతో సమీక్షించి కాలుష్యం నివారణకు పకడ్బందీ ప్లాన్ తయారు చేయాలని ఆదేశించారు. ఉప్పాడ మత్స్యకారుల సమస్యలను పరిష్కరించేందుకు టైమ్ బాండ్ ఫిక్స్ చేసుకున్నారు. సమస్యలను పరిష్కరించలేని నాడు రాజకీయాల నుంచి తప్పుకుంటానంటూ బోల్డ్ స్టేట్‌మెంట్ ఇచ్చి చర్చకు దారి తీశారు.ఇక మంత్రివర్గ



సమావేశంలో లులు గ్రూప్ విషయంలో ఏకంగా ప్రశ్నల వర్షమే కురిపించారు పవన్. లులు గ్రూప్ పెట్టే కండిషన్లతో ఏపీకి వచ్చే పెట్టుబడులు ఎన్ని.? ఇచ్చే ఉపాధి ఎంత అనే అంశాలపై ఆయన అధికారులను ప్రశ్నిలు వేస్తూ ఉక్కిరి బిక్కిరి చేసేశారట. ఎంతో విలువైన భూముల ఇస్తే ఆ పరిశ్రమలు ద్వారా స్థానికులకు వచ్చే లబ్ధి ఎంత అనేదానిపై పవన్ వాయిస్ రేజ్ చేశారట. ఇక ఉచిత పథకాలు ఎవరికి.? ఎందుకు? అనే కోణంలో పవన్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం రేపుతున్నాయి.ఏపీలో యువత ఉచితాలు, సంక్షేమ పథకాలు అడగడం లేదు..25 సంవత్సరాల భవితను కోరుకుంటున్నారని పవన్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. అయితే రాష్ట్ర సర్కారులో కీలక భాగస్వామిగా ఉన్న పవన్..ఉచిత పథకాలు ఎవరూ కోరుకోవడం లేదని చెప్పడం విమర్శలకు దారితీసింది. అయితే తన అభిప్రాయాన్ని ఓపెన్‌గా చెప్పేయడం పవన్ నైజం. అధికారంలోకి వచ్చిన కొత్తలో కాకినాడ రేషన్ బియ్యం ఇష్యూలో సీజ్ ది షిప్ అని అందరి దృష్టిని ఆకర్షించారు.పవన్ వ్యాఖ్యలు కూటమిలో అసంతృప్తి రాగం అన్నట్లుగానే బయటికి కనిపిస్తున్నాయి. కానీ పవన్ కల్యాణ్ రూటెప్పుడు సెపరేటు. ఆయనకు వామపక్ష భావజాలం అంటే ఇష్టం. చేగువేరా సిద్ధాంతాలను తన ప్రసంగాల్లో ప్రస్తావిస్తూ..నిత్యం ప్రశ్నించే గళంగా ఉండేందుకు ఇష్టం పడతారు. ఇప్పుడు అధికారంలో ఉన్నా..కొన్ని విషయాల్లో ప్రజా కోణంలో..ఓపెన్‌గానే తన అభిప్రాయాన్ని చెప్పేస్తున్నారు. సేనాని కామెంట్స్‌ను వైసీపీ అస్త్రంగా మల్చుకునే ప్రయత్నం చేస్తోంది.

## ప్రశాంత్ అస్త్ర సన్యాసం



పాట్నా అక్టోబరు 16,

ప్రశాంత్ కిశోర్.. తెలుగు రాష్ట్రాల ప్రజలకు సుపరిచితమైన పేరే.. ముద్దుగా పీకేగా పిలుచుకునే ఇతను మాజీ ఎన్నికల స్ట్రాటజిస్టు. 2014లో కేంద్రంలో బీజేపీ గెలవడానికి, తెలంగాణలో బీఆర్ఎస్ అలియాస్ టీఆర్ఎస్ గెలవడానికి పనిచేశారు. 2019లో ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీని గెలిపించారు. అనేక రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీల తరఫున పనిచేశారు. అయితే ఇప్పుడు బిహార్‌లో సొంత పార్టీ పెట్టారు. జన్‌సురాజ్ పార్టీ పేరుతో మూడేళ్ల క్రితమే పార్టీని ప్రారంభించారు. అయితే ఎన్నికల వ్యూహకర్త అయిన పీకే.. బిహార్‌లో ఇప్పుడు తన పార్టీ గెలుపును మాత్రం అంచనా వేయలేకపోతున్నారు. ఒంటరిగా అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దిగిన పీకే.. తాను మాత్రం ఎన్నికల్లో పోటీ చేయనని ప్రకటించారు.ప్రశాంత్ కిశోర్ రాఘోపూర్, కర్గాహర్ నియోజకవర్గాల్లో ఏదో ఒకస్థానం నుంచి పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. కానీ ఆయా స్థానాల్లో చంచల్ సింగ్, రితేష్ రంజన్ పాండేను జన్ సురాజ్ పార్టీ అభ్యర్థులుగా ప్రకటించారు. దీంతో ఆయన పోటీ చేయరని స్పష్టమైంది.దగ్గుబాటి, ప్రసారం వంటి ప్రముఖ ప్రభుత్వ విద్యార్థులు, కార్యకర్తల ఆధారంగా తిరువనంతపురంను బలపరిచేందుకు ప్రశాంత్ కిశోర్ ప్రయత్నిస్తుండడం రాజకీయ వ్యూహం యొక్క కీలకమయిన అంశమని అభిప్రాయ వ్యతిరేకులు పేర్కొంటున్నారు. ఎన్డీయే కూటమి ఈ ఎన్నికల్లో ఘోరమైన ఓటమి భవిష్యత్తును ఎదుర్కోవాల్సి ఉందన్న ధీమా ఆయన వ్యక్తం చేశారు. జన్ సురాజ్ పార్టీ ప్రధాన లక్ష్యం ఆరు రాష్ట్రాల్లో 150 స్థానాలకు పైగా సాధించడం. ఒక సీటు కూడా తగ్గితే విజయం లేనిట్టేనని స్పష్టం చేశారు. అభ్యర్థుల ఎంపికలో సామాజిక సమూహాల ప్రతినిధిత్వానికి ప్రాధాన్యత కల్పించారు, అందులో అతి పిన్న వర్గాలు, మైనారిటీలు, యువత ప్రాముఖ్యత పొందాయి. ప్రశాంత్ కిశోర్ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తూనే నాయకత్వంలో వ్యూహాత్మక మార్గదర్శకుడిగా వ్యవహరిస్తామని తెలుస్తోంది. ప్రత్యక్ష ఎన్నికల్లో పాల్గొనకపోయినా, జన్ సురాజ్ పార్టీని బలపరచడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ స్థితిగతులు బిహార్ రాజకీయ వేదికపై జన సురాజ్ పార్టీకి కొత్త మైలురాయిగా నిలుస్తాయి.

## గన్నవరంలో రోడ్డు ప్రమాదం వ్యక్తి మృతి

గన్నవరంఅక్టోబరు 16 (

గన్నవరం ఆర్టీసీ బస్టాండ్ దగ్గర జాతీయ రహదారిపై లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. బాపులపాడు మండలం కోడూరుపాడు గ్రామానికి చెందిన గరికపాటి సుబ్బారావు రిటైర్డ్ రైల్వే ఎంప్లాయ్ గా గుర్తించారు. రైతు బజార్ లో కూరగాయలు కొనుక్కొని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతున్న సుబ్బారావు ను లారీ ఢీకొంది. సుబ్బారావు ఘటన స్థలంలోనే మృతి చెందాడు. లారీ డ్రైవర్ పరారీ అయ్యాడు. గన్నవరం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## సుమంత్ విషయం నాకు తెలియదు- కొండా మురళీ

హైదరాబాద్ అక్టోబరు 16 మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్టీ సుమంత్ విషయం తనకు తెలియదని ఆమె భర్త కొండా మురళీ చెప్పారు. నిన్న హైదరాబాద్ లో మంత్రి ఇంటి వద్ద హైడ్రామా పై హన్మకొండలో ఆయన మీడియాతో మాట్లాడారు. తన కూతురు పార్టీలోగానీ పదవిలోగానీ లేదన్నారు. సీఎం రేవంత్ తనకు ఎమ్మెల్సీ ఇస్తానన్నారని వెల్లడించారు. పొంగులేటి వివాదంపై స్పందిస్తూ 'సీఎం, పొంగులేటి మా ఇంటికీ వచ్చారు. వారు నన్నెందుకు టార్గెట్ చేస్తారు?' అని వ్యాఖ్యానించారు.

# వైసీపీకి ఏమైంది...

విజయవాడ, అక్టోబరు 16,

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో అసలు ఏం జరుగుతోంది? ఆ పార్టీ గత వైభవం దిశగా అడుగులు వేసే పరిస్థితి ఉందా? 2029 ఎన్నికల్లో సత్తా చాటే పరిస్థితి ఉందా? అసలు ఆ పార్టీలో ఏం జరుగుతోంది? ఇప్పుడు ఏపీ పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. 2014 ఎన్నికల్లో ఆ పార్టీ ప్రతిపక్షానికి పరిమితం అయింది. కానీ అనతి కాలంలోనే అధికార టిడిపికి చుక్కలు చూపించింది. కానీ ఇప్పుడు ఎందుకు ఆ పరిస్థితి లేదు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విఫలమైందా? లేకుంటే టీడీపీ కూటమి ప్రభుత్వం గుణపాఠం నేర్చుకుందా? దీనిపై బలమైన చర్చ నడుస్తోంది. అయితే అప్పటికి ఇప్పటికీ కేంద్రం వైఖరి మారింది. అదే తెలుగుదేశం కూటమికి ప్లస్సు అయ్యింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మైనస్ గా పరిణమించింది.2014లో ఎన్డీఏలో కీలక భాగస్వామిగా ఉంది తెలుగుదేశం పార్టీ. అంతకుముందు బిజెపి వాజ్పేయి నేతృత్వంలో ఉండేది. ఆ తరువాత స్థానం లాల్ కృష్ణ అద్వానీ అలియాస్ ఎల్కే అద్వానీ ఉండేది.



అప్పటికే చంద్రబాబు చతురత పనిచేసేది. మిగతా నేతలతో పోల్చుకుంటే చంద్రబాబు సీనియర్ కూడా. వయసు రీత్యా అటల్ బిహారీ వాజ్పేయి సీనియర్ కానీ.. క్షేత్రస్థాయిలోకి వచ్చేసరికి చంద్రబాబు అప్పటికే తనకు తాను నిరూపించుకున్నారు. ముఖ్యంగా నందమూరి తారక రామారావును అధికారానికి దూరం చేసి తాను సొంతం చేసుకున్నారు. అంతటి ప్రతికూల పరిస్థితుల్లో సైతం 1999 ఎన్నికల్లో ఉమ్మడి ఏపీలో గెలిచారు. అందుకే చంద్రబాబుకు వాజ్పేయి తో పాటు ఎల్కే అద్వానీ ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు. కానీ 2014లో మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ మరోసారి ఎన్డీఏకు దగ్గరయింది కానీ.. మునుపటి బిజెపి పెద్దల మాదిరిగా చంద్రబాబును నమ్మే స్థితి లేదు. దాని పర్యవసానం అనుభవించారు చంద్రబాబు. దాని నుంచి గుణపాఠాలు నేర్చుకుని 2024 ఎన్నికల్లో సర్వశక్తులు ఒడ్డి బిజెపిని తన ఆధీనంలోకి తెచ్చుకున్నారు చంద్రబాబు. అలా మూడు పార్టీల కలయికతో అద్భుత విజయం సొంతం చేసుకున్నారు. అయితే గత పరిస్థితుల దృష్ట్యా పవన్ కళ్యాణ్ బలమైన మద్దతుదారుడుగా మార్చుకున్నారు చంద్రబాబు. తద్వారా భారతీయ జనతా పార్టీని సైతం తన ఆధీనంలోకి తెచ్చుకున్నారు. ఎందుకంటే ఒక జాతీయ పార్టీగా మూడుసార్లు అధికారంలోకి వచ్చిన పార్టీకి ప్రజా వ్యతిరేకత అనేది సర్వసాధారణం. అదే సమయంలో మిత్రుల ద్వారా బలపడాలన్నది బిజెపి వ్యూహం. ఆ పార్టీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో పరిమితంగా ఉంది మిత్రపక్షాల పాత్ర. అదే సమయంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా పక్షం పెద్ద ప్రాంతీయ పార్టీలతో బలంగా ఉంది. అదే ఎన్డీఏ విషయంలో బిజెపి తర్వాత పెద్ద పార్టీగా టిడిపి ఉంది. అటు తరువాత నితీష్ నేతృత్వంలోని జెడియు, అకాలి దళ్, ఆపై దేవే గౌడ జెడిఎస్ ఉంది. అయితే ఉన్నంతలో తెలుగుదేశం పార్టీ సీనియర్. ఆపై చంద్రబాబు జాతీయస్థాయిలో మంచి నాయకుడు. అందుకే ప్రస్తుత పరిస్థితుల్లో తెలుగుదేశం పార్టీకి భారతీయ జనతా పార్టీ అధిక ప్రాధాన్యం ఇస్తూ వస్తోంది.అయితే బిజెపికి సిద్ధాంతపరంగా వ్యతిరేక పార్టీ వైయస్సార్ కాంగ్రెస్. ఆ పార్టీ పరోక్ష మద్దతు కే తప్ప.. ప్రత్యక్షంగా ఇచ్చే మద్దతుకు ప్రజలు హర్షించరు. ఆ విషయం బిజెపికి తెలుసు. అందుకే ఆ పార్టీని దూరంగా పెడుతోంది కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి. కానీ జగన్మోహన్ రెడ్డి తన వ్యక్తిగత అవసరాల దృష్ట్యా భారతీయ జనతా పార్టీతో మమేకం అయ్యేందుకు ప్రయత్నం చేస్తున్నారు. అది పొలిటికల్ గా చాలా డ్యామేజ్ చేస్తోంది. 2014లో బలమైన ప్రతిపక్షంగా వైయస్సార్ కాంగ్రెస్ ఉంది. 2019లో ఏకపక్షంగా అధికారాన్ని సొంతం చేసుకుంది. 2024లో డిజాస్టర్ ఫలితాలను చవిచూసింది. అయినా సరే ఆ పార్టీ ఎందుకో ఇంకా బీజేపీ అంటూ జపం చేస్తోంది. అది ఎంత మాత్రం నష్టం తప్ప లాభం లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వైఖరిలో మాత్రం మార్పు రావడం లేదు.

## పాకిస్తాన్ కు ఓ వైపు.. అమెరికా..మరో వైపు చైనా


హైదరాబాద్, అక్టోబరు 16,

యుద్ధం జరిగిన ప్రతీసారి భారత్ చేతిలో చావుదెబ్బతింటోంది మన దాయాది దేశం. యుద్ధంలోనే కాదు క్రికెట్‌లోనూ అదే పరిస్థితి. వాపును చూపుకుని బలుపుగా భావిస్తూ భారత్‌తో కయ్యానికి కాలుదువ్వుతుంది.. దెబ్బ కొట్టగానే కాళ్ల బేరానికి వస్తోంది. ఇటీవల ఆపరేషన్ సిందూర్ దెబ్బకు ఎయిర్ బేస్‌లకు ప్యాచ్ వర్క్ చేసుకుంటున్న పాకిస్తాన్‌కు ట్రంప్ అండగా నిలిచారు. మొన్నటి వరకు చైనా అండ చూసుకుని ఎగిరెగిరి పడిన పాకిస్తాన్.. ఇప్పుడు అమెరికా అండతో భారత్‌పై రివేంజ్ తీసుకోవాలని భావిస్తోంది.పాకిస్తాన్ ఇప్పటివరకు చైనా మద్దతుతో నిలబడింది. అయితే 2025లో, పాక్ కొత్త వ్యూహంగా అమెరికా చేతితో డీల్ చేసేందుకు యత్నిస్తున్నట్టు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. దీన్ని సుదీర్ఘ కాలంగా మాదిరిగా భావించి, అమెరికా కూడా పాకిస్థాన్ వ్యూహాల్లో మరింత పలకరించటం కనిపిస్తోంది. అయితే, అమెరికా అధ్యక్షుడైన ట్రంప్ మామూలోడు కాదని, అవసరమైతే కఠిన నిర్ణయాలు తీసుకునే వ్యక్తి కాబట్టి, పాక్ మరోసారి తప్పుకోకపోతుందని భావిస్తున్నారు.పాక్ చైనాతో కూడిన ఒప్పందాలు, ఆర్థిక సహకారాలు పెద్ద మొత్తంలో ఉన్నా, పాకిస్తాన్ అంతర్గతంగా సవాళ్లు ఎదుర్కొంటుంది. పెరిగిన అప్పులు, రాజకీయ అస్థిరతలు తలనొప్పులుగా మారాయి. అందువల్ల, పాక్ అల్టర్నేటివ్ మద్దతుల కోసం అమెరికాను కోరుతోంది. అయితే, అమెరికా?పాక్ డీల్ లో అమెరికా దృష్టి మరింత కఠినపడి, పాక్ ప్రవర్తనపై కట్టుదిట్టం పెరిగే అవకాశాలు ఉన్నాయి,

అంటే పాక్ ఈసారి మరల పొరపాటు చేయటం దీర్ఘకాలంలో దుష్పరిణామాలు కలుగజేయవచ్చు.పాకిస్తాన్ వ్యూహాలు భారత భద్రతా విశ్లేషకులకు పెద్ద సవాలు. ప్రస్తుతం, పాక్?చైనా సంబంధాల మధ్య తాత్కాలిక మార్పులు వస్తున్నప్పటికీ, ఇండియా కీలక కారణంగా మిగిలి ఉంటుందని అంచనా. భారతం తన భద్రతా పథకాలను మరింత గట్టి చేస్తూ, అంతర్జాతీయ మైదానంలో కొత్త చట్టాలు, దృఢత చూపించాల్సి ఉంటుంది. ట్రంప్ మాదిరి కట్టుదిట్ట నేత నేతృత్వం కారణంగా, అమెరికా?భారత్?ఇతర మైత్రి సంబంధాలు పాకిస్తాన్ వ్యూహాలను సమర్ధవంతంగా ఎదుర్కోవడానికి కీలకం అవుతాయి.పాక్?భారత్ మధ్య భవిష్యత్ గణనీయమైన మార్పులు చూస్తామని సూచిస్తున్నారు. పాక్ ఇప్పుడు అమెరికా చేతితో ప్రయోగాలు చేస్తుండగా, భారత్ దీన్ని గమనించి సహజ ప్రతిస్పందన చర్యలను పలు మెలకువలతో చేర్పించాల్సి వస్తుంది.

## దేవినాని అవినాష్‌కు కలిసి రాని కాలమేనా

విజయవాడ, అక్టోబరు 16 (



వైసీపీకి చెందిన యువనేత దేవినేని అవినాష్ ఈసారి నియోజకవర్గం మార్చబోతున్నారు. దేవినేని నెహ్రూ కుమారుడిగా రాజకీయాల్లోకి వచ్చిన దేవినేని అవినాష్ ఇప్పటి వరకూ చట్టసభల్లో అడుగు పెట్టలేదు. ఒకప్పుడు విజయవాడ రాజకీయాలను ఒక ఊపు ఊపిన దేవినేని కుటుంబం ఇప్పుడు గెలుపు కోసం పరితపించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దేవినేని నెహ్రూ విషయంలో అలా జరగలేదు. ఆయన ఎమ్మెల్యేగా, మంత్రిగా అనేక పదవులు అనుభవించారు. దమ్మున్న నేతగా జనంలో ముద్ర పడ్డారు. కానీ ఆయన తనయుడు దేవినేని అవినాష్ కు మాత్రం రాజకీయాలు కలిసి రావడం లేదనే అనిపిస్తుంది. ఆయన గత కొన్ని ఎన్నికల నుంచి పోటీ చేయడం ఓటమి పాలు కావడం సాధారణంగా మారింది. దేవినేని నెహ్రూ జీవించి ఉన్న సమయంలోనే 2014లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా విజయవాడ పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2016 లో తన తండ్రి నెహ్రూతో కలసి దేవినేని అవినాష్ టీడీపీలో చేరారు. నాడు టిక్కెట్ దక్కకపోయినా రాష్ట్ర టీడీపీ యువత అధ్యక్షుడిగా చంద్రబాబు నాయుడు నియమించారు. 2019 ఎన్నికల్లో గుడివాడ టిక్కెట్ దక్కింది. టీడీపీ నుంచి పోటీ చేసిన దేవినేని అవినాష్ నాటి ఎన్నికల్లో కొడాలి నాని చేతిలో ఓటమి పాలయ్యారు. తర్వాత ఆయన అదే ఏడాది వైసీపీలో చేరారు. దేవినేని అవినాష్ ను విజయవాడ తూర్పు నియోజకవర్గం ఇన్ ఛార్జిగా వైసీపీ అధినేత జగన్ నియమించారు. ఆ రకంగా టిక్కెట్ దక్కుతుందని ఆయన భావించారు.పెనమలూరు నుంచి... 2024 ఎన్నికల్లో విజయవాడ తూర్పు నియోజకవర్గ అభ్యర్థిగా దేవినేని అవినాష్ పేరును ప్రకటించారు.కానీ ఆ ఎన్నికల్లో దేవినేని అవినాష్ తో పాటు వైసీపీ కూడా అధికారం కోల్పోయింది. దీంతో పాటు అనేక కేసులు దేవినేని అవినాష్ పై నమోదయ్యాయి. అదే సమయంలో తూర్పు నియోజకవర్గం కంటే తనకు పెనమలూరు నియోజకవర్గం బెటర్ అని పార్టీ అధినేత జగన్ కు చెప్పినట్లు తెలిసింది. పెనమలూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసేలా ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నారు. తన తండ్రి దేవినేని నెహ్రూ గతంలో కంకిపాడు నియోజకవర్గం నుంచి పోటీ చేయడంతో అక్కడ తనకు బలమైన ఓటు బ్యాంకు ఉందనినమ్ముతున్నారు. మరి జగన్ పెనమలూరు విషయంలో దేవినేని అవినాష్ కోరికను తీరుస్తారా? లేదా? అన్నది చూడాలి.

# మిధున్ రెడ్డిని వెంటాడుతున్న సిట్

తిరుపతి, అక్టోబరు 16

ఏపీలో మద్యం కుంభకోణం ప్రకంపనలు సృష్టించింది. ప్రస్తుతం ఈ కేసు విచారణ చేపడుతుంది ప్రత్యేక దర్యాప్తు బృందం. ఒకవైపు విచారణ కొనసాగుతోంది. 29 మంది నిందితులకు గాను 12 మంది అరెస్టయ్యారు. అయితే లోతైన దర్యాప్తు చేస్తుండగా.. నిందితులు ఒక్కొక్కరికి బెయిల్ లభిస్తోంది. ఈ క్రమంలో బెయిల్ పై బయటకు వచ్చిన ఎంపీ పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి కార్యాలయాలతో పాటు నివాసాల్లో సిట్ తనిఖీలు చేపడుతుండడం విశేషం. మరోవైపు ఎంపీ మిథున్ రెడ్డి బిజెపిలో చేరతారని ప్రచారం సాగింది. ఈ క్రమంలో ఆయన ఐక్యరాజ్యసమితికి వెళ్లే పార్లమెంటరీ బృందంలో ఒక సభ్యుడిగా ఉండడం ప్రాధాన్యత సంతరించుకుంది. బిజెపిలో చేరుతారన్న అనుమానాలను మరింత బలపరిచింది. అయితే ఈరోజు తిరుపతి తో పాటు హైదరాబాద్, బెంగళూరు నివాసాల్లోను సోదాలు జరుగుతున్నాయి.వైయస్ జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి. అప్పట్లో మద్యం లావాదేవీలు అన్ని మిథున్ రెడ్డి చూసేవారని టాక్ ఉంది. వైసీపీ హయాంలో ప్రతి శనివారం తాడేపల్లికి వచ్చి.. లిక్కర్ లెక్కలు చెప్పేవారని వైసీపీలోని ప్రచారం సాగుతోంది. ఈ విషయాన్ని వైసిపి నేతలే బహిరంగంగా వ్యాఖ్యానిస్తుంటారు కూడా. అయితే మద్యం కుంభకోణంలో అంతిమ లబ్ధిదారుడు తో సమానంగా.. పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి కమిషన్ల రూపంలో ఎక్కువగా వసూలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.



అయితే ఇటీవల పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి కోర్టులో బెయిల్ లభించింది. అయితే చంద్రబాబుతో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఒప్పందం చేసుకున్నారన్న అనుమానాలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి వినిపించాయి. అందుకే చాలా రకాల కేసుల్లో పెద్దిరెడ్డికి మినహాయింపు లభించింది అన్న కామెంట్స్ ఉన్నాయి. పైగా ఎన్నికల సమయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తుడుచుపెట్టుకుపోయింది. అటువంటి సమయంలో పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులందరూ గెలిచారు. ఇలా గెలవడం వెనుక మ్యాచ్ ఫిక్సింగ్ ఉందన్న అనుమానాలు జగన్మోహన్ రెడ్డిలో బలంగా పెరిగాయి. ఆ కారణం చేతనే తాజాగా పెద్దిరెడ్డి మిధున్ రెడ్డిని దూరం పెట్టారన్న టాక్ వినిపిస్తోంది. ప్రధానంగా పెద్దిరెడ్డి కి చెందిన పి ఎల్ ఆర్ కంపెనీల ద్వారానే మద్యం కుంభకోణంలో లభించిన బ్లాక్ మనీని.. వైట్ గా మార్చారన్న అనుమానాలు ఉన్నాయి. ఆ అనుమానం తోనే పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి పై కేసు నమోదు చేసింది ప్రత్యేక దర్యాప్తు బృందం. అయితే పిఎల్ఆర్ కంపెనీల ద్వారా జరిగిన లావాదేవీల విషయంలో సిట్ పట్టు బిగిస్తున్నట్లు తెలుస్తోంది. అది తెలిసి జగన్మోహన్ రెడ్డి తన వరకు వస్తుందన్న అనుమానంతోనే పెద్దిరెడ్డి కుటుంబాన్ని సైడ్ చేసినట్లు ప్రచారం సాగుతోంది. మొత్తానికైతే ఎంపీ మిధున్ రెడ్డి ని టార్గెట్ చేసుకొని సిట్ దర్యాప్తు చేస్తుండడం ప్రాధాన్యత సంతరించుకుంది.

మద్యం మలుపులు

కల్తీ మద్యం కేసులో అనేక ట్విస్టులు చోటు చేసుకుంటున్నాయి. అయితే ఈ కేసులో ప్రధాన నిందితుడైన జనార్ధన్ రావు విడుదల చేసిన వీడియో పై వైసీపీ సోషల్ మీడియాలో అనేక ప్రశ్నలు వినిపిస్తున్నాయి. జనార్ధన్ రావు చేత తప్పుడు స్టేట్ మెంట్ ఇప్పించారంటూ వైసీపీ నేతలు నేరుగానే విమర్శలు చేస్తున్నారు. కల్తీ మద్యం కేసును వైసీపీ మెడకు చుట్టాలన్న ప్రయత్నంలో చేసిన హడావిడిలో అసలు విషయాలను మర్చిపోయి వ్యవహరించారన్నది వైసీపీ నేతలు ఘాటుగానే విమర్శలు చేస్తున్నారు. జనార్ధన్ రావు వీడియోలో తనకు మాజీ మంత్రి జోగి రమేష్ చెబితేనే తాను కల్తీమద్యం ప్లాంట్ ను ములకలచెరువులో పెట్టానని అన్నారు. అప్పుడే తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంపై బురద జల్లేందుకు వీలవుతుందని ఆయన తెలిపారు. అయితే జనార్ధన్ రావు ఆఫ్రికాలో ఉన్న సమయంలో ఒక వీడియోను విడుదల చేశారు. ఈ వీడియోలో కూడా కల్తీ మద్యం కేసులో టీడీపీ నేతలకు సంబంధం లేదని చెప్పి సంకేతాలిచ్చారని, ఆ తర్వాతనే జనార్ధన్ రావును విదేశాల నుంచి రావాలని చెప్పడంతో ఆయన వచ్చాడని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. నిజానికి జోగి రమేష్ కు అత్యంత సన్నిహిత మిత్రుడైతే జనార్ధన్ రావు విదేశాల నుంచి రాకూడదని, కానీ తానే వచ్చి .. అంతే కాకుండా తాను వస్తున్న సమాచారాన్ని కూడా ఎక్సైజ్ పోలీసులకు ఇచ్చి గన్నవరం ఎయిర్ పోర్టులో అరెస్ట్ కావడం వెనక పెద్ద కుట్ర జరిగిందన్నది వైసీపీ నేతల ప్రధాన ఆరోపణ. కల్తీ మద్యం కేసులో జనార్ధన్ రావును పక్కనపెడితే అదే కేసులో ఉన్న జయచంద్రారెడ్డితో పాటు మరికొందరు నేతలు టీడీపీకి చెందిన వారేనని వైసీపీ నేతలు అంటున్నారు. వైసీపీ నేతలు సీబీఐ విచారణ కోరటం వెనక కొన్నేళ్ల పాటు కేసు విచారణలో తాత్సారం చేయడానికేనని చంద్రబాబు ప్రకటించిన గంటల్లోనే జనార్ధన్ రావు వీడియో విడుదల కావడం కూడా తమకు అనుమానంగా ఉందని అంటున్నారు. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం పై తమకు నమ్మకంలేదంటున్న వైసీపీ నేతలు ఈ కేసులో నిజానిజాలు వెలుగులోకి రావాలంటే సీబీఐకి అప్పగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం విచారణ పారదర్శకంగానే సాగుతుందని ఇందులో ఎలాంటి వివక్ష ఉండదని, రాజకీయ కుట్ర బయటపడుతుందన్న కారణంతోనే వైసీపీ నేతలు ఇలా మాట్లాడుతున్నారని టీడీపీ నేతలు కౌంటర్ ఇస్తున్నారు. మొత్తం మీద ములకల చెరువు కల్తీ మద్యం కేసులో ఎప్పుడు ఏ రకమైన ట్విస్ట్ చోటు చేసుకుంటుందన్నది మాత్రం ఆసక్తికరంగానే మారింది.

# అశ్వరావుపేట మండలాన్ని మాదక ద్రవ్య రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

ఖమ్మం అక్టోబరు 16,

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు అశ్వరావుపేట పోలీసుల ఆధ్వర్యంలో నెల రోజుల పాటు చైతన్యం పేరుతో పలు కార్యక్రమాలను నిర్వహించడం



జరుగుతున్నదని అశ్వారావుపేట సీఐ నాగరాజు రెడ్డి తెలిపారు.

అశ్వారావుపేట మండలంలో మాదక ద్రవ్యాల సమూల నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు భాధ్యతను నిర్వర్తించాలని అశ్వరావుపేట సీఐ నాగరాజు రెడ్డి పిలుపునిచ్చారు. చైతన్యం పేరుతో నెల రోజుల పాటు అశ్వారావుపేట మండలం వ్యాప్తంగా పోలీసుల ఆధ్వర్యంలో గంజాయి వంటి మత్తు పదార్థాల నిర్మూలన కోసం అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగానే ఈ రోజు అశ్వరావుపేట రింగ్ సెంటర్ వద్ద మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలను గురించి అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ నెల రోజుల పాటు పోలీసులు చేపట్టే కార్యక్రమాలలో ప్రజలు కూడా భాగస్వాములై తమ వంతు భాధ్యతగా సహకారం అందించాలని కోరారు. మత్తుకు బానిసలుగా మారిన యువత తమ అమూల్యమైన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, వారిలో చైతన్యం నింపేందుకే జిల్లా ఎస్పీ గారి ఆదేశాలతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. అశ్వరావుపేట పట్టణంలో గంజాయి హాట్స్పాట్స్ లో నిత్యం తనిఖీలు చేపట్టడం, ఎవరైనా మత్తు పదార్థాలను సేవిస్తూ పట్టుబడితే వారికి కౌన్సిలింగ్ నిర్వహించడం, వాహన తనిఖీలు వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఎవరైనా నిషేధిత గంజాయిని రవాణా చేస్తున్నట్లు గానీ, విక్రయిస్తున్నట్లు గానీ, సేవిస్తున్నట్లు గానీ సమాచారం తెలిస్తే పోలీసు వారికి వెంటనే సమాచారం అందించాలని కోరారు.

# నగరంలో రేవ్ పార్టీ.. భగ్నం చేసిన పోలీసులు

రంగారెడ్డి అక్టోబరు 16,

మంచాల పోలీస్ స్టేషన్ పరిధిలో రేవ్ పార్టీ కలకలం రేపింది. లింగంపల్లి గ్రామంలోని ఓ ఫాంహౌస్‌లో రేవ్ పార్టీ నిర్వహిస్తున్నారన్న పక్కా సమాచారంతో ఫాం హౌస్‌పై పోలీసులు దాడి చేసి రేవ్‌పార్టీని భగ్నం చేశారు. రేవ్‌పార్టీలో 25 మంది పురుషులు, 8 మంది మహిళలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. 2 లక్షల 40 వేల నగదు, 15 మొబైల్ ఫోన్లు, 11 వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం రేవ్ పార్టీలో పాల్గొన్న వారిని మంచాల పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

# గూగుల్ తో రెండు లక్షల మందికి ఉపాధి అవకాశాలు

కాకినాడ అక్టోబరు 16,

ప్రపంచంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన గూగుల్ సంస్థ విశాఖలో ఏర్పాటు చేయనున్న డేటా సెంటర్ వల్ల ప్రత్యక్షంగాను, పరోక్షంగాను కలిపి సుమారు రెండు లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ పేర్కొన్నారు..

# మల్లోజుల ఆయుధం ఎందుకు వదిలారు

ముంబై, అక్టోబరు 16,

మావోయిస్టు విప్లవోద్యమ చరిత్రలో దాదాపుగా ఒక శకం ముగిసినట్టే. మావోయిస్టు దళంలో కీలక నాయకుడిగా పని చేసిన మల్లోజుల వేణుగోపాల్ రావు ఆయుధాన్ని పక్కన పెట్టారు. ఇన్ని రోజులపాటు అడవిలో అన్నగా వెలుగొంది న అతడు ఇకపై జనజీవన స్రవంతిలో కనిపించబోతున్నాడు. దశాబ్దాలుగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, చత్తీస్ గడ్, బీహార్ రాష్ట్రాలలోని అటవీ ప్రాంతాలలో తలదాచుకుని.. సమాంతర ప్రభుత్వాలు నిర్వహించిన అతడు.. ఇకపై సెలవంటూ ఆయుధాన్ని వదిలిపెట్టాడు. ఉద్యమం ఎక్కడుందో.. అక్కడే నీ కూడు ఉందని నినాదాలు చేసిన అతడు.. ఇప్పుడు జనజీవన స్రవంతిలో కలిసిపోయాడు. మల్లోజుల వేణుగోపాలరావు దాదాపు 40 సంవత్సరాలపాటు పోరాటం చేశాడు. దట్టమైన అడవులను కేంద్రంగా చేసుకొని ఉద్యమాలు చేశాడు. ఎన్నో హింసాత్మక ఘటనలలో పాలుపంచుకున్నాడు. సాధారణ మావోయిస్టుగా దళంలోకి ప్రవేశించిన అతడు దినదిన ప్రవర్తమానంగా ఎదిగాడు. ఏకంగా కేంద్ర కమిటీ ని శాసించే స్థాయికి ఎదిగాడు. 1981లో అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన అతడు ఏటూరు నాగారం దళసభ్యుడిగా ఆయుధాన్ని చేత పట్టుకున్నాడు. పార్టీలో అంతకంతకు విరిగిపోయాడు. 1983లో డికేస్ జడ్పీ సభ్యుడిగా.. 1995లో



కేంద్ర కమిటీ సభ్యుడిగా.. 2005లో పొలిటి బ్యూరో సభ్యుడిగా ఎన్నికయ్యాడు. గడచిన నాలుగు దశాబ్దల కాలంలో ఎన్నో హింసాత్మక ఘటనలలో పాలుపంచుకున్నాడు.. రాష్ట్ర పోలీసులకు, కేంద్ర దళాలకు కొరకరాని కొయ్యగా మారిపోయాడు. ఇటీవల కేంద్రం ఆపరేషన్ కగార్ చేపట్టింది. ఇందులో భాగంగా ఎంతోమంది మావోయిస్టులను అంతం చేసింది. దట్టమైన అడవులలో మావోయిస్టుల ఆనవాళ్లు లేకుండా చేస్తోంది. మావోయిస్టులకు పట్టు ఉన్న ప్రాంతాలలో కేంద్ర బలగాలు విస్తృతంగా దాడులు చేస్తున్న నేపథ్యంలో వారికి ఆవాసం అనేది లేకుండా పోయింది. దీంతో మావోయిస్టులు తుపాకులను పక్కన పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. అందువల్ల ఇటీవల హిడ్మా పేరుతో ఒక లేఖ విడుదలైంది. తుపాకులను వదిలిపెడతామని ఆ లేఖలో హిడ్మా పేర్కొన్నాడు. దీనిపై మావోయిస్టులలో భిన్న స్వరాలు వినిపించాయి. మావోయిస్టు సానుభూతిపరులు కూడా హిడ్మా లేఖను తప్పు పట్టారు. దీంతో మావోయిస్టులు తుపాకులను పక్కన పెట్టడం సాధ్యం కాదని అర్థమయిపోయింది. ఈ నేపథ్యంలోనే వేణుగోపాల్ రావు 60 మంది దళసభ్యులతో లొంగిపోతున్నట్టు మహారాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. . మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో వేణుగోపాలరావు తన 60 మంది దళ సభ్యులతో కలిసి లొంగి పోయారు. జనజీవన స్రవంతిలో కలిసిపోతున్నట్టు ప్రకటించారు.

దీంతో మావోయిస్టు ఉద్యమానికి ఎదురు దెబ్బ తగిలినట్టు అయింది. ఈ క్రమంలోనే మావోయిస్టులు ఇకపై జనజీవన స్రవంతిలో కలుస్తారని తెలుస్తోంది. కేంద్రం కూడా మావోయిస్టులతో శాంతి చర్చల ప్రసక్తి లేదని స్పష్టం చేసింది. అటు కేంద్ర బలగాలు ముప్పేట దాడి చేస్తున్న నేపథ్యంలో ఊపిరి ఆడని పరిస్థితి మావోయిస్టులకు ఏర్పడింది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో మావోయిస్టులు తుపాకులను పక్కన పెడుతున్నారు. వేణుగోపాలరావు జనజీవన స్రవంతిలో కలిసిన తర్వాత.. ప్రజా సమస్యల పరిష్కారానికి వేరే విధమైన ఉద్యమాలను చేపడతామని పేర్కొన్నారు. కాకపోతే అది శాంతియుత విధానంలో ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

# మహిళా కోచ్‌లో మగాళ్ళను ఎలా అనుమతిస్తారు..?

## - రైలు ప్రయాణీకురాలిపై అత్యాచార ఘటన బాధాకరం

## - గుంటూరు-పెదకూరపాడు స్టేషన్ల మధ్య ఘటనపై స్పందించిన మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ

అమరావతి: అక్టోబరు 16,

రైళ్ళల్లో మహిళలకు కేటాయించిన కోచ్ లలో మగాళ్ళను ఎలా అనుతిస్తారని ఏపీ మహిళా కమిషన్ డాక్టర్ రాయపాటి శైలజ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సంత్రగాచి స్పెషల్ రైలులో ప్రయాణిస్తున్న మహిళా ప్యాసింజర్ పై గుంటూరు, పెదకూరపాడు రైల్వే స్టేషన్ల మధ్య జరిగిన అత్యాచార ఘటనపై బుధవారం ఆమె స్పందించారు. ఘటన చాలా బాధాకరమన్నారు. ఈమేరకు ఘటన పూర్వాపరాలను గుంటూరు ఆర్పీఎఫ్ అధికారులతో మాట్లాడి చర్యలనిమిత్తం మహిళా కమిషన్ అధికారులను ఆమె ఆదేశించారు. దీంతో కార్యాలయ అధికారులు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ తో ఫోన్ లో సంప్రదించగా.. ఓ మహిళ రాజమహేంద్రవరంలో సంత్రగచి ప్రత్యేక ఎక్స్ప్రెస్ ట్రైన్లో చెర్లపల్లి దాకా ప్రయాణించడానికి ఎక్కగా.. ట్రైన్ గుంటూరు స్టేషన్లో ఆగిన సమయంలో, 40 సంవత్సరాల వయస్సున్న గుర్తు తెలియని వ్యక్తి మహిళా కోచ్లోకి ప్రవేశించాడని.. ఆగంతకుడు మహిళను కత్తితో బెదిరించి అత్యాచారానికి పాల్పడినట్లు సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు ఫిర్యాదు అందిందన్నారు. బాధితురాలి వద్దనున్న నగదు (రూ.5600) మరియు మొబైల్ ను దోచుకున్నట్లు ..పెదకూరపాడు స్టేషన్ దగ్గర రైలులోంచి దూకి పరారైనట్లు బాధితురాలు ఫిర్యాదిచ్చినట్లు చెప్పారు. సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులు బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా 'జీరో ఎఫ్ఐఆర్' నమోదు చేసి, కేసును నడికుడి పోలీస్ స్టేషన్కు బదిలీ చేసినట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడానికి పోలీసు బృందాలు దర్యాప్తు చేపట్టాయని.. బాధితురాలు చెబుతున్న ప్రకారం గుంటూరు, పెదకూరపాడు రైల్వేస్టేషన్ ల మధ్య మొబైల్ ట్రాక్ లోకేషన్లు, సీసీ ఫుటేజీలు, ఇతర సాంకేతికత ద్వారా నిందితుడ్ని పట్టుకునేందుకు చర్యలు చేపట్టామని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులు చెప్పారు.

డీఆర్ఎం, ఆర్పీఎఫ్ ఎస్పీలకు లేఖలు:

తక్షణమే ఈ కేసుపై వేగవంతమైన దర్యాప్తును ప్రారంభించి నేరస్తుడిని అదుపులోకి తీసుకుని కఠినంగా శిక్షించాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ రైల్వే




ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులను కోరారు. ఈమేరకు గుంటూరు రైల్వేస్టేషన్ డివిజనల్ మేనేజర్ (డీఆర్ఎం)కు, విజయవాడ రైల్వే సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు (ఎస్పీ), డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే సెక్యూరిటీ ఫోర్స్, గుంటూరు వారికి మహిళా కమిషన్ ద్వారా బుధవారం లేఖలు పంపారు. మహిళా ప్రయాణికుల భద్రతను నిర్ధారించే చర్యలు వేగవంతం చేయాలన్నారు. మహిళా కంపార్ట్మెంట్లో మహిళా కానిస్టేబుళ్లను డ్యూటీకి నియమించాలని, మహిళల కోచ్ లలో ప్రయాణించడానికి ప్రయత్నించకుండా పురుషులను నిరోధించడానికి ఆర్పీఎఫ్ క్రమం తప్పకుండా డ్రైవ్లను నిర్వహించాలని కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ కోరారు. రైళ్లలో ప్రయాణీకులకు సంబంధించిన భద్రతా లోపాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి చర్యలు చేపట్టాలన్నారు. ఒంటరి మహిళా ప్రయాణీకుల భద్రతపై మరింత నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. సంత్రగాచి స్పెషల్ ఎక్స్ప్రెస్ లో జరిగిన ఘటనపై పూర్తి దర్యాప్తు అనంతరం కమిషన్ కు నివేదిక పంపాలని లేఖలో ఆమె కోరారు.

# సేవా కార్యక్రమాలను మరింత విస్తరిస్తాం

## ట్రస్ట్ అధ్యక్షుడు మారం తిరుపతి యాదవ్

పెద్దపల్లి అక్టోబరు 16,

యాదవ్ చారిటబుల్ ట్రస్ట్ మరోసారి తమ దాతృత్వాన్ని చాటుకుంది. పెద్దపల్లి జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ఎలాంటి వేతనం లేకుండా స్వచ్ఛందం గా సేవలందిస్తున్న నలుగురు వాలంటీర్లకు గౌరవ వేతనం అందించే కార్యక్రమం గురువారం నిర్వహించారు. వారి అంకితభావాన్ని గుర్తించిన ట్రస్ట్



ఒక్కొక్కరికి రూ.4,500 చొప్పున మొత్తం రూ.18వేల ఆర్థిక సహాయం అందించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ జెడ్పిటిసి గంట రాములు యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు మేకల మల్లేశం యాదవ్ హాజరయ్యారు. వాలంటీర్ల సేవలను వారు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సంద ర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు మారం తిరుపతి యాదవ్ మాట్లాడు తూ ప్రజా సేవలో వాలంటీర్లు చూపుతున్న అంకితభావం నిజంగా ప్రశంసనీయమని కొనియాడారు. సమాజానికి నిస్వార్థంగా సేవ చేస్తున్న వారికి తోడుగా నిలబడడం మనందరి బాధ్యత అన్నారు. వారి సేవలకు ప్రోత్సాహంగానే ఈ చిన్న సహాయాన్ని అందిం చామని పేర్కొన్నారు. భవి ష్యత్తులో కూడా సేవా కార్య క్రమాలను మరింత విస్తృతం గా, ముఖ్యంగా ఆరోగ్య, విద్యా రంగాల్లో కొనసాగించే సంకల్పాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సహకరించి న గంట రాములు యాదవ్, మేకల మల్లేశం యాదవ్ తో పాటు సందనవేని రాజేందర్ యాదవ్, గొడుగు రాజకుమార్ యాదవ్ లకు ట్రస్ట్ తరపున ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి గొడుగు రాజ్ కుమార్ యాదవ్, ట్రస్టీలు బత్తిని లక్ష్మణ్ యాదవ్, మేకల కొమురయ్య యాదవ్, మల్లె త్తుల నాగరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# అక్షరమే ఆయుధంగా నిజాం నిరంకుశత్వంపై పోరాడిన కలం వీరుడు షోయబుల్లాఖాన్

## నేడు ఆయన జయంతి

ఎండ్యాల రామ్ కుమార్, మంథని )అక్షరాన్ని అగ్నికణంలా మార్చి రజాకార్ల రాక్షసత్వంపై ఓ కలం వీరుడు కదమ్ తాల్ చేశాడు.. నిప్పుకణికల్లాంటి అక్షరాలతో నిజాం వెన్నులో వణకుపుట్టించాడు..ఆయనే షహీద్ షోయబుల్లా ఖాన్. హైదరాబాద్ విముక్తి కోసం ప్రాణాలనే పణంగా పెట్టిన తెలంగాణ నిప్పు రవ్వ షోయబుల్లా ఖాన్ . 1948 అగస్ట్ 22న కాసీం రజ్వీ గుండాలు షోయబుల్లాఖాన్ ను అంతం చేశాయి. ఈ రోజు ఖాన్ జయంతి సందర్భంగా ఆయన వీరోచిత పోరాటాన్ని తెలుసుకుని స్ఫూర్తి పొందుదాం. నిరంకుశత్వానిదే నిర్బంధమయితే అక్షరమే ఆయుధమవుతుంది. కత్తుల కోలాటంపై కలం కన్నెర్ర చేస్తుంది. ఆ కలానికి షహీద్ షోయబుల్లాఖాన్ ఖలేజా తోడయితే పెత్తనాన్ని ధిక్కరించే స్వేచ్ఛాగీతం పురుడు పోసుకుంటుంది. పీడనను ఎదురించే పిడికిళ్లు బిగుసుకుంటాయి. ఒక్క సిరాచుక్కతో లక్షమెదళ్లలో తిరుగుబాటు బీజాలు మొలకెత్తుతాయి. షోయబ్ ఉల్లాఖాన్ 1920, అక్టోబరు 17 న ఖమ్మం జిల్లా సుబ్రవేడులో జన్మించారు. తండ్రి హబీబుల్లాఖాన్. నిజాం ప్రభుత్వంలో రైల్వేలో పనిచేస్తుండడంతో హైదరాబాద్ కు బదిలీ అయ్యింది. తల్లి లాయహున్నీసా బేగం. షోయబుల్లాఖాన్ వీరికి ఏకైక సంతానం. వీరి కుటుంబం ఉత్తరప్రదేశ్ నుంచి నిజాం ప్రాంతానికి వలస వచ్చి ఇక్కడ స్థిరపడింది. ఉస్మానియా యూనివర్సిటీలో షోయబుల్లా ఖాన్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేశాడు. తెలంగాణ అగ్నిగోళంలా మండుతోన్న కాలమది. దొరల దోపిడీ సాగదంటూ సామాన్యుడు సమరం సాగిస్తున్న సమయమది. రజాకార్ల రాక్షసత్వాన్ని ఎదురిస్తూ హైదరాబాద్ లో రగల్ జెండా రెపరెపలాడుతున్న రోజులవి. సరిగ్గా అప్పుడే గుండెల నిండా ప్రజాస్వామ్య కాంక్షతో దుర్మార్గ పాలనను ఎదురించే చైతన్యంతో క్యాంపస్ నుంచి షోయబుల్లా ఖాన్ బయటకొచ్చాడు. తాను చదివిన చదువుకు కోరుకుంటే ఏ ఉద్యోగమైనా కాళ్ల దగ్గరకే వచ్చేది. నిర్బంధాన్ని ప్రశ్నించే ధైర్యం నరనరాన పాకుతుంటే.. తలదించుకుని ఉద్యోగం చేయాలా? అందుకే అక్షరాన్ని ఆయుధంగా మార్చి నియంతృత్వంపైనే సమరం చేయాలనుకున్నాడు ఖాన్. జర్నలిస్ట్ గా జీవితం ప్రారంభించాడు..ఉర్దూ అధికార భాషగా ఉన్న ఆ కాలంలో పత్రికలన్నీ నిజాంకు అనుకూలంగా ఉండేవి, ఏవో ఒకటి రెండు పత్రికలు తప్ప. షోయబుల్లాఖాన్ అలాంటి పత్రికనే ఎంచుకున్నాడు. తేజ్ అక్బార్ లో చేరాడు. రజాకార్లు, భూస్వాముల ఆగడాలపై ప్రతీరోజూ అక్షరాలను ఎక్కుపెట్టాడు. ప్రశ్నించే ధైర్యాన్ని ప్రజలకు అందించాడు..అందుకే తేజ్ అక్బార్ ను నిజాం ప్రభుత్వం నిషేధించింది. కణకణమండుతోన్న నిప్పుకణిల్లాంటి షోయబుల్లాఖాన్ అక్షరాలకు అవకాశం ఇవ్వడానికి రయ్యత్ ముందుకొచ్చింది. అక్కడ షోయబుల్లాఖాన్ ఆవేశానికి అక్షరాలు కట్టలు తెంచుకున్నాయి. ఆ కలంపోటు నిజాంను ఉక్కిరిబిక్కిరిచేసింది. దీంతో దాన్ని బంద్ చేయించాడు..నిజాం దౌర్జన్యాన్ని ఎదురించడానికి సొంత పత్రిక ఉంటేనే



మంచిదనుకున్నాడు షోయబుల్లాఖాన్. మాజీ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు సహాయంతో భార్య, తల్లి నగలను అమ్మి ఇమ్రోజ్ ను స్థాపించాడు. 1947 నవంబర్ 17న మొదటి సంచిక వెలువడింది. అందులో షోయబుల్లా పెన్ను గన్నయింది. బుల్లెట్లలా అక్షరాలు నిజాం గుండెల్లోకి దూసుకెళ్లాయి. ఆయన రాతలు రజాకార్లకు వాతలు పెట్టాయి. వెన్నులో వణుకుపుట్టడంతో కాసీం రజ్వీ నుంచి బెదిరింపు లేఖ వచ్చింది. అయినా షోయబుల్లాఖాన్ అక్షరాలు తడబడలేదు. మరిన్ని అన్యాయాలను ఎండగట్టాడు. ఎర్రకోటపై నిజాం జెండా ఎగరవేస్తానన్న రజ్వీ ప్రకటనతో షోయబుల్లాఖాన్ రక్తం కుతకుతలాడింది. రజ్వీ దురహంకారాన్ని ఇమ్రోజ్ లో తీవ్రంగా వ్యతిరేకించాడు. నిజాంను వ్యతిరేకిస్తూ వార్తలు రాస్తే చేతులు నరికేస్తామని, పత్రికను సర్వనాశనం చేస్తామని రజ్వీ బహిరంగంగానే బెదిరించాడు..అయినా షోయబుల్లా ఖాన్ తగ్గలేదు. సత్యాన్వేషణలో ప్రాణాలు పోవడం గర్వించాలన్న విషయమన్నాడు. 1948 అగష్టు 22.. కాచిగూడలోని ఇమ్రోజ్ ఆఫీసులో పని పూర్తి చేసుకుని అర్ధరాత్రి ఇంటికి బయలుదేరాడు షోయబుల్లా. బావమరిది ఇస్మాయిల్ ఖాన్ కూడా ఉన్నాడు పక్కనే. ఇంతలో.. ఎక్కడి నుంచి వచ్చారో తెలియదు..ఒక్కసారిగా పదిమంది దుండగులు షోయబుల్లాఖాన్ పై విరుచుకుపడ్డారు. తన రాతలతో రజ్వీ గుండెకు చెమటలు పట్టించిన ఆ ధీరుని చేతులను నరికేశారు. భయమంటే తెలియని ఆ గుండెపైకి బుల్లెట్ల వర్షం కురిపించారు. అడ్డుకోబోయిన ఇస్మాయిల్ నూ వదల్లేదు. అయితే తుపాకీ చప్పుళ్లు విని స్థానికులు బయటకురావడంతో దుండగులు పారిపోయారు. నెత్తిటి మడుగులో ఉన్న షోయబుల్లాను ఉస్మానియాకు తరలించారు.

# గురుకులాలలో సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల అక్టోబరు 16

:జిల్లాలోని అన్ని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2025-26



విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో గురుకుల ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థినీ విద్యార్థులు గతంలో దరఖాస్తు చేసుకున్న వారితో పాటు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 17 వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా లక్షెట్టిపేట బాలికల గురుకుల విద్యాలయంలో దరఖాస్తులు సమమర్పించాలని తెలిపారు. కుల ధ్రువీకరణ పత్రంతో పాటు ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులు హాల్ టికెట్ ర్యాంకు ధ్రువీకరణ పత్రాల నకలు ప్రతులు జత పరచాలని సూచించారు. లక్షెట్టిపేట చెన్నూరు మందమర్రి బెల్లంపల్లి (బాలికలు) బెల్లంపల్లి కాసిపేట కోటపల్లి మంచిర్యాల జైపూర్ (బాలుర) సాంఘిక సంక్షేమ గురుకులాలలో ఖాళీగా ఉన్న సీట్లను ఈ నెల 18న లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేసి, భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు. బాలికల గురుకులాలలోని 6వ తరగతిలో ఎస్ సి 6 ఎస్టి 2 బీసీ 3 జనరల్ 3 మైనారిటీ 2 సీట్లు ఉన్నాయని 7వ తరగతిలో బీ సి 5 సీట్లు 8 వ తరగతిలో ఎస్ సి 4 ఎస్టి 1బీసీ 10 జనరల్ 6 మైనారిటీ 5 9వ తరగతి లో ఎస్ సి 3ఎ ఎస్టి 4 బీసీ 4 జనరల్ 5 మైనారిటీ 3 సీట్లు ఉన్నాయని తెలిపారు. బాలుర గురుకులాలలో 5వ తరగతిలో ఎస్టి 3 జనరల్ 3 మైనారిటీ 2 సీట్లు 6వ తరగతిలో ఎస్ సి 9 ఎస్టి 5 జనరల్ 1 మైనారిటీ 6 సీట్లు 7వ తరగతిలో ఎస్ సి 5 సీట్లు 8వ తరగతిలో ఎస్ సి 8 బీసీ 8 జనరల్ 6 మైనారిటీ 8, 9వ తరగతి లో ఎస్ సి 11 బీసీ 4 ఓసీ 7 మైనారిటీ 5 సీట్లు ఉన్నాయని తెలిపారు

## ప్రజాపాలనలో జిల్లా అధ్యక్ష పదవిపై కార్యకర్తల అభిప్రాయ సేకరణ



హుజురాబాద్, అక్టోబరు 16

సంఘటన్ శ్రీజన్ అభియాన్ కార్యక్రమం ద్వారా దేశంలో కాంగ్రెస్ పార్టీ నూతన ఒరవడిని తీసుకొచ్చిందని కర్ణాటక రాష్ట్ర హంగల్ శాసన సభ్యుడు మానే శ్రీనివాస్ అన్నారు.గురువారం హుజూరాబాద్ పట్టణంలో ఓ ఫంక్షన్ హాల్ లో స్థానిక కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మానకొండూర్ శాసనసభ్యుడు కవ్వంపల్లి సత్యనారాయణ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ, టీపీసీసి పరిశీలకులు మ్యాడం బాలకృష్ణ మీడియా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ గతాని కంటే బిన్నంగా ఈ సారి జిల్లా అధ్యక్షుల ఎంపికను వార్డు,గ్రామం,మండల,నియోజక వర్గ స్థాయి నాయకుల అభిప్రాయాలు తీసుకొని జిల్లా అధ్యక్షున్ని ఎన్నుకోవడం జరుగుతుందని,దేశంలోనీ ఐదు రాష్ట్రాల్లో పూర్తి చేసుకొని దక్షిణ భారతదేశంలోని తెలంగాణకు ఈ కార్యక్రమాన్ని తీసుకువచ్చామని అన్నారు. జిల్లాల వారిగా పరిశీలకులు నాయకుల అభిప్రాయాలు తీసుకుంటున్నారని అన్నారు. ప్రజల మధ్య ఉండి ప్రజలతో మమేకమయ్యే నాయకులకు అవకాశం దక్కుతుందని,రాబోయే రోజుల్లో జిల్లా అధ్యక్షులకే కాదు మండల నాయకులను కూడా ఇదే విధంగా ఎన్నుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రాత్రివేళల్లో అనవసరంగా తిరుగుతున్న 181 మందిపై పోలీసుల చర్య

గుంటూరు అక్టోబరు 16బుధవారం రాత్రి పోలీసులు జిల్లా వ్యాప్తంగా “ప్రత్యేక డ్రైవ్ “ నిర్వహించారు.రాత్రి వేళల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ, రోడ్లపై అనవసరంగా తిరుగుతూ ప్రజల భద్రతకు భంగం కలిగించే వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసున్నారు. టౌన్ న్యూసెన్స్ యాక్ట్ కింద 181 మందిపై 173 కేసులు నమోదు చేసి, వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ “మద్యం సేవించి రాత్రి వేళల్లో రోడ్లపై తిరగడం వలన గొడవలు, అల్లర్లు, దొంగతనాలు వంటి ఘటనలు సంభవించే అవకాశం ఉంటుంది. ప్రజలు రాత్రి సమయాల్లో అనవసరంగా బయటకు రావద్దు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జిల్లా వ్యాప్తంగా రాత్రి గస్తీ బృందాలను మరింత బలోపేతం చేసి, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి వేళల్లో సంచరిస్తున్న అనుమానాస్పద వ్యక్తులను గుర్తించి విచారణలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

# అధిష్టానాన్ని లైట్ తీసుకుంటున్న నేతలు

హైదరాబాద్, అక్టోబరు 16 (న

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి పదేళ్ల తర్వాత వచ్చింది. అయితే అధికారాన్ని నిలబెట్టుకోవాల్సిన నేతలు వీధిన పడుతున్నారు. చిల్లర గొడవలకు దిగుతున్నారు. అయితే పార్టీ వ్యవహారాల ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ ను అధినాయకత్వం నియమించినప్పటికీ నేతల్లో మాత్రం మార్పు కనిపించడం లేదని పిస్తుంది. గతంలో ఉన్న ఇన్ ఛార్జిగా ఉన్న దీపాదాస్ మున్షీని తొలగించిన పార్టీ నాయకత్వం గాంధీ కుటుంబానికి అత్యంత సన్నిహితంగా ఉండే మీనాక్షి నటరాజన్ ను ఇన్ ఛార్జిగా నియమించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన మంత్రులే గొడవ పడుతుండటం కాంగ్రెస్ పార్టీ క్యాడర్ ను అయోమయానికి గురి చేసింది .. దీంతో మీనాక్షి నటరాజన్ కు కూడా నేతలు వెరవకుండా తమకు తోచినట్లే వ్యవహరిస్తున్నారంటున్నారు. నేతల్లో సఖ్యత కొరవడింది. ప్రభుత్వంలో మంత్రుల మధ్య కూడా సమన్వయం కనిపించడం లేదు. చిన్న చిన్న వాటికి వారు గొడవలకు దిగుతున్నారు. మీడియాకు ఎక్కుతున్నారు. మంత్రుల తీరుపై పార్టీ నాయకత్వం ఆగ్రహంగా ఉందని అంటున్నా మీనాక్షి నటరాజన్ మాత్రం ఎలాంటి నష్టనివారణ చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వినపిస్తున్నాయి. ఒకవైపు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతో పాటు త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు కూడా జరిగే అవకాశముండటంతో వరసగా మంత్రులు గొడవలకు దిగడం పార్టీ శ్రేణులకు మింగుడు పడటం లేదు... మీనాక్షి నటరాజన్ రాహుల్ కోటరీలో కీలకమైన నేత కావడంతో ఆమె పార్టీని సెట్ చేశారని అనుకున్నారు. ఆమె సాదాసీదాగానే ఉంటున్నారు. జీవనశైలి ఇక్కడ ముఖ్యం కాదు. పార్టీని గాడిలో పెట్టడం ముఖ్యమన్నది మీనాక్షి నటరాజన్ మర్చిపోతున్నారన్నకామెంట్స్ వినపడుతున్నాయి. మీనాక్షి నటరాజన్ మధ్యప్రదేశ్ లో బయోకెమిస్ట్రీలో పీజీ చేశారు. ఇండోర్ లో చదువుకుంటూనే రాజకీయాల పట్ల ఆకర్షితులయ్యారు. కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాహుల్ గాంధీ సింప్లిసిటీని చూసి ఆమె కూడా అదే పార్టీని ఎంచుకున్నారు. కాంగ్రెస్ పార్టీ విద్యార్థి అనుబంధ విభాగమైన ఎన్.ఎస్.యూ.ఐ లో పనిచేశారు. తర్వాత 2008లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. 2009 ఎన్నికల్లో మందసౌర్ నుంచి పోటీ చేసి మీనాక్షి నటరాజన్ విజయం సాధించారు. గతంలో 2024, 2019 ఎన్నికల్లో ఓటమి పాలయి 2024 లో విజయం సాధించి ఎంపీగా ఎన్నికయ్యారు. రాహుల్ టీం లో ఒక సభ్యురాలిగా చేరారు. రాహుల్ గాంధీకి నమ్మకమైన నేతగా పేరుపొందారు. అయినా సరే నేతలు మాత్రం ఎటువంటి జంకు




లేకుండా పార్టీ పరువును వీధికెక్కిస్తున్నారు. మంత్రులే కాదు ఎమ్మెల్యేలు కూడా వివాదాస్పద వ్యాఖ్యలు చేసి పార్టీని ఇరకాటంలోకి నెడుతున్నారు. మీనాక్షి నటరాజన్ నేరుగా ఇక్కడి విషయాలను రాహుల్ గాంధీకి చేరవేసే చొరవ ఉన్నప్పటికీ ఆమె ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రోజుకో రగడ పార్టీని ప్రజల్లో నవ్వుల పాలు చేస్తుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదేళ్ల పాటు అధికారంలో కాంగ్రెస్ ఉంటుందని చెబుతున్నప్పటికీ పార్టీ నేతలు మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు.

### కోమటిరెడ్డి సైతం

కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి హాట్ కామెంట్స్ చేశారు. ఎక్సైజ్ పాలసీని సమీక్షించాలని కోమటిరెడ్డి కోరారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుకునేలా లిక్కర్ సిండికేట్లు వ్యవహరిస్తున్నారని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం వేళ మద్యం దుకాణాలు తెరిచి ఉండటంతో పగలు, రాత్రనక మద్యం తాగుతూ ఆర్థికంగా కుటుంబాలు నలిగిపోతున్నాయని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. అందుకే సాయంత్రం వేళల్లో మాత్రమే మద్యం షాపులు తెరిచేలా ప్రభుత్వం ఎక్సైజ్ పాలసీని మార్చాలన్నారు. మునుగోడు నియోజకవర్గంలో మాత్రం తాను ఊరిలో వైన్ షాపునకు అనుమతిచ్చే ప్రసక్తి లేదని తెలిపారు. ఊరి బయట వైన్ షాపులు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయమై తాను ప్రభుత్వంతో మాట్లాడతానన్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మద్యం విషయంలో తాను రాజీపడబోనని చెప్పారు.

## ఫిబ్రవరి 23 నుంచి ఇంటర్ ఎగ్జామ్స్




హైదరాబాద్, అక్టోబరు 16

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఈసారి కాస్త ముందుగానే ప్రారంభంకానున్నాయి. ఇప్పటికే ఏపీలో ఇంటర్ పరీక్షలు వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి ప్రారంభంకానున్నట్లు ప్రకటన వెలువడింది. ఇందుక సంబంధించిన టైం టేబుల్ కూడా అక్కడి ఇంటర్ బోర్డు తాజాగా విడుదల చేసింది. ఇక ఇదే పంథాలో తెలంగాణ ఇంటరో బోర్డు కూడా అడుగులు వేస్తుంది. తెలంగాణలో కూడా ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ పరీక్షలు వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరు నుంచే ప్రారంభించనున్నట్లు తాజాగా ప్రకటించింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం కోసం నివేదికను పంపింది.ప్రభుత్వం ఆమోదం తెలియజేస్తే 2026 ఫిబ్రవరి 23 లేదా 25 నుంచి ఇంటర్ పబ్లిక్ పరీక్షలు మొదలవనున్నాయి. ఈ మేరకు రెండు రకాల టైం టేబుళ్లను సర్కారుకు పంపారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిగా సీఎం రేవంత్‌రెడ్డి కొనసాగుతున్నందున ఆయన ఆమోదం తర్వాతనే ఇంటర్ పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించనున్నారు. మరోవైపు పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ఫిబ్రవరి 23 నుంచి ప్రారంభమై.. మార్చి 24వ తేదీతో ముగియనున్నాయి. సరిగ్గా ఇదే తేదీల్లో తెలంగాణలోనూ ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. లేదంటే ఒక రోజు అటుఇటుగా మొదలవుతాయి. అయితే ఏపీ కంటే ముందుగానే ఇంటర్ పబ్లిక్ పరీక్షలు తెలంగాణలో పూర్తయ్యే అవకాశం ఉంది.గతంలో అంటే కరోనాకు ముందు ఫిబ్రవరి నెలాఖరులోనే పరీక్షలు మొదలయ్యేవి. కరోనా మహమ్మారి ప్రభావంతో ఇది కాస్తా మార్చికి మారింది. అప్పటి నుంచి మార్చిలోనే ఇంటర్ పరీక్షలు జరుగుతున్నాయి. అయితే ఫిబ్రవరిలోనే ఇంటర్ పరీక్షలు జరిగితే జేఈఈ మెయిన్, ఈఏపీసెట్, నీట్‌కు సన్నద్ధమయ్యే వారికి కాస్త వెసులుబాటు లభిస్తుంది. గత ఏడాది మార్చి 5న ఇంటర్ పరీక్షలు మొదలయ్యాయి. మరోవైపు జేఈఈ మెయిన్ రెండో సెషన్ పరీక్షలు ఏప్రిల్ 2 నుంచి ప్రారంభమయ్యాయి. దాంతో ఇంటర్ పరీక్షలు రాసిన వారికి కేవలం 12 రోజులు మాత్రమే సన్నద్ధతకు లభించాయి. దీంతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురయ్యారు. గతేడాది రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ పబ్లిక్ పరీక్షలకు దాదాపు 9 లక్షల మందికిపైగా విద్యార్థులు హాజరయ్యారు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలోనే పరీక్షలు మొదలైతే విద్యార్థులకు ఇతర నీట్, జేఈఈ వంటి పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు సమయం లభిస్తుంది.ఇదిలా ఉంటే మరోవైపు ఇంటర్ పరీక్షల ఫీజు పెంచాలని ఇంటర్ బోర్డు భావిస్తుంది. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపింది. ప్రాక్టికల్స్ లేని కోర్సులకు రూ.520, ప్రాక్టికల్స్ ఉండే పరీక్షలకు ఎంపీసీ, బైపీసీ, జువాలజీ గ్రూపులతోపాటు ఒకేషనల్ కోర్సులకు మొత్తం రూ.750 వరకు పరీక్ష ఫీజు కింద చెల్లిస్తున్నారు. ఇంటర్ బోర్డు ప్రతిపాదనలను రేవంత్ సర్కార్ ఆమోదిస్తే ప్రాక్టికల్స్ లేని కోర్సులకు రూ.600, ప్రాక్టికల్స్ ఉన్న పరీక్షలకు రూ.875 వరకు ఫీజు పెరిగే అవకాశం ఉంది.

## 18న గ్రూప్ 2 నియామక పత్రాలు

హైదరాబాద్, అక్టోబరు 16



తెలంగాణ గ్రూప్ 2 సర్వీసు పోస్టులకు సంబంధించిన తుది ఫలితాలు సెప్టెంబర్ 28న విడుదలైన సంగతి తెలిసిందే. మొత్తం 783 పోస్టులకు గానూ 782 పోస్టులకు ఎంపిక జాబితాను టీజీపీఎస్సీ విడుదల చేసింది. మిగిలిప ఒక పోస్టు మాత్రం భర్తీ కాలేదని, విత్ హెల్డ్‌లో పెట్టినట్లు వెల్లడించింది. మొత్తం 16 శాఖల్లో 18 రకాల పోస్టులకు సంబంధించి టీజీపీఎస్సీ గ్రూప్ 2 తుది ఫలితాలను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఇక గ్రూప్ 2 పోస్టులకు ఎంపికైన వారికి నియామక పత్రాలను అందించేందుకు టీజీపీఎస్సీ ఏర్పాట్లు చేస్తుంది.. తాజా ప్రకటన మేరకు గ్రూపు 2 ద్వారా ఎంపికైన 783 మంది అభ్యర్థులకు అక్టోబరు 18వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదగా నియామక పత్రాలు అందించనున్నారు. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ఆ రోజు సాయంత్రం 4 గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది. ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం సచివాలయంలో సమీక్ష జరిపారు. ఈ నియామకాల్లో సాధారణ పరిపాలన, రెవెన్యూ, ఎక్సైజ్, పంచాయతీరాజ్, వాణిజ్య పన్నుల శాఖలకు చెందిన వారే అధికంగా ఉన్నారు. అందువల్ల ఆయా శాఖల కార్యదర్శులు ఈ కార్యక్రమ నిర్వహణలో సమన్వయంతో ఏర్పాట్లు పూర్తిచేయాలని ఆయన పేర్కొన్నారు. అభ్యర్థులతోపాటు వారి కుటుంబసభ్యులు కూడా ఈ కార్యక్రమానికి అనుమతించనున్నట్లు ఆయన తెలిపారు.కాగా టీజీపీఎస్సీ గ్రూప్ 2 నోటిఫికేషన్‌ను 2022లో విడుదల చేయగా, 2024 డిసెంబర్ 15, 16 తేదీల్లో రాతపరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 2,49,964 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ పరీక్ష ఆఫ్‌లైన్ విధానంలో జరగడంతో ఓఎంఆర్ పత్రాల్లో లోపాలు, బబ్లింగ్ సరిగా చేయకపోవడం వంటి కారణాలతో దాదాపు 13,315 మందిని కమిషన్ అనర్హులుగా ప్రకటించింది. మిగిలిన 2,36,649 మంది అభ్యర్థుల జనరల్ ర్యాంక్ లిస్ట్ (మార్కులతో సహా)ను మార్చి 11న విడుదల చేసింది. గత నెలలో తుది జాబితాను విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ లిస్టులోని వారందరికీ మరో 3 రోజుల్లో నియామక పత్రాలు అందించనున్నారు.

## సచివాలయంలో నీటి కొరత

హైదరాబాద్, అక్టోబరు 16 (

తెలంగాణ సచివాలయంలోనే మంచి నీటి కొరత ఏర్పడింది. తాగునీటి సరఫరా చేయాల్సిన కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. దీంతో ఎండాకాలం రాకముందే కొన్ని డిపార్ట్ మెంట్స్ లో తాగునీటి సమస్య ఏర్పడింది. ఆయా విభాగాల్లో ఉద్యోగులు సొంతంగా వాటర్ బాటిల్స్ క్యారీ చేస్తున్నారు. భోజన సమయం, టీ టైమ్ లో కూడా మంచి నీళు లేకపోవడంతో కొంతమంది ఉద్యోగులు క్యాంటీన్ లో వాటర్ బాటిల్స్ కొంటున్నారు.సచివాలయంలో వాటర్ సరఫరా చేసే కాంట్రాక్టర్లకు తాగునీటి బిల్లులను సైతం చెల్లించలేని స్థితికి ప్రభుత్వం దిగజారింది అనే విమర్శలు వస్తున్నాయి. నెల నెల బిల్లులు చెల్లించకపోవడంతో సదరు కాంట్రాక్టర్ మూడు రోజులుగా నీటి సరఫరాను నిలిపివేశారు. వివిధ శాఖలకు సంబంధించి దాదాపు 20 లక్షల వరకు బిల్లులు పెండింగ్ లో ఉన్నట్లు తెలుస్తోంది. బిల్లుల కోసం కాంట్రాక్టర్ ఎన్నిసార్లు సంబంధిత శాఖ అధికారులను సంప్రదించినా ప్రయోజనం లేకపోవడంతో చివరికి నీటి సరఫరా నిలిపివేశారు.తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నస సిబ్బంది చివరకు ఇంటి నుంచి బాటిల్ తెచ్చుకుంటున్నారు. ఆయా శాఖల నుంచి డబ్బులు రావడం లేదని, వ్యక్తిగతంగా కొనుగోలు చేసుకోవాలని చెప్పినట్లు తెలుస్తోంది. ప్రతి నెల 300 ఇస్తే తాగునీరు సరఫరా చేస్తామని చెప్పడంతో ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయంలో తాగునీటి కష్టాలు ఎండా కాలం కాకముందే ఇలా ఉండటంతో వేసవి కాలంలో ఎలాంటి పరిస్థితి ఉంటుందోనని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

=================

# ఖమ్మంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్న మేయర్



ఖమ్మం బ్యూరో, భారత శక్తి, అక్టోబర్ 16: స్థానిక 58 డివిజన్ నందు మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు పలు అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా 20 లక్షల జనరల్ నిధులతో డ్రైయిన్ శంకు స్థాపన కార్యక్రమంలో పాల్గొన్న నగర మేయర్ శ్రీమతి పునుకొల్లు నీరజ పాల్గొన్నారు.

అనంతరం 51 డివిజన్ నందు మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ చెక్కులు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టూ టౌన్ ఇన్ చార్జ్ జిల్లా కాంగ్రెస్ నాయకులు శెట్టి రంగారావు, డివిజన్ నాయకులు సోమిరెడ్డి ఉపేందర్ రెడ్డి, నాంపల్లి శంకరయ్య, నల్లమల వేణు, పెడేటి రమేష్, ఏటుకూరి కోటేశ్వరరావు, జమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, నల్లమల సుధాకర్, నూతక్కి నాగార్జున,బత్తుల శ్రీను, చెరుకూరి ఉష, సాగర్ మరియు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి: ఎమ్మెల్యే జి.ఎస్.ఆర్

భూపాలపల్లి (భారత శక్తి) అక్టోబర్ 16: గురువారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సింగరేణి అంబేద్కర్



స్టేడియంలో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గౌరవ భూపాలపల్లి శాసనసభ్యులు శ్రీ గండ్ర సత్యనారాయణ రావు (జి.ఎస్.ఆర్) హాజరై జ్యోతి ప్రజ్వలన, జెండా ఆవిష్కరన చేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కబడ్డీ క్రీడలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాల్సిన అవసరం ఉ ందన్నారు. క్రీడలు శారీరక దృఢత్వం మాత్రమే కాకుండా, క్రమశిక్షణ, సహనాన్ని కూడా పెంపొందిస్తాయని చెప్పారు. క్రీడా రంగంలో ముందుకు సాగేందుకు విద్యార్థులకు తగిన ప్రోత్సాహం, సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీ విజయలక్ష్మి గారు జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్ గారు జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ రఘు గారు, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ కోటా రాజబాబు గారు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బుగులోని శ్రీ వెంకటేశ్వర స్వామి జాతర ఏర్పాట్లపై సమీక్ష: ఎమ్మెల్యే జీఎస్సార్.

భూపాలపల్లి (భారత శక్తి)అక్టోబర్ 16: గురువారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ గారి కార్యాలయం



)లో, రేగొండ మండలం తిరుమలగిరి గ్రామ శివారులో నవంబర్ 4,5,6 తేదీలలో జరుగు బుగులోని శ్రీ వెంకటేశ్వర స్వామి జాతర ఏర్పాట్లపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పోలీస్, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీ రాజ్, ఆర్‌టీసీ, రెవెన్యూ, విద్యుత్, వైద్యము, మరియు ఇరిగేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి శాసనసభ్యులు లిశ్రీ గండ్ర సత్యనారాయణ రావు (జి.ఎస్.ఆర్) హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ "భక్తుల సౌకర్యార్థం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి. జాతర సందర్భంగా ఎటువంటి ఆటంకాలు లేకుండా సక్రమమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత శాఖల ప్రతినిధులు మరియు జాతర కమిటీ పాల్గొన్నారు.

# రామప్ప ఖ్యాతిని ప్రపంచానికి చాటాలి: మంత్రి సీతక్క.

ములుగు జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 16 (భారత శక్తి) : రామప్ప ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పాలనీ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ - శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేట లోని హరిత కాటేజ్ లో వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ క్యాంప్ శిక్షణా శిబిరాన్ని మంగళవారం మంత్రి సందర్శించారు. కాకతీయుల చరిత్ర గురించి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి రాష్ట్రం, విదేశాల నుండి వచ్చిన విద్యార్థిని, విద్యార్థులను ఉద్దేశించి మంత్రి మాట్లాడారు. తన జీవితం లో ఏ విధంగా ఈ స్థితికి వచ్చాను ఇక్కడున్న ప్రాంత ప్రాముఖ్యత గురించి తెలుసుకోవడానికి వచ్చిన మీ అందరికీ అభినందనలు, మీరు ఇక్కడ నేర్చుకున్న ప్రతి అంశం ఇక్కడి నుంచి వెళ్ళాక మీ ప్రదేశాల్లో కాకతీయుల గురించి వివరించాలని తెలిపారు. ప్రొఫెసర్ పాండురంగారావు మాట్లాడుతూ వరుసగా ఇది నాలుగోసారి వరల్డ్ హెరిటేజ్ క్యాంప్ రామప్పలో నిర్వహిస్తున్నామని ప్రతి సంవత్సరం వివిధ దేశాల,ప్రదేశాల నుండి





వచ్చిన విద్యార్థిని, విద్యార్థులకు కాకతీయుల కళా సంపద వారసత్వం వాటిని ఎలా కాపాడుకోవడం అనే అంశాల మీద వాటి ప్రాముఖ్యతను వివరించారు.

అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ డాక్టర్ కుసుమ సూర్య కిరణ్ మాట్లాడుతూ మంత్రి పర్యాటక రంగానికి మేడారం జాతరకు ఏవిధంగా అభివృద్ధి చెందడానికి ప్రయత్నిస్తున్నారో, తెలంగాణ టూరిజం అభివృద్ధికి తోడ్పడుతున్నారని, అన్నారు. శిక్షణలో భాగంగా ప్రొఫెసర్ వెంకట్ రెడ్డి ఎన్ఐటి నుండి వచ్చి జాగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టం మీద సమ్మక్క సారక్క ట్రైబల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వైఎల్ శ్రీనివాస్ క్యాంపుకు వచ్చి వాలంటీర్స్ కి ముఖ్యమైన సలహాలు సూచనలు టూరిజం కల్చర్ హెరిటేజ్ గురించి వివరించారు.


ఈ కార్యక్రమంలో కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ట్రస్ట్ ప్రొఫెసర్ పాండురంగారావు, డాక్టర్ కుసుమ సూర్యకిరణ్, అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్, వాలంటీర్స్, తదితరులు పాల్గొన్నారు.

# ఏఐపై అతిగా ఆధారపడొద్దు

## - గాంధీజీ స్వావలంబనను ఉటంకిస్తూ హైదరాబాద్ వర్సిటీ డీన్ ప్రొఫెసర్ నరేష్ కుమార్ శర్మ

సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 16:

కృత్రిమ మేధస్సు (ఏఐ) నిజంగా తెలివైనది కాదని, అది మానవ నిర్మిత గణాంక నమూనాల ద్వారా మాత్రమే పనిచేస్తుందని హైదరాబాదు విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ మాజీ డీన్ ప్రొఫెసర్ నరేష్ కుమార్ శర్మ అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ లోని పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో '150 ఏళ్ల గాంధీ: కృత్రిమ మేధస్సు యుగంలో మహాత్మాగాంధీ జీవితం, వారసత్వాన్ని తిరిగి సందర్శించడం' అనే అంశంపై గురువారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల నేపథ్యంలో గాంధీ తత్వశాస్త్రంపై తన ఆలోచనలను పంచుకున్నారు.



ఏ, ఐలో ఎంత కృత్రిమం, ఎంత మేధస్సు?' అనే ఆలోచనాత్మక ప్రశ్నను లేవనెత్తుతూ ప్రొఫెసర్ శర్మ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. అహింస, నైతిక బాధ్యత, సాధనాల పవిత్రత, ఆర్థిక చర్యల దీర్ఘకాలిక దృక్పథం వంటి గాంధీ సూత్రాలను ఆయన వివరించారు. గాంధీ రచనల నుంచి తీసుకుంటూ, సాంకేతిక కేంద్రీకరణ పట్ల గాంధీకి ఉన్న సందేహాన్ని, వికేంద్రీకృత, సమాజ ఆధారిత అభివృద్ధి కోసం ఆయన వాదనను ప్రొఫెసర్ శర్మ నొక్కి చెప్పారు. గాంధీ 1929లో నిర్వహించిన చరఖా డిజైన్ పోటీని స్వావలంబన, గ్రామీణ సాధికారతతో ముడిపడి ఉన్న ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి ఉదాహరణగా ఆయన పేర్కొన్నారు.కేంద్రీకృత శక్తి, యంత్రాలపై అతిగా ఆధారపడటం నైతిక విలువలను, వ్యక్తిగత స్వయం ప్రతిపత్తిని క్షీణింపజేస్తుందని గాంధీ చేసిన హెచ్చరికను ఆయన మరింత ప్రతిబింబించారు. ఈ ఆలోచనలను ఆధునిక యుగానికి అనుసంధానిస్తూ, ప్రొఫెసర్ శర్మ కృత్రిమ మేధస్సు యొక్క నైతిక, తాత్విక చిక్కులను ప్రశ్నించారు. సదస్యుల ప్రశ్నలకు ఆయన బదులిస్తూ, కొన్ని సోషల్ మీడియా వర్గాలలో గాంధీని విభజనకు బాధ్యత వహించాడని తప్పుగా చిత్రీకరిస్తున్నారని, చారిత్రక వాస్తవాలు ఇందుకు పూర్తిగా భిన్నంగా ఉన్నాయన్నారు. సాంకేతిక ఆధారిత సమాజాలు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడంలో గాంధీ ఆలోచన యొక్క నిరంతర ఔచిత్యంపై ఆకర్షణీయమైన చర్చతో ఈ ఆతిథ్య ఉపన్యాసం ముగిసింది.

# కరెంట్ షాక్‌తో యువరైతు దుర్మరణం

భూపాలపల్లి ( భారత శక్తి ) అక్టోబర్ 16: గురువారం



భూపాలపల్లి మండలంలోని ఆజంనగర్ గ్రామానికి చెందిన కారుకూరి రమేష్ రమ కుమారుడు యువరైతు తిరుపతి (25) సంవత్సరాలు ఈరోజు ఉదయం వ్యవసాయ నిమిత్తం పొలానికి నీరు పెట్టే క్రమంలో కరెంట్ షాక్‌కు గురై దుర్మరణం పాలయ్యాడు. పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఘటనతో గ్రామంలో విషాదచాయ నెలకొంది. మృతుడికి భార్య వర్షిత, తొమ్మిది నెలల బాబు ఉన్నాడు.

# గీతంలో ప్రమాణ సెక్రటేరియట్ ప్రారంభం

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 16 :

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ లో ప్రమాణ సచివాలయాన్ని గురువారం లాంఛనంగా ప్రారంభించారు. గీతంలో ప్రతియేటా సాంకేతిక-సాహిత్య-నిర్వహణల మేలుకలయికగా నిర్వహించే మూడు రోజుల పండుగకు సన్నాహకంగా ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. సాంకేతిక శిక్షణ, ఉపన్యాసాలు, పోటీలతో పాటు ర్యాంప్ వాక్, సింఫోనీ, కన్సర్ట్, బ్యాటిల్ ఆఫ్ బ్యాండ్స్, కార్నివాల్, పలు యాజమాన్య



మెళకువలను నేర్పే పోటీల సమాహారంగా ఈ కార్యక్రమం కొనసాగుతుంది. గీతం, హైదరాబాద్ లో ఉన్న ఏడు స్కూళ్ల (టెక్నాలజీ, మేనేజ్ మెంట్, సైన్స్, ఫార్మశీ, ఆర్కిటెక్చర్, హ్యూమానిటీస్, పబ్లిక్ పాలసీ) విద్యార్థులందరూ పెద్దయెత్తున పాల్గొనేలా కార్యక్రమాలకు రూపకల్పన చేయాలని గీతం హైదరాబాద్ రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఆతిథ్య-క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్ సూచించారు.

# అక్టోబర్ 21 నుండి పోలీస్ అమరవీరుల దినం (పోలీస్ ఫ్లాగ్ డే) కార్యక్రమాలు ప్రారంభం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 16 (భారత శక్తి)పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా తెలుగు,ఇంగ్లీష్,ఉర్దూ భాషలలో విద్యార్థులకు ఆన్లైన్ లో పోలీసు అమరవీరుల దినం (పోలీస్ ఫ్లాగ్ డే) ను పురస్కరించుకొని జిల్లా పరిధిలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలకు సంబంధించి రాష్ట్ర స్థాయిలో పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల ఐపీఎస్ ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలో పోలీస్ అమరవీరుల ప్రాణ త్యాగాల స్మరణలో భాగంగా అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల దినం "పోలీస్ ఫ్లాగ్ డే " సందర్భంగా కార్యక్రమాలను అక్టోబర్ 21వ తేది నుండి అక్టోబర్ 31వ తేది వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది అని,ఈ కార్యక్రమాలలో పెద్ద సంఖ్యలో పత్రిక సోదరులు , ప్రజలు, విద్యార్థులు పాల్గొని విజయ వంతం చెయ్యాలని జిల్లా ఎస్పీ తెలియజేశారు. ఇట్టి కార్యక్రమాలలో భాగంగా అక్టోబరు 21 నుండి 25వ తేది వరకు ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహించి అందులో



పోలీసు విధులు, పోలీసులు వినియోగించే ఆయుధాలు, సాంకేతిక వినియోగం, షి టీం, భరోసా, సైబర్ సెక్యూరిటీ, ఆంటీ నార్కోటిక్ డ్రగ్, డాగ్ స్క్వాడ్ విభాగాల విధులు, ప్రజల రక్షణ లో పోలీసుల సేవలు, పోలీసులు చేసిన ప్రతిభ, త్యాగాలు మొదలగునవి విషయాలను ప్రజలకు, విద్యార్థులకు తెలియజేయడం జరుగుతుంది. వ్యాసరచన పోటీలను నిర్వహించడం జరుగుతుంది. వ్యాసరచన పోటీలు మూడు భాషల్లో అనగా తెలుగు, ఇంగ్లీష్, ఉ ర్దూ భాషల్లో అభ్యర్థులు పాల్గొనవచ్చును. రాసిన వ్యాసాన్ని ఆన్లైన్ లో https://forms.gle/jaWLdt2yhNrMpe3eAఈ గూగుల్ ఫామ్ లో అప్లోడ్ చేయాలి.

వ్యాసరచన అంశం

Drugs Menace : Role of Police in Prevention and How Students Can Stay Away from Drugs(డ్రగ్స్ నివారణలో పోలీసుల పాత్ర మరియు విద్యార్థులు డ్రగ్స్ నుండి ఎలా దూరంగా ఉండగలరు)

అనే అంశాల మీద విద్యార్థులకు "ఆన్లైన్ నందు వ్యాసరచన పోటీలు నిర్వర్తించడం జరుగుతుంది ఆన్లైన్లో 24 అక్టోబర్ 2025 వరకు సమర్పించవచ్చును. ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురు అభ్యర్థులను జిల్లా పోలీస్ కార్యాలయంలో బహుమతుల ప్రధానం చేసి, తదుపరి ఈ ముగ్గురు అభ్యర్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాష్ట్రస్థాయిలో, జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు సంపాదించాలని అన్నారు.

పోలీసులకు వ్యాసరచన పోటీలు:

కేటగిరి-1:

కానిస్టేబుల్ అధికారి నుండి ఏ ఎస్.ఐ స్థాయి అధికారి వరకు.. Gender Discrimination at the Work Place'( పని చేయు ప్రదేశంలో లింగ వివక్ష)

కేటగిరి-2 :

ఎస్.ఐ స్థాయి అధికారి మరియు పై స్థాయి అధికారులకు "Strengthening of Ground Level Policing" (క్షేత్ర స్థాయి లో పోలీసింగ్‌ను బలోపేతం చేయడం) వ్యాసరచన పోటీలు నిర్వహించబడతాయని తెలియజేశారు. ఈ వ్యాసరచన పోటీలను తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషలలో నిర్వహించాలని, 500 పదాలకు మించకుండా వ్యాసరచనలో పాల్గొని, ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురికి అవార్డుల ప్రధానం మరియు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అర్హత లభిస్తుందని తెలియజేశారు.

షార్ట్ ఫిలిమ్స్, ఫోటోగ్రఫీ పోటీలు :

విద్యార్థిని, విద్యార్థులకు, యువతకు, ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లకు, వీడియో గ్రాఫర్లకు, పోలీసులు చేసిన సేవలకు సంబంధించిన ఫోటోలు లేదా రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, కమ్యూనిటీ పోలీసింగ్, మూఢనమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాలలో పోలీసుల సేవ, ఇతర పోలీసుల కీర్తి ప్రతిష్టలను పెంపొందించే అంశాలపై మూడు నిమిషాలకు తగ్గించకుండా షార్ట్ వీడియోలను రూపొందించాలని, ప్రతిభ కనబరిచిన మొదటి మూడు ఫోటోలను, వీడియోలను జిల్లా స్థాయిలో ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి ఎంపిక చేసి రాష్ట్ర పోటీల్లో పాల్గొనే విధంగా అర్హత లభిస్తుందని తెలియజేశారు. ఫోటోలు, వీడియోలు ఈనెల తేది: 24-10-2025 లోపు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఐటి కోర్ ఆఫీస్ లో అందించాలి.

ఈ నెల 21వ తేదీ నుండి 31వ తేదీ వరకు పబ్లిక్ స్థలాల్లో పోలీస్ అమరవీరుల బ్యానర్లను ఏర్పాటు చేయడం జరుగుతుందనీ జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ నెల అక్టోబర్ 21న పోలీస్ ప్రధాన కార్యాలయంలోని అమరవీరుల స్థూపం వద్ద "పోలీస్ అమరవీరులను" స్మరిస్తూ ఉదయం 8:30 నిమిషాలకు పోలీస్ అధికారులు ఘనంగా నివాళులు అర్పించడం జరుగుతుందని తెలియజేశారు.

# ఎన్ సీసీ కార్యాలయం ప్రారంభం

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 16 :

అత్యాధునిక సౌకర్యాలతో, విశాలంగా ఏర్పాటు చేసిన నేషనల్ క్యాడెట్ కోర్ (ఎన్ సీసీ) కార్యాలయాన్ని గురువారం గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, ఆతిథ్య-క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్ తదితరులు



లాంఛనంగా ప్రారంభించారు. ఎన్నో అంశాలలో అత్యుత్తమంగా రాణిస్తూ, జాతీయ, అంతర్జాతీయ క్యాంపులలో పాల్గొని ఇటు గీతంకు, అటు సంగారెడ్డి ఎన్ సీసీ బెటాలియన్ కు విద్యార్థులు మంచి పేరు తెస్తున్నారని, ఇకమీదట ఇనుమడించిన ఉత్సాహంతో మరింతగా వన్నె తేవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్పోర్ట్స్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నారాయణరావు, కేర్ టేకింగ్ ఆఫీసర్ అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జీవన యానంలో "స్నేహం "శ్వాస వంటిది

"స్నేహం ఓ వరం స్నేహాని కన్న.మిన్న లోకాన లేదురా" అన్న మహాకవి వాక్య స్నేహం యొక్క ప్రాముఖ్యతను చాటుతుంది. స్నేహంఅద్భుతమైంది .పవిత్రమైంది

నిజమైన మిత్రులకు ఉంచిన ఆస్తి లేదు . స్నేహానికి ఎల్లలు లేవు అది సరిహద్దులను చేరిపివేస్తుంది . భాషాబేధాలు కుల మతాలు ఎరుగనిది స్నేహం.

మనోధైర్యం బి స్నేహితం

మంచి మిత్రుడు తోడుంటే ఆయుధం ధరించినంత ధైర్యం ఉంటుంది.

మనోధైర్యానికి మంచి మిత్రుడు తోడు నీడగా వుంటాడు. కల్లా కపటం ఎరుగని స్నేహం కలకాలం నిలిచి ఉంటుంది.

లిజీవితం బిస్నేహంలి జీవితమనే ఉద్యానవనం లో అందమైన పుష్పం స్నేహం. హృదయపు తలుపులను ఒక సారి తడితే మాధుర్యం అంతా హృదయంలో గుబాలిస్తుంది.

ప్రతిఫలాన్ని ఆశించని స్నేహ బంధం

మొగ్గలా ప్రారంభమై మహా. వృక్షం లా ఎదిగి జీవితాంతం తోడునిస్తుంది.ఇద్దరు వ్యక్తులకు ఇరువురి మనసులకు సంబంధించిన స్నేహం తర తరాలకు తీపిని పెంచుతుంది .

బంధాల పటిష్టత -స్నేహం

కుటుంబాల మధ్య ఆత్మీయత అనురాగం అభిమానం ఆదరణ గౌరవం పటిష్ఠమైన సంబంధాల ను బలోపేతం చేస్తుంది. సమ కాలలీన సమాజం మార్పులకు కాలానికి అతీతంగా మైత్రి మధురిమ ను పెంచుతుంది.

కష్ట సుఖాల్లో అండ బిస్నేహం

కన్న వారితో కట్టుకున్న.వారితో తో బట్టువులతో చెప్పుకో లేని విషయాలను మిత్రులతో చెప్పుకోవడం స్నేహం గొప్పదనం కష్ట సుఖాల్లో అండగా ఉండేవారు. నిస్వార్థంగా సాయం అందించే వారు నిజమైన మిత్రులు.

స్నేహం అనేది వివరించడం కష్టం,స్నేహం స్కూల్లో నేర్చుకునేది కాదు.

స్నేహం యొక్క అర్థం నేర్చుకోక పోతే,

మీరు ఏమినేర్చుకోలేరు: మహమూద్ అలీ

స్నేహం ఓ మధురానుభూతి. వయసుతో నిమిత్తం లేదు ఆట పాటలాడే బాల్యం నుండి వృద్ధాప్యం వరకు అందరిలో స్నేహ భావంతో వుంటుంది. స్నేహాను భూతిని అనుభవిస్తే తెలుస్తుంది. ఆస్వాదిస్తే అర్థం అవుతుంది.

సృష్టి బిస్నేహం

సృష్టిలో నా అనేవారు బంధువులు లేని వారు ఉంటారేమో కానీ స్నేహితులు లేని వారు ఉండరు. ఇంట్లో చెప్పుకోలేని సమస్యలు బాధలు స్నేహితులతో ఎటువంటి దాపరికం లేకుండా చెప్పుకొని మనసుకు కలిగిన ఒత్తిడిని తగ్గించూ కుంటారు ఓదార్పు పొందుతారు. జీవితాన్ని ఆశావహ దృక్పథం వైపు మళ్ళించే గొప్ప శక్తి స్నేహానికి వుంది.

స్నేహం ప్రకృతి.

స్నేహం ప్రకృతి వంటిది. అధి అహల్లధం తో పాటు అన%శీ%దాన్ని హాయిని ఇస్తుంది. కష్టాల్లో నేను ఉన్నాను అని బరోసా ఇస్తుంది.

జీవన ప్రయాణంలో స్నేహం శ్వాస వంటిది.

స్నేహం తీయనైనది.మనిషి జీవితంలో అమ్మ ప్రేమ మొదటి స్థానం స్నేహం రెండవ స్థానాన్ని దక్కించుకుంది. స్నేహితులతో కలిసి వుంటే కలిగే సంతోషం సంతృప్తి ఆనందం విలువైనది.మార్కెట్లో కొంటె దొరకనిధి స్నేహ%శీ%. స్వచ్ఛత నమ్మకం సత్యసందత మంచి ప్రవర్తన పారధర్శనికథ తో కూడినపవిత్రమైన స్నేహం ఉండాలి .అలాంటి స్నేహం జీవితానికి ఆనందాన్ని ఇస్తుంది.

స్నేహితుల కోసం జూన్ 8 ఉత్తమ స్నేహితుల దినోత్సవం ప్రపంచ వ్యాప్తంగా ఐ'రా'స సభ్యదేశాలు ఉత్తమ స్నేహం గురించి స్నేహితులతో గడిపిన సమయం జీవితములో స్నేహం విలువ స్నేహం నిర్వహించే బహుముఖ పాత్ర గుర్తించి స్నేహ సంబంధాల ప్రాధాన్యత.గురించి అవగాహన చైతన్యం కలిగించి ప్రపంచ దేశాల మధ్య స్నేహ సౌభ్రాతృత్వ సౌహార్ధతతో కూడిన శాంతి సహనం సంఘీభావం సామరస్య వాతావరణాన్ని సృష్టించి ప్రపంచ్చాన్ని వసుదైక కుటుంభ ఆవిర్భావానికి స్నేహితుల దినోత్సవం దోహద పడుతుందని ఆశిద్దాం.

నేదునూరి కనకయ్య

అధ్యక్షులుతెలంగాణ ఎకనామిక్ ఫోరం

తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరం

కరీంనగర్

9440245771



# కెసిఆర్ ఉద్యమ స్ఫూర్తితో బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేద్దాం

**-కాంగ్రెస్ వి అన్ని మోసపూరితమే**

**-బీసీలకు 42 శాతం అన్ని రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలి**

**-బీసీ జేఏసీ బందును విజయవంతం చేద్దాం**

**-శాసనమండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి**



భూపాలపల్లి, భారత శక్తి, అక్టోబర్ 16: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాడు చేసిన తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో తెలంగాణలో బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేద్దామని కాంగ్రెస్ చేస్తున్న మోసాలను ఎండగడదామని శాసనమండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజూరు నగర్ లో గల తన క్యాంపు కార్యాలయంలో మధుసూదనాచారి గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు దక్కాలంటే మరో ఉద్యమం చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత మాటలతో ప్రజలను మభ్యపెడుతుందని అన్నారు. బీసీల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేకుండా వ్యవహరిస్తూ అన్యాయం చేస్తుందన్నారు. కేంద్రంపై ఒత్తిడి తీసుకురాకుండా, పార్లమెంటును స్తంభింపజేసే కార్యక్రమాలు చేపట్టకుండా వ్యవహరిస్తూ కావాలనే పబ్బం గడుపుతున్నట్లు తెలియజేశారు. కేంద్రంలో రాహుల్ గాంధీ బీసీల వ్యవహారం పట్ల ఎందుకు పట్టించుకోకపోవడం లేదో తెలియజేయాలన్నారు. ఇక్కడి రాష్ట్ర ప్రభుత్వం బీసీలను నయవంచన చేసే విధంగా వ్యవహరిస్తూ ముందుకు సాగుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్ను కొట్టివేయడమే దానికి నిదర్శనం అన్నారు. బీసీలను మోసం చేసేందుకే ఆ పార్టీ చట్టపరంగా ముందుకు వెళ్లడం లేదని విమర్శించారు. ఈ విషయం ఇటీవలే వచ్చిన కోర్టు తీర్పులతో తేటతెల్లమైందని ఆయన చెప్పారు.

తమిళనాడు తరహాలో ఈ ప్రభుత్వం ఎందుకు చేయలేదు: సిరికొండ

తమిళనాడులో అవలంబించిన తరహాలో ఈ ప్రభుత్వం ఎందుకు ముందుకుపోలేదని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ తరపున మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు పార్టీలోని బీసీ ముఖ్య నూతలందరూ, తాను కలిసి తమిళనాడులో బీసీల పట్ల అవలంభించిన విధానాన్ని అధ్యయనం చేసి రావడం జరిగిందన్నారు. అక్కడి ముఖ్య నాయకులు, అధికారులతో చర్చించి, వారు అనుసరించిన విధానం తెలుసుకొని రావడం జరిగిందన్నారు. ఢిల్లీ స్థాయిలో తీవ్రమైన ఒత్తిడి తీసుకురావడమే బీసీల సమస్యకు పరిష్కారమని, ఈ విషయం రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని అయినప్పటికీ పట్టించుకోలేదన్నారు. గతంలో తమిళనాడులో బీసీ రిజర్వేషన్లపై అప్పటి సీఎం జయలలిత అన్ని పార్టీలను ఒకే తాటిపైకి తీసుకువచ్చి వారందరితో అప్పట్లో ఢిల్లీలో ఉన్న కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వచ్చిందని, రిజర్వేషన్లు ఇస్తేనే ఇక్కడి నుండి వెళ్తామని భీష్మించుకుని కూర్చుని పట్టుబట్టి 9వ షెడ్యూల్లో చేర్పించడం జరిగిందని తెలియజేశారు. శాసనమండలి, శాసనసభలో ఈ విషయం చర్చకు వచ్చినప్పుడు 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు అమలు జరగాలంటే ఢిల్లీ స్థాయిలో చేయాలని సూచనలు ఇచ్చినప్పటికీ ఏమాత్రం పట్టించుకోలేదు అన్నారు. కాంగ్రెస్ పార్టీకి బీసీల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదని అందుకే భిన్నంగా వ్యవహరించి బీసీలను నయవంచనకు గురి చేస్తుందని, నమ్మకద్రోహం చేస్తుందని ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనా చారి విమర్శించారు.

బీసీలకు న్యాయం జరగాలంటే పోరాటం తప్పదు

బీసీలకు తగిన న్యాయం జరగాలంటే పోరాటం తప్పదని మధుసూదనాచారి అన్నారు. బీసీ జేఏసీల ఆధ్వర్యంలో ఈనెల 18న నిర్వహించే బందుకు సంపూర్ణ మద్దతు తెలియజేయాలని, అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని బందును విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమాజంలో మేమెంతో మాకంత రిజర్వేషన్లు కావాలి అనే నినాదంతో అన్ని వర్గాల ప్రజలు తెలంగాణ ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని మరో పోరాటానికి సిద్ధం కావాలని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి పిలుపునిచ్చారు.

# మీడియా ముసుగులో బెదిరింపులు...వసూళ్ల దందా

**-ఇద్దరు రిపోర్టర్లపై కేసు నమోదు,ఒకరి రిమాండ్.**

**-బాధితులు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయండి.**

**-వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్**

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో సయ్యద్ అలీ.**

వేములవాడ, అక్టోబర్ 16 : సమాజంలో రిపోర్టర్లమని చెలామణి అవుతూ అమాయక ప్రజలను బెదిరింపులకు గురి చేస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ వెల్లడించారు.వీరిలో ఒకరిని రిమాండ్ కు తరలించగా,మరొకరు పరారీ లో ఉన్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా గురువారం కేసుకు సంబంధించిన వివరాలను మీడియాకు తెలియజేశారు.అర్బన్ మండలంలోని అగ్రహారం గ్రామానికి చెందిన బొమ్మేల మహిపాల్ అనే వ్యక్తి వృత్తి పరంగా ఒగ్గు కళాకారుడనీ,గంగాదేవి అమ్మవారిని పూజిస్తూ,సపుడలమ్మ పూజలు చేసన్తూ,మూలికల వైద్యం ద్వారా జీవనోపాధి పొందుతున్నాడనీ తెలిపారు.ఈ నెల 11న వేములవాడ పట్టణానికి చెందిన తొగరి కరుణాకర్ అనే వ్యక్తి జర్నలిస్ట్ అని చెప్పుకుంటూ మహిపాల్‌కు ఫోన్ చేసి నువ్వు వేములవాడకు రావాలని,రాకపోతే తనపై సి.సి.ఎస్. పోలీసులకు ఫిర్యాదు చేస్తానని బెదిరించాడు.మహిపాల్ వేములవాడకు వచ్చి కరుణాకర్‌ను కలుసుకోని ఏ విషయం పై తనపై పిర్యాదు చేస్తావని కరుణాకర్ ని అడుగగా పొంతన లేని సమాధానాలు చెప్పడమే కాకుండా తన గురించి తన భార్య పిల్లల గురించి తమ పేపర్ లో రాస్తా అని బెదిరించాడు.మరుసటి రోజు కరుణాకర్ మరోసారి మహిపాల్ కు ఫోన్ చేసి,నువ్వు ఒకరిని మోసం చేశావని తమ పేపర్‌లో రాయమని వాళ్ళు వచ్చి చెప్పారని,రాయకుండా ఉండాలంటే తనకు,తన పేపర్‌లో క్రైమ్ రిపోర్టర్‌గా ఉన్న నిమ్మశెట్టి రాజుకి రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు.భయభ్రాంతులకు గురైన మహిపాల్ ఈ నెల 14న సాయంత్రం ఫోన్‌పే ద్వారా రూ.10 వేలు చెల్లించాడు.అయినప్పటికీ వారు మిగతా రూ.20 వేలు కూడా ఇవ్వాలని మళ్లీ బెదిరించారు.ఈ సంఘటనపై బాధితుడు వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో తోగరి కరుణాకర్,నిమ్మశెట్టి రాజు అనే ఇద్దరి వ్యక్తులపై ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి కరుణాకర్ ను రిమాండ్ కు తరలించినట్లు సిఐ తెలిపారు.మరో వ్యక్తి నిమ్మశెట్టిరాజు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.రిపోర్టర్లమని చెలామణి అవుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న కరుణాకర్,రాజులకు సంబంధించిన బాధితులు ఎవరైనా ఉంటే వేములవాడ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేయాలని సూచించారు.




తప్పు చేస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదు.. సీఐ వీరప్రసాద్

వేములవాడలో గత కొంత కాలంగా విలేకర్ల ముసుగులో అక్రమ దందాలతో అందిన కాడికి దండుకోవడం రివాజుగా మారిందనే తీవ్రమైన ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఇలాంటి చట్టవిరుద్ధమైన చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని పట్టణ సీఐ వీర ప్రసాద్ హెచ్చరించారు.పట్టణంలోనికొంతమంది విలేకర్లు సంబంధం లేని సంఘాలు ఏర్పాటు చేసుకోని దానికి కమిటీలను ఏర్పాటు చేస్తూ సోషల్ మీడియా ద్వారా ఫ్లెక్సీ లలో ప్రచారం చేసుకుంటూ జర్నలిజం విలువలను మంట కలుపుతున్నారని మండిపడ్డారు.దీంతో పాటు ప్రముఖ దినపత్రికల్లో, న్యూస్ ఛానళ్లలో పనిచేసే పాత్రికేయుల పేర్లు వాడుకోవడంతో పాటు తాము ఎడిటర్లమని,డివిజన్,జిల్లా స్థాయి విలేకర్లమంటూ, ప్రచారాలు చేసుకొని సూపర్ మార్కెట్లు, ప్రైవేట్ ఆసుపత్రులు, కాంట్రాక్టర్లతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే అధికారుల నుండి మొదలు చిరు వ్యాపారుల వరకు బ్లాక్‌మెయిల్ చేస్తూ వసూళ్ల భాగోతానికి పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు.అంతే కాకుండా సంబంధంలేని సంఘాలు ఏర్పాటు చేస్తూ విలేకరులమంటూ ఎవరికి వారే ఐడి క్రియేట్ చేసుకుని అక్రమదందాలు కొనసాగిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటి విలేకర్లలపై గట్టి నిఘా ఏర్పాటు చేసి తమదైన శైలిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.విలేకరుల ముసుగులో అక్రమ దందాలకు పాల్పడుతున్న వ్యక్తులపై చట్టరీత్య కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

## భైంసా పట్టణంలోని ఆల్ఫోర్స్ పాఠశాలలో ముందస్తు దీపావళి ఘనంగా వేడుకలు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 16 (భారత శక్తి):భైంసా పట్టణంలోని ఆల్ఫోర్స్ పాఠశాలలో ముందస్తు దీపావళి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి పాల్గొని లక్ష్మి దేవికి పూజలు నిర్వహించారు.చైర్మన్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ లక్ష్మి దేవి పూజ విశిష్టత గురించి విద్యార్థులకు వివరించారు.ఎంత ఉన్నత విద్యాలను అభ్యసించిన మన సంస్కృతి సంప్రదాయాలు మరియు సనాతన ధర్మలు మార్చి పోవద్దని విద్యార్థులతో మాట్లాడారు.అనంతరం విద్యార్థులు అష్టలక్ష్మి అవతారాలతో అలంకరించుకొని నృత్యాలతో అలరించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# మహిళా, శిశు అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహణ

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 16: గురువారం ఐడిఓసి లోని సమావేశ మందిరంలో మహిళా, శిశు అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 16




వరకు ఈ పోషక మాసం కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. గురువారం కలెక్టరేట్లో నిర్వహించిన పోషకమాసం ముగింపు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ల

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మనం రోజూ తినే ఆహారంలో చక్కెర, ఆయిల్, ఉప్పు స్థాయిలను తగ్గించి వాడుకోవాలని సూచించారు. అంగన్వాడిలలో నిర్వహించే సామాజిక వేడుకలను మరింత బలోపేతంగా నిర్వహించాలని సూచించారు. వీటి ద్వారా కమ్యూనిటీలో అవగాహన తీసుకురాగలమని చెప్పారు. క్షేత్రస్థాయిలో గర్భిణీలకు , బాలింతకు అంగన్వాడి కేంద్రం కేంద్రాలలో సరైన పోషక విలువలు కలిగిన ఆహారం అందించాలని సూచించారు. జిల్లాలో లోప పోషణ స్థాయిని తగ్గించాలని ఈ కార్యక్రమంలో తెలిపారు.

జిల్లా న్యాయ సేవ సాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాలలో పౌష్టికాహారం రెగ్యులర్ గా అందించి గర్భిణీ స్త్రీలు, బాలింతలలో ఎనీమియా తగ్గించి అనీమియా రహిత భారత్ గా మార్చాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ చేతుల మీదుగా గర్భిణీలకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. అనంతరం ఆరోగ్యలక్ష్మిలో రెగ్యులర్ అటెండెన్స్ ఉన్న గర్భిణీకి, నార్మల్ డెలివరీ అయి పూర్తి ఆరోగ్యంగా ఉన్న చిన్నారులకు కలెక్టర్ చేతుల మీదగా బహుమతులు ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో చిల్డ్రన్ హోమ్ చిన్నారుల నృత్య ప్రదర్శన అలరించింది.

ఈ కార్యక్రమం చివరలో అంగన్వాడి టీచర్ల చేత నిర్వహించబడిన పోషకాహార ప్రదర్శనను జిల్లా కలెక్టర్ వీక్షించారు, ఈ పోషక ఆహారాలను జిల్లా కలెక్టర్ రుచి చూసారు. పోషకాహార ప్రదర్శనలో చిరుధాన్యాలతో చేసిన పోషకాలు ఆకర్షణగా నిలిచాయి.

ఈ కార్యక్రమంలో శిక్షణ డిప్యూటీ కలెక్టర్ రవితేజ, ప్రోగ్రాం ఆఫీసర్ యమిమ, జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, సీడీపిఓ లు, అంగన్వాడీ సువర్వైజర్లు, లబ్దిదారులు పాల్గొన్నారు.

# శ్రీ వెంకటేశ్వర స్వామి బుగులోని జాతర ఏర్పాట్ల పరిశీలించిన ఎమ్మెల్యే సత్యనారాయణ

భూపాలపల్లి,భారత శక్తి, అక్టోబర్ 16:

శ్రీ వెంకటేశ్వర స్వామి బుగులోని జాతర ఏర్పాట్లను



గురువారం శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహూల్ శర్మ పరిశీలించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, పారిశుధ్యం, రవాణా, పార్కింగ్, విద్యుత్, వైద్య సేవలు తదితర అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు.

దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతర, బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై అధికారులు వివరాలు తెలియజేశారు. అధికారులు పరస్పర సహకారంతో జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి,

వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, ఆర్ డబ్ల్యూ ఎస్ ఈ ఈ శ్వేత పంచాయతీరాజ్ ఈ ఈ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శ్వేతా, ఎంపిడిఓ వెంకటేశ్వర్లు, ఎంపిఓ రాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అధిక ఎరువుల వినియోగాన్ని కట్టడి చేసేలా రైతులకు అవగాహన పెంచండి:జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

వై ఎస్ ఆర్ కడప,అక్టోబర్ 16:

అధిక ఎరువుల వినియోగాన్ని కట్టడి చేసేలా రైతులకు అవగాహన పెంచాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు..

కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో భూమాత రక్షణ కమిటీ జిల్లా



స్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ మరియు చైర్మన్ అధ్యక్షతన జడ్పీ సీఈఓ కో- చైర్మన్ గా, జిల్లా వ్యవసాయ అధికారి కన్వీనర్ గా, జిల్లా సూపరిండెంట్ ఆఫ్ పోలీస్, జిల్లా సహకార శాఖ అధికారి కెవికె శాస్త్రవేత్త మరియు ఎరువుల కంపెనీలప్రతినిధులు సభ్యులుగా కమిటీ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...

జిల్లాలో ప్రకృతి వ్యవసాయం సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు భూమాత రక్షణ కమిటీ లో ఈ అంశాన్ని చేర్చి ప్రకృతి సేద్య పద్ధతులపై రైతులకు అవగాహన పెంచేందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు.. ఐదుగురు ప్రోత్సాహక రైతులను ఈ కమిటీలకు సభ్యులుగా తీసుకోవాలన్నారు.. డివిజన్ మరియు గ్రామస్థాయి కమిటీలను వీలైనంత త్వరగా ఏర్పాటు చేసి సమావేశాలు నిర్వహించేలా భూమాత రక్షణకు తీసుకోవలసిన చర్యలు పై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు కమిటీల ఏర్పాటు తక్షణం జరగాలన్నారు.జిల్లాలోని 100 గ్రామాలలో ఎక్కడ రసాయన ఎరువుల వినియోగం అధికంగా ఉండే గ్రామాలను గుర్తించి ఆ రైతులకు అవసరమైన సలహాలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులను సూచించి అధిక ఎరువుల వినియోగాన్ని కట్టడి చేయాలన్నారు.

ఎరువుల కంపెనీల ప్రతినిధులు మరియు డీలర్లలు అధిక ధరలకు ఎరువుల ను అమ్మరాదని, ఎమ్మార్పీ ధరలకే ఎరువుల పంపిణీ చేసి రైతులకు ఎరువుల వినియోగం పై అవగాహన కల్పించాలన్నారు.. డివిజన్ మరియు గ్రామస్థాయిలో వీలైనంత త్వరగా సమావేశాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి వచ్చే అభిప్రాయాలను తీసుకొని అందుకు అనుగుణంగా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు.

కెవికె శాస్త్రవేత్తలు పంటల వారీగా ఎరువుల మోతాదును సూచించి రైతులతో అమలు చేసే విధంగా చూడాలన్నారు.

ఈ కమిటీ ప్రధాన ఉద్దేశమైన భూమాత రక్షణకు అవసరమైన ప్రణాళికల రూపకల్పనలో సంబంధిత శాఖలు అన్ని సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్, జడ్పీ సీఈవో ఓబులమ్మ ఇతర సంబంధిత కమిటీ సభ్యులు అయిన అధికారులు పాల్గొన్నారు.

# జాతీయ స్కేటింగ్‌కు స్మార్ట్ కిడ్జ్ విద్యార్థిని ఎంపిక

## చిన్నారి పసుపులేటి వీక్షకు స్కేటింగ్ లో పతకాల పంట

ఖమ్మం ప్రతినిది (భారత శక్తి ), అక్టోబర్ 16:

స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో ఒకటో తరగతి విద్యార్థిని పసుపులేటి వీక్ష జాతీయస్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికై జిల్లా ఖ్యాతిని ఇనుమడింప చేసింది. పాఠశాల చిన్నారి వీక్ష హైదరాబాదులో నిర్వహించిన తెలంగాణ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్షిప్ 2025 రాష్ట్ర స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలలో రెండు విభాగాలలో పతకాలను సొంతం చేసుకుంది.



400 మీటర్ల రోలర్ స్కేటింగ్ లో సిల్వర్ మెడల్, మరో విభాగం 600 మీటర్ల స్కేటింగ్లో మరో సిల్వర్ మెడల్ ను సాధించి డిసెంబర్ లో జరిగే జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపికైంది. అదేవిధంగా జిల్లాస్థాయి స్కేటింగ్ పోటీలలో 600 మీటర్ల విభాగంలో గోల్డ్ మెడల్ ను, 400 మీటర్ల స్కేటింగ్ విభాగంలో సిల్వర్ మెడల్ ను సాధించింది. పలు విభాగాలలో రోలర్ స్కేటింగ్ లో వరుసగా పతకాల పంట పండించిన చిన్నారి పసుపులేటి వీక్షను పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మెడల్స్ అందించి అభినందించారు. ఈ సందర్భంగా కరెస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుతోపాటు క్రీడా, సాంస్కృతిక, సాంప్రదాయ అంశాలలో ప్రత్యేకంగా తర్ఫీదు ఇస్తున్నామన్నారు. అందువలన పాఠశాల చిన్నారులు వివిధ జాతీయ,రాష్ట్ర ,జిల్లా స్థాయి పోటీలలో నైపుణ్యాలను ప్రదర్శించి బహుమతులను పొందుతున్నారని తెలిపారు. చిన్నారి పసుపులేటి వీక్ష జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపిక కావడం ఆనందంగా ఉందని తెలియజేశారు. పసుపులేటి వీక్ష ను పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్,ఉపాధ్యాయులు అభినందించారు.

# చదువుతోపాటు క్రీడలు ముఖ్యమే: జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

## – పటాన్చెరువు లో అట్టహాసంగా ప్రారంభమైన 69వ ఎస్ జి ఎఫ్ క్రీడలు

సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 16 :

విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ముఖ్యమే అని జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య అన్నారు. గురువారం పటాన్చెరు మైత్రి క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయి, 69వ ఎస్ జి ఎఫ్ క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ పి . ప్రావీణ్య ,మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి ,పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి హాజరయ్యారు.రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ క్రీడా పోటీల ప్రారంభం సందర్భంగా ముందుగా క్రీడా ప్రాంగణంలో క్రీడాజ్యోతిని క్రీడా పతాకాన్ని ముఖ్య అతిథులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఈ మూడు రోజులు అత్యంత కీలకమన్నారు .ఈ మూడు రోజులపాటు జరిగే క్రీడల్లో రాణిస్తే జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొనే అవకాశం దక్కుతుందన్నారు. చదువుతోపాటు విద్య ఉద్యోగ ఉపాధి అవకాశాలను ప్రాముఖ్యం లభించే వీలు ఏర్పడుతుందన్నారు. క్రమశిక్షణతో క్రీడా పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయి క్రీడల్లో రాణించేలా ప్రతి ఒక్క క్రీడాకారుడు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు పటాన్ చెరువులో జరిగేలా ఆతిథ్యం కల్పించినందుకు స్థానిక ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ప్రపంచంలో అత్యధిక జనాభా మన దేశంలో ఉన్నప్పటికీ కామన్వెల్త్ ఒలింపిక్ క్రీడల్లో పథకాల పట్టికలో మన దేశం చివరి స్థానంలో ఉంటున్నదన్నారు. అలాంటి పరిస్థితి రూపుమాపేందుకు ప్రధానమంత్రి మోడీ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత క్రీడాకారులను వెలికి తీయడం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. రానున్న ఒలంపిక్ క్రీడా పోటీల వరకు పథకాల పట్టికను దేశాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు వ్యాయామ ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థుల





తల్లిదండ్రులు చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యం అనే విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు ఉ పా ధ్యా యు లు గ్రహించాలన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో క్రీడా పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయికి ఎంపిక కావాలని క్రీడా పోటీల్లో పాల్గొనడం వల్ల శారీరక మానసిక దృఢత్వం తోపాటు విద్యా ,ఉపాధి అవకాశాల లో పుష్కలమైన అవకాశాలు వస్తాయని ఆ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని క్రీడాకారులు క్రీడల్లో రాణించాలన్నారు.ఈ సందర్భంగా పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ గత పది రోజులుగా రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు విజయవంతం కోసం అహర్నిశలు శ్రమించిన ఉపాధ్యాయులకు అధికారుల బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యే విధంగా క్రమశిక్షణకు క్రీడా పోటీల్లో పాల్గొనాలని తమ పోలీసు శాఖ ఆధ్వర్యంలో క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు, విద్యార్థులకు అవసరమైన భద్రత పరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇలాంటి అభద్రతాభావానికి గురి కాకుండా స్వేచ్ఛగా క్రీడా పోటీల్లో విద్యార్థులు పాల్గొనాలని సూచించారు. ఏర్పాటు విద్యార్థులు క్రమశిక్షణతో రెఫరీలు ,కోచులు చెప్పిన విధంగా క్రీడా పోటీల్లో పాల్గొని 69 వ ఎస్ జి ఎఫ్ క్రీడా పోటీల విజయవంతం కోసం కృషి చేయడంతో పాటు జాతీయస్థాయిలో రాణించి రాష్ట్రానికి తమ పాఠశాలలకు గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన సంక్షేమ, క్రీడా శాఖల అధికారి ఖాసీం బేగ్ , ఆర్డిఓ రాజేందర్, సంబంధిత శాఖ అధికారులు, కోచ్ లు, ఉపాధ్యాయులు, కార్పొరేటర్లు , ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# బిసిల నోటికాడ ముద్దని గుంజుకున్న బిజెపి పార్టీ

**-బిసి రిజర్వేషన్లను 9వ షెడ్యూల్లో చేర్చకుండా మోసం చేసింది**

**-42 శాతంతోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి**

**- బిసి హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షులు కళ్లెం కృష్ణ డిమాండ్**

భారతశక్తి, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 16: రాష్ట్రంలో బిసిల నోటికాడ ముద్దను బిజెపి పార్టీ గుంజుకుందని, బిసి రిజర్వేషన్లను 9 వ షెడ్యూల్ లో చేర్చకుండా మోసం చేసిందని బిసి హక్కుల సాధన సమితి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు కళ్లెం కృష్ణ విమర్శించారు. బిసి హక్కుల సాధన సమితి , భారత కమ్యూనిస్టు పార్టీ సంయుక్త ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట పట్టణంలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు నిలబడి నిరసన తెలియజేసి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించడం



జరిగింది. బిసి హక్కుల సాధన సమితి యాదగిరిగుట్ట మండల అధ్యక్షుడు పాకాలపాటి రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు కళ్లెం కృష్ణ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణ కల్పించాలని గత ఇరవై నెలలుగా బిసి సమాజం ముక్తకంఠంతో కోరుతుంటే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదని, దీనితో రిజర్వేషన్ వ్యతిరేకులు న్యాయస్థానాలను వేదికగా చేసుకొని బిసిల రిజర్వేషన్లకు గండి కొట్టాలని చూస్తున్నారని, బిసి రిజర్వేషన్లు ఒక్క శాతం తగ్గినా రాష్ట్రం అగ్నిగుండగా మారుతుందని తీవ్రంగా హెచ్చరించారు. రిజర్వేషన్లను అడ్డుకోవాలని నాటి నుండి నేటి వరకు బిజెపి చేస్తున్న కుట్రలలో భాగంగా బిసిల వ్యతిరేక పార్టీ బిజెపి అని బిసిలు గుర్తించాలని, అదేవిధంగా ఈ సందర్భంగా బిజెపి రెండు నాలుకల విధానం వల్ల బిసి రిజర్వేషన్లపై తమకున్న వ్యతిరేక భావనతోనే ఢిల్లీలో రాష్ట్రపతి మరియు గల్లీలో గవర్నర్ బిసి రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదం తెలపడం లేదని, రాష్ట్రపతి భవన్ ను మరియు రాజ్ భవన్ ను ప్రభావితం చేస్తున్న అదృశ్య శక్తి బిజెపి అని ఆరోపించారు. బిజెపికి చిత్తశుద్ధి ఉంటే కనీసం కేంద్ర మంత్రులు అయినా గవర్నర్ ను కలిసి బిసి రిజర్వేషన్ల చట్టానికి ఆమోదముద్ర వేయించేవారన్నారు. బిసి రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణ లేదని రెడ్డి జాగృతికి చెందిన రిజర్వేషన్ వ్యతిరేకులు కోర్టులను వేదికగా చేసుకుని బిసిలను రాజకీయంగా అణచివేయాలని కుట్రలకు పాల్పడుతున్నారని వారి కుట్రలను ఎండగట్టి బిసి రిజర్వేషన్లను రక్షించుకుంటామని ఆయన తెలిపారు. ఇది బిసి ఉద్యమానికి ఆరంభం మాత్రమేనని పేర్కొన్నారు. ఈనెల 18న జరిగే తెలంగాణ రాష్ట్ర బంద్ ను జయప్రదం చేయాలని, బంద్ లో ప్రతి బిసి బిడ్డ పాల్గొని 42 శాతం రిజర్వేషన్ల అమలుకు పోరాడాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు పేరబోయిన మహేందర్ మాట్లాడుతూ ఈ దేశానికి బిసి ప్రధానమంత్రినని చెప్పుకునే నరేంద్ర మోడీ కేంద్ర మంత్రివర్గంలో కనీసం బిసి మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరమని, బిసి రిజర్వేషన్ పై హైకోర్టులో ఉన్న స్టేను తక్షణమే ఎత్తివేసి స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని, 9వ షెడ్యూల్లో బిసి రిజర్వేషన్ ను చేర్చి, తద్వారా బిసిలకు ఉద్యోగ, రాజకీయ ప్రాధాన్యత అందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, యాదగిరిగుట్ట పట్టణ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్, మున్సిపల్ మాజీ కో ఆప్షన్ సభ్యుడు పేరబోయిన పెంటయ్య, మండల కార్యవర్గ సభ్యుడు పేరబోయిన బంగారు, మాటూరు మల్లయ్య, నమిల సంజీవ, ఆరె పుష్ప, మునికుంట్ల నర్సమ్మ, బిసి హక్కుల సాధన సమితి మండల కార్యదర్శి అనంతుల నరసింహ, బిసి సంఘం నాయకులు గుండు వెంకటేష్, గోపగాని రాజు, పబ్బాల స్వామి, దండేబోయిన సురేష్, వెంకటేష్, ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్ల మరమ్మత్తులు వెంటనే చేపట్టాలి: జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం ప్రతినిది (భారత శక్తి ), అక్టోబర్ 16:క్రొత్తగా నిర్మిస్తున్న రోడ్ల నిర్మాణ పనులు వేగంగా పూర్తిచేయడంతో పాటు, ఉన్న రోడ్ల మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో రోడ్ల నిర్వహణపై రోడ్లు, భవనాల శాఖ, జాతీయ రహదారుల ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఇటీవల వర్షాలకు రహదారులు చాలా చోట్ల దెబ్బతిన్నాయని అన్నారు. దెబ్బతిన్న రోడ్ల గుంతలు, చిన్న చిన్న మరమ్మత్తులు వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ అన్నారు.జిల్లా ప్రవేశం వద్ద నలువైపులా జిల్లాకు సంబంధించి నామ బోర్డులు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా కేంద్రం ప్రవేశం వద్ద రోడ్లు దెబ్బతిని ఉన్నాయని, నగర పరిధిలోని రోడ్ల నిర్వహణ నగరపాలక సంస్థ చేపడుతుండగా, ప్రారంభం వద్ద సంబంధిత శాఖలు రోడ్ల నిర్వహణ చేయాలని కలెక్టర్ అన్నారు. నగర ప్రవేశం వద్ద గ్రీనరీతో సుందరీకరణ పనులు చేయాలని అన్నారు. జిల్లాలో రోడ్ల విస్తరణ, మరమ్మత్తులు, నూతన రోడ్ల నిర్మాణ ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద పెండింగ్ వివరాలు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. అనుమతికి సమర్పించిన ప్రతిపాదనల స్థితిని తెలుసుకొని, అనుమతి పొందేలా చర్యలు చేపట్టాలని అన్నారు. రహదారి భద్రత అధికారులుగా మనపై ఉందని కలెక్టర్ అన్నారు. బైపాస్ బ్రిడ్జి వెడల్పుకు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. అల్లిపురం, వెలుగుమట్ల తదితర ప్రదేశాల్లో విద్యుత్ స్తంభాల తరలింపు ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. మంజూరయిన రోడ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలన్నారు.ఈ సమీక్షలో ఆర్ అండ్ బి ఎస్ఇ యాకుబ్, ట్రాన్స్కో ఎస్ఇ శ్రీనివాసాచారి, నేషనల్ హైవే పిడి రామాంజనేయ రెడ్డి, ఆర్ అండ్ బి ఇఇ లు పవార్, తానేశ్వర్, నేషనల్ హైవే ఇఇ యుగంధర్, డిఇ లు, ఏఇ లు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాంస్కృతిక సారథి పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా పౌర సంబంధాల అధికారి శ్రీనివాస్

భూపాలపల్లి (భారత్ శక్తి )అక్టోబర్ 16:

భూపాలపల్లి డిపిఆర్వో కార్యాలయంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుడుగా విధులు నిర్వహిస్తున్న వాగ్గేయ కారుడు మైస ఎర్రన్న ఈ నెల 26వ తేదీన హన్మకొండలోని కాళోజి కళాక్షేత్రంలో 40 మందిపైగా రచయితలకు సంబంధించిన 150 గేయాలను



సాహిత్యం చూడకుండా ఏకధాటిగా వేదికపై ఆలపించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా పౌర సంబంధాల అధికారి శ్రీనివాస్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా డిపిఆర్ఓ శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రజలకు పరిచయం చేసే విశిష్ట కార్యక్రమంగా ఇది నిలుస్తుందని తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఈ సంగీత కార్యక్రమాన్ని వీక్షించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాకారులు స్వప్, రవి, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ శాఖకు జి.పి.ఓ లు కళ్ళు లాంటి వారు: జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి (భారత్ శక్తి) అక్టోబర్ 16: ఐడిఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో నూతనంగా నియమితులైన జి.పి.ఓ లకు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో భూ భారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ రాహుల్ శర్మ ముఖ్య అతిథిగా హాజరై విధుల పట్ల జి.పి.ఓ లకు మార్గదర్శక సూచనలు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ విధులు అత్యంత కీలకమని, చాలా బాధ్యతాయుతమైనటువంటి జి.పి.ఓ లు గ్రామాల్లో ప్రభుత్వానికి కళ్లు, చెవులు లాంటి వారని తెలిపారు. గ్రామ స్థాయిలో ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండటం వారి ప్రధాన బాధ్యతని తెలిపారు. భూముల సమస్యలు, రైతుల ఇబ్బందులు, ప్రజల అభ్యర్థనలను మొదటగా గుర్తించేది జి.పి.ఓ లేనని తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టంను ప్రవేశపెట్టిందని, ప్రతి జి.పి.ఓ ఈ చట్టంపై పూర్తి అవగాహనతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు సుమారు 54 వేల దరఖాస్తులు వచ్చాయని, వాటి పరిశీలనలో జి.పి.ఓ లు కీలక పాత్ర పోషించాలన్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా పరిష్కరించాలన్నారు.

గతంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎవరైనా అవినీతి లేదా అక్రమాలకు పాల్పడితే, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం మన కర్తవ్యమని గుర్తుంచుకోవాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

జి.పి.ఓ లు తమ పనిని సేవా దృక్పథంతో, ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్వర్తిస్తే, భూ భారతి కార్యక్రమం విజయవంతమవుతుందని కలెక్టర్ రాహుల్ శర్మ విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డీఓ రవి, ట్రైని డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, భూపాలపల్లి తహసిల్దార్ శ్రీనివాసులు, జిపివోలు తదితరులు పాల్గొన్నారు.


# ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు 15 శాతానికి పెంచాలి

* ఈడబ్ల్యూఎస్ జాతీయ జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటు చేయాలి
* వరంగల్ లో 19 న జరిగే మహా సభను విజయవంతం చేయాలి
* తెలంగాణ రాష్ట్ర ఓసీ (ఈడబ్ల్యూఎస్) రాష్ట్ర అధ్యక్షులు ఎన్నపల్లి లింగారెడ్డి
* ఓసీల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే..
* ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై కొందరు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు
* రాష్ట్ర రెడ్డి సంఘాల కన్వీనర్ బద్దూరి వెంకటేశ్వర్ రెడ్డి

ఎల్బీనగర్, అక్టోబర్ 16 (భారత శక్తి): ఈడబ్ల్యూఎస్ జాతీయ జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటు చేసి 10 శాతం ఉన్న రిజర్వేషన్లను 15 శాతానికి పెంచాలని తెలంగాణ రాష్ట్ర ఓసీ (ఈడబ్ల్యూఎస్) రాష్ట్ర అధ్యక్షులు ఎన్నపల్లి లింగారెడ్డి, రెడ్డి సంఘం తెలంగాణ రాష్ట్ర యూత్ అధ్యక్షులు కిరణ్ కుమార్ రెడ్డి ఇరువురు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బుధవారం అల్కాపురిలోని స్వాగత్ హోటల్లో తెలంగాణ రాష్ట్ర ఓసీ (ఈడబ్ల్యూఎస్) సంఘం సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల కల్పనపై పలుమార్గదర్శకాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈడబ్ల్యూఎస్ అగ్రవర్ణ పేదలకు వరమని తెలిపారు. ఈడబ్ల్యూఎస్ లో ఉన్న 8 లక్షల పరిధిని 12లక్షలకు పెంచాలని ప్రభుత్వాన్ని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అదే విధంగా విదేశీ విద్యా నిధిని

* ఏర్పాటు చేయాలన్నారు. విద్యా, ఉద్యోగ దరఖాస్తులకు రుసుంను అందరికి సమానంగా ఉండే విధంగా చూడాలన్నారు.

రాష్ట్రంలో 30 శాతం ఉన్న ఓసీలను 10 శాతంగా చూపించడం ప్రభుత్వానికి తగదు అని అన్నారు. ఓసీలు కోరుతున్న డిమాండ్లను



ప్రభుత్వం పరిగణలోకి తీసుకొని న్యాయం చేయాలని కోరారు. ఈ నెల 19వ తేదీన వరంగల్ లో నిర్వహించే ఈడబ్ల్యూఎస్ సంఘ సమావేశానికి ఓసీలు అధిక సంఖ్యలో తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్ర రెడ్డి సంఘాల కన్వీనర్ బద్దూరి వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం లోని ఓసీలందరం ఏకథాటిపై ఉందామని పిలుపునిచ్చారు. ఓసీల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. రాజ్యాంగపరంగా ఈడబ్ల్యూఎస్ పై హక్కులను కల్పిస్తే కొంతమంది అవగాహన లేక మాట్లాడుతున్నారని అన్నారు. ఏ రాజకీయ పార్టీ అయితే ఓసీల హక్కులను కాపాడడానికి వెనుకకు పోతదో, దుష్ప్రచారం చేస్తదో వారి రాజకీయ పార్టీకి మనగడ ఉండదని అన్నారు. ఓసిలందరూ కలిసి ఐక్యంగా ఉండి భవిష్యత్తు కార్యాచరణను రూపొందిద్దామని అన్నారు. రాష్ట్రంలో ఉన్న ఓసీలందరూ ఏకతాటిపై తీసుకువచ్చి దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. ప్రభుత్వము కుల గణన చేసిన, కులాల లెక్కలను బయట పెట్టలేకపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో జైపాల్ రెడ్డి, కొమ్మిడి వెంకట్ రెడ్డి, నరసింహారెడ్డి, పిట్ట శ్రీనివాస్ రెడ్డి, బోయినపల్లి పాపారావు, మొగుళ్ల పల్లి ఉపేందర్ గుప్తా, ప్రేమ్ గాంధీ, కోడుమూరు దయాకర్, అవధానుల ప్రసాద్ శర్మ, ప్రసాద్ చౌదరి, శ్రీనివాస్ చౌదరి, నవీన్ చౌదరి, కవితా రెడ్డి, విజయా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## ఉప ఎన్నిక కోసం ఈవీఎం –వీవీ పాట్ల మొదటి రాండమైజేషన్ పూర్తి

హైదరాబాద్, అక్టోబర్ 16 (భారత శక్తి): జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికల సన్నాహాల్లో భాగంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు (ఈవీఎంలు), ఓటర్ వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ ట్రయిల్ (వీవీ పాట్లు) మొదటి రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి అయ్యింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ పర్యవేక్షణలో, భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈ రాండమైజేషన్ ప్రక్రియను ఈవీఎం మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఈఎంఎస్) ద్వారా, జాతీయ, రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగా నిర్వహించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని 407 పోలింగ్ కేంద్రాల కోసం మొత్తం 569 బ్యాలెట్ యూనిట్లు, 569 కంట్రోల్ యూనిట్లు, 610 వీవీ పాట్లు కేటాయించబడ్డాయి. ఈ రాండమైజేషన్ జాబితాను సంబంధిత రాష్ట్ర, జాతీయ రాజకీయ పార్టీల ప్రతినిధులతో పంచుకున్నారు. ఎంపికైన ఈవీఎంలు, వీవీపాట్లు సంబంధిత నియోజకవర్గ స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. తదుపరి, పోటీ అభ్యర్థుల తుది జాబితా ఖరారు అయిన తర్వాత, ఈ రాండమైజ్ చేసిన ఈవీఎంలు, వీవీపాట్ల వివరాలను అభ్యర్థులతో పంచుకుంటారు.

# బీసీ బంద్ కు సంపూర్ణ మద్దతు..

* జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్ల కోసం కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేయాలి?.
* ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలి?.
* రాజ్యాంగ పరిరక్షణ వేదిక, సెక్రటరీ చెన్నోజు శ్రీనివాసులు,టి.ఎంఆర్పిఎస్, అధ్యక్షులు పొట్ట పెంజర రమేష్. బీసీ జేఏసీ కన్వీనర్ ఏ. సాయికుమార్



ఎల్బీనగర్, హైదరాబాద్, అక్టోబర్ 16 (భారత శక్తి): ఈ నెల 18వ తారీకున జరిగే బీసీ బందుకు సంపూర్ణ మద్దతు తెలుపుతుంది. శాసన నిర్మాణంలో బడ్జెట్ కేటాయింపులో భాగస్వామ్యానికై అసెంబ్లీ, పార్లమెంట్ లోరిజర్వేషన్లు లేకుండా కేవలం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అంటే ఎలా అని నిలదీశారు. బీసీలకు జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్ల కోసం కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్లో చేర్చాలని బీసీలకు మరణ శాసనంగా మారిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో రిజర్వేషన్ వ్యతిరేక పార్టీలకు అతీతంగా అభ్యర్థిని బరిలో దింపి ఐక్యత చాటాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఎంఆర్పిఎస్ అధ్యక్షులు పొట్ట పెంజర రమేష్, బీసీ జేఏసీ కన్వీనర్ ఏ. సాయికుమార్ ముదిగొండ ఎల్లేష్, దుబ్బ ఆంజనేయులు, అందుగుల నవీన్ కుమార్, పెద్దఊర బ్రహ్మయ్య, బచ్చు రామకృష్ణ, మల్లెల సుజాత తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీ మరియు షార్ట్ ఫిల్మ్ పోటీలకు ఆహ్వానం..

* జిల్లా ఎస్పీ శ్రీ పరితోష్ పంకజ్ ఐపిఎస్



సంగారెడ్డి, అక్టోబర్ 16 (భారత శక్తి) : పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం, పోలీసు ఫ్లాగ్ డే ను పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లాలో గల ఔత్సహిక ఫోటోగ్రాఫర్లకు "ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్" కు సంబంధించి తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్ తెలియజేశారు. పోలీస్ ఫ్లాగ్ డే/పోలీసు అమరవీరుల ప్రాణత్యాగాలను స్మరిస్తూ ఈ నెల 21 నుంచి 31 వరకు నిర్వహించనున్న వారోత్సవాలలో భాగంగా "అత్యవసర సమయాల్లో పోలీసులు స్పందన. ప్రకృతి వైపరిత్యాల్లో పోలీసుల సేవ, ఇతర సందర్భాల్లో పోలీసుల కీర్తి ప్రతిష్టలను పెంపొందించే" అంశాలకు సంబంధించి గత సంవత్సరం 2024 అక్టోబర్ నుండి ప్రస్తుత సంవత్సరం అక్టోబర్ నెల ఇప్పటి వరకు తీసిన 3ఫోటోలు, తక్కువ నిడివి (3నిమిషాలు) గల షార్ట్ ఫిలిమ్స్ మాత్రమే ఈ పోటీల నామినేషన్లకు పంపించాల్సి వుంటుంది. షార్ట్ ఫిలిమ్స్ లోడ్ చేసిన పెన్ డ్రైవ్, 10 x 8 సైజ్ 3ఫోటోలను పెన్ డ్రైవ్లో సాఫ్ట్ కాపీ ని రాష్ట్రస్థాయి పోటీల కోసం ఈ నెల 22వ తేదీలోపు సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ పి.ఆర్.వో సెక్షన్ లో అందజేయాలన్నారు. మరిన్ని వివరాల కోసం పి.ఆర్.వో నెంబర్ 8712539040 కు సంప్రదించాలన్నారు.



## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

ఎల్బీనగర్, అక్టోబర్ 16 (భారత శక్తి): జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచార వేడి రోజురోజుకూ ఊపందుకుంటోంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఉదయం మార్నింగ్ వాక్ చేస్తూ వెంగళ్‌రావు నగర్ పరిధిలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీతకి మద్దతుగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు, కార్పొరేటర్ దేదీప్య రావు పలువురు భారాస పార్టీ నాయకులు ప్రజల మద్దతుతో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా నేతలు ప్రజలను కలుసుకుని రెండేండ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా హిత కార్యక్రమాలు, అభివృద్ధి పథకాలు వివరించారు. అలాగే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను, బాకీ కార్డులను ప్రజలను మోసం చేస్తున్న విధానాన్ని ప్రజలకు వివరించారు. ప్రజల ఆదరణతో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుండి బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతని ఘన విజయంతో గెలిపించాలని నేతలు కోరారు.

# స్థానిక ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లల నిబంధనపై

## తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం

హైదరాబాద్, అక్టోబర్ 16 (భారత శక్తి) : స్థానిక ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లలు నిబంధనపై తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇద్దరు పిల్లల నిబంధన తొలగించాలని మంత్రి వర్గం నిర్ణయించింది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాలయంలో మంత్రివర్గ సమావేశం జరిగింది. కేబినెట్ నిర్ణయాలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాకు వివరించారు. పలు రంగాలకు భూ కేటాయింపులు జరిపేందుకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. మద్దతు ధరతో పాటు సన్నవడ్లకు బోనస్ కూడా ఇస్తామన్నారు. "రాష్ట్రంలో కొత్తగా 3 వ్యవసాయ కళాశాలల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. నల్సార్‌లో స్థానిక విద్యార్థులకు 50శాతం సీట్లు ఇవ్వాలని కేబినెట్ తీర్మానించింది. నల్సార్ వర్సిటీకి గతంలో ఇచ్చిన దానికంటే అదనంగా 7 ఎకరాలు ఇస్తాం. రైతులు పండించిన ధాన్యం మొత్తం కొనుగోలు చేయాలని నిర్ణయించాం. కేంద్రం కొనుగోలు చేసినా.. చేయకపోయినా మా ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. ప్రజాపాలనకు రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఉత్సవాలు నిర్వహిస్తాం. దీనికి సంబంధించి కేబినెట్ సబ్ కమిటీ వేశాం. హైదరాబాద్ మెట్రోకు సంబంధించి కేబినెట్‌లో సుదీర్ఘంగా చర్చించాం. మెట్రో రెండో దశను క్షుణ్ణంగా పరిశీలించేందుకు సీఎస్ ఛైర్మన్‌గా కమిటీ ఏర్పాటు" అని మంత్రి పొంగులేటి తెలిపారు.





ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీతకి మద్దతుగా బుధవారం వెంగళ్ రావు నగర్ డివిజన్ రహమత్ నగర్ పరిధిలో ప్రచారంలో పాల్గోని వీధిలోని ఇడ్లీ బండి మీద దోశలు వేస్తూ బీఆర్ఎస్ అభ్యర్థికి ఓటు వేయాలని చెబుతున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, స్థానిక నాయకులు...
ఎల్బీనగర్, అక్టోబర్ 16 (భారత శక్తి ):

# నా సమస్య పరిష్కరిస్తామని పార్టీ పెద్దలు హామీ ఇచ్చారు

: మంత్రి కొండా సురేఖ



హైదరాబాద్, అక్టోబర్ 16 (భారత శక్తి) : తాజా పరిణామాలపై కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో మంత్రి కొండా సురేఖ , ఆమె కుమార్తె సుస్మిత చర్చించారు. గత కొన్ని రోజులుగా తనకు సంబంధించి చోటు చేసుకుంటున్న పరిణామాలను వివరించారు. నిన్న రాత్రి తన ఇంటి వద్దకు పోలీసులు వచ్చిన సమయంలో చోటు చేసుకున్న డ్రామాను వారికి వివరించారు. భేటీ అనంతరం కొండా సురేఖ మీడియాతో మాట్లాడారు. " నా సమస్య పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. సెటిల్ చేస్తామని పార్టీ పెద్దలు చెప్పారు. మిగిలిన విషయాలు వారే చూసుకుంటారని భరోసాతో వెళ్తున్నా" అని మంత్రి సురేఖ తెలిపారు. గత కొన్ని రోజులుగా తనను, తన కుటుంబాన్ని టార్గెట్ చేసుకుని ఇబ్బంది పెడుతున్నారని నేతల వద్ద ప్రస్తావించినట్టు సమాచారం. డెక్కన్ సిమెంట్ యాజమాన్యం వ్యవహారంలో జరిగిన పరిణామాలు, వారితో జరిగిన చర్చలు, ఆ సంస్థ అక్రమాలు తదితర విషయాలన్నీ వివరించినట్లు తెలుస్తోంది.

# చంద్రబాబు, పవన్ విజన్ అద్భుతం.. ఏపీకి అండగా ఉంటాం: ప్రధాని మోదీ

అమరావతి, అక్టోబర్ 16 (భారత శక్తి) : ఆంధ్రప్రదేశ్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా పనిచేయడంతో అభివృద్ధి పరుగులు పెడుతోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రూపంలో రాష్ట్రానికి శక్తిమంతమైన నాయకత్వం లభించిందని, ఈ డబుల్ ఇంజిన్ సర్కార్ పాలనలో గత 16 నెలలుగా ఏపీ అపూర్వ ప్రగతి సాధిస్తోందని ప్రశంసించారు. గురువారం కర్నూలు జిల్లా నన్నూరు వద్ద నిర్వహించిన 'సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్' భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు.



*** రూ.13,429 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం**

ఈ పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన, చేపట్టనున్న రూ.13,429 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు వర్చువల్ విధానంలో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. విద్యుత్, రైల్వే, జాతీయ రహదారులు, రక్షణ రంగాలకు చెందిన ఈ ప్రాజెక్టులు రాష్ట్రంలో కనెక్టివిటీని బలోపేతం చేస్తాయని, పరిశ్రమలకు ఊతమిచ్చి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాయని ఆయన వివరించారు. ముఖ్యంగా ఈ ప్రాజెక్టుల వల్ల కర్నూలుతో పాటు పరిసర ప్రాంతాలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు.

*** చంద్రబాబు, పవన్‌లపై ప్రశంసల వర్షం**

రాష్ట్ర నాయకత్వంపై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. "ఏపీలో విజన్ ఉన్న చంద్రబాబు, పవన్ కల్యాణ్ లాంటి నేతలు ఉన్నారు. వారికి కేంద్ర ప్రభుత్వ పూర్తి సహకారం కూడా ఉంది. వీరి నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు దూసుకెళుతోంది" అని అన్నారు. ఏపీ అభివృద్ధికి కేంద్రం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తెలుగులో "సోదర సోదరీమణులకు నమస్కారం" అంటూ ప్రసంగాన్ని ప్రారంభించిన మోదీ, అహోబిళం, మహానంది, మంత్రాలయం స్వాముల ఆశీస్సులు కోరుకుంటున్నట్లు తెలిపారు. తన జన్మస్థలమైన గుజరాత్‌లోని సోమనాథుడిని, కాశీ విశ్వనాథుడిని, శ్రీశైలం మల్లికార్జున స్వామిని స్మరించుకున్నారు.

*** డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ప్రగతి పరుగులు**

ఢిల్లీ, అమరావతి కలిసి పనిచేస్తుండటంతో అభివృద్ధి వేగంగా సాగుతోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. "గత 16 నెలల్లో డబుల్ ఇంజిన్ సర్కార్ కారణంగా ఏపీ అనూహ్య ప్రగతి సాధిస్తోంది. 2047 నాటికి మన దేశం వికసిత భారత్‌గా మారాలన్న లక్ష్యంలో ఆంధ్రప్రదేశ్ తన వంతు కీలక సహకారం అందిస్తోంది. 21వ శతాబ్దం 140 కోట్ల భారతీయులది" అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలే ప్రాధాన్యంగా తమ ప్రభుత్వ నిర్ణయాలు ఉంటాయని, అభివృద్ధే తమ విధానమని స్పష్టం చేశారు.

*** రాయలసీమ అభివృద్ధికి పెద్దపీట**

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలంటే రాయలసీమ అభివృద్ధి చాలా ముఖ్యమని ప్రధాని నొక్కిచెప్పారు. ఈ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పలు ప్రాజెక్టులు చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఓర్వకల్లు, కొప్పర్తిలలో ఏర్పాటు చేస్తున్న పారిశ్రామిక కారిడార్లు రాయలసీమ రూపురేఖలను మారుస్తాయని, ఇక్కడ పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన వివరించారు.

*** పెట్టుబడులకు స్వర్గధామంగా ఏపీ**

ఆంధ్రప్రదేశ్, భారతదేశ అభివృద్ధిని ప్రపంచమంతా గమనిస్తోందని ప్రధాని అన్నారు. గూగుల్ లాంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థ ఏపీలో భారీ పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చిందని గుర్తుచేశారు. "అమెరికా వెలుపల తమ అతిపెద్ద పెట్టుబడిని ఏపీలో పెడుతున్నట్లు గూగుల్ సీఈఓ స్వయంగా చెప్పారు. విశాఖలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) హబ్, డేటా సెంటర్, సబ్‌సీ కేబుల్ వంటి భారీ ప్రాజెక్టులు రాబోతున్నాయి. ఈ సబ్‌సీ కేబుల్ వ్యవస్థకు విశాఖ గేట్‌వేగా మారనుంది" అని మోదీ తెలిపారు.

*** ఇంధన రంగంలో ఏపీ కీలక పాత్ర**

దేశ ఇంధన భద్రతలో ఏపీ కీలక పాత్ర పోషిస్తోందని ప్రధాని కొనియాడారు. గతంలో దేశంలో విద్యుత్ సంక్షోభాలు ఉండేవని, ఇప్పుడు తమ ప్రభుత్వం క్లీన్ ఎనర్జీ ఉత్పత్తిలో రికార్డులు సృష్టిస్తోందని అన్నారు. దేశంలో తలసరి విద్యుత్ వినియోగం 1400 యూనిట్లకు పెరిగిందని, ప్రతి ఇంటికి, పరిశ్రమకు సరిపడా విద్యుత్ అందుబాటులో ఉందని చెప్పారు. చిత్తూరు ఎల్‌పీజీ బాట్లింగ్ ప్లాంట్ రోజుకు 20 వేల సిలిండర్లు నింపే సామర్థ్యంతో పనిచేస్తోందని, సహజవాయువు పైప్‌లైన్‌తో 15 లక్షల ఇళ్లకు గ్యాస్ సరఫరా అవుతుందని వివరించారు.

## బీసీ సంఘాల బంద్, కొండా సురేఖ అంశంపై స్పందించిన మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్, అక్టోబర్ 16 (భారత శక్తి) : అక్టోబర్ 18న బీసీ సంఘాలు తలపెట్టిన తెలంగాణ రాష్ట్ర బంద్‌కు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో తమ పార్టీ వెనక్కి తగ్గేది లేదని ఆయన స్పష్టం చేశారు. బంద్ నేపథ్యంలో బీసీ సంఘాల నేతలతో ఆయన గాంధీ భవన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, దేశంలో కుల సర్వేలకు ఆద్యుడు రాహుల్ గాంధీ అని కొనియాడారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన కామారెడ్డి డిక్లరేషన్‌కు తాము కట్టుబడి ఉన్నామని ఆయన పునరుద్ఘాటించారు. బీసీ రిజర్వేషన్లపై ఎట్టి పరిస్థితుల్లోనూ వెనుకడుగు వేసే ప్రసక్తి లేదని తేల్చి చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి బీసీ ఈ బంద్‌కు మద్దతు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ బంద్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని ఆయన ఆకాంక్షించారు. అసెంబ్లీలో బీసీ బిల్లుకు మద్దతు తెలిపిన బీజేపీ, బయట మాత్రం అడ్డుకుంటోందని ఆయన ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కై రిజర్వేషన్లను అడ్డుకుంటున్నాయని ఆయన విమర్శించారు. రాహుల్ గాంధీ ఆశయ సాధన కోసం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని ఆయన ప్రశంసించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించిన తర్వాత ఎన్నికలకు వెళ్లాలనే ఆలోచనలో ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. మంత్రి కొండా సురేఖ వ్యవహారంపై మహేశ్ కుమార్ గౌడ్ స్పందిస్తూ, ఆమెతో స్వయంగా మాట్లాడతానని తెలిపారు. త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎక్కడో కమ్యూనికేషన్ గ్యాప్ ఉన్నట్లు కనిపిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు.

## రాయదుర్గంలో మరోసారి భూముల వేలం.. గజం రూ. 3,10,000..!

హైదరాబాద్, అక్టోబర్ 16 (భారత శక్తి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ భూముల వేలానికి మరోసారి సిద్ధమైంది. రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం, రాయదుర్గం పరిధిలోని నాలెడ్జ్ సిటీలో 4,718.22 చదరపు గజాల ప్రభుత్వ స్థలాన్ని వేలం వేయడానికి టీజీఐఐసీ నోటిఫికేషన్ జారీ చేసింది. గజానికి రూ. 3,10,000 రిజర్వ్ ధరను నిర్ణయించినట్లు టీజీఐఐసీ పేర్కొంది. ఈ భూమికి సంబంధించిన ఈవేలం నవంబర్ 11న మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు టీజీఐఐసీ కార్యాలయంలో జరుగుతుందని తెలిపింది. ఇటీవల రాయదుర్గంలో టీజీఐఐసీ 18.67 ఎకరాలను వేలానికి పెట్టింది. తొలి విడతలో 7.67 ఎకరాలను వేలం వేయగా, ఎకరం భూమి రూ. 177 కోట్లు పలికింది. రాష్ట్రంలో ఇప్పటి వరకు జరిగిన భూముల వేలంలో ఇది అత్యధిక ధర. 7.67 ఎకరాల భూమిని రూ. 177 కోట్ల చొప్పున రూ. 1,356 కోట్లకు ఎంఎస్ఎం రియాల్టీ సంస్థ దక్కించుకుంది. ఈసారి గజానికి రూ. 3,10,000 అంటే ఎకరాకు రూ. 124 కోట్లుగా వస్తుంది.

## దీపావళికి ముందే ఢిల్లీలో డేంజర్ బెల్స్.. కాలుష్యం గుప్పిట్లో దేశ రాజధాని!

ఢిల్లీ, అక్టోబర్ 16 (భారత శక్తి) : దీపావళి పండగ ఇంకా రాకముందే దేశ రాజధాని ఢిల్లీని కాలుష్యపు పొగ కమ్మేసింది. గాలి నాణ్యత అత్యంత ప్రమాదకర స్థాయికి పడిపోవడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. గురువారం ఉదయం నాటికి ఢిల్లీ జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్) వ్యాప్తంగా వాయు కాలుష్యం 'చాలా ప్రమాదకరం' కేటగిరీకి చేరింది. ఈ పరిస్థితి తీవ్రమైన ప్రజారోగ్య సమస్యలకు దారితీస్తుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 301 నుంచి 400 మధ్య ఉంటే దానిని 'చాలా ప్రమాదకరం'గా పరిగణిస్తారు. ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో ఏక్యూఐ 300 మార్కును దాటింది. ఘజియాబాద్‌లోని లోనిలో అత్యధికంగా 339గా నమోదు కాగా, నోయిడా సెక్టార్ 125లో 358కి చేరింది. అదేవిధంగా, ఢిల్లీలోని ఆనంద్ విహార్ (335), వజీర్‌పూర్ (337) ప్రాంతాల్లో కూడా పరిస్థితి తీవ్రంగా ఉంది. విషమిస్తున్న వాయు కాలుష్యాన్ని అదుపులోకి తెచ్చేందుకు అధికారులు ఇప్పటికే రంగంలోకి దిగారు. గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (గ్రాప్) తొలి దశను అమలు చేశారు. దీని కింద, నిర్మాణ, కూల్చివేత పనులను నిలిపివేయడం, డీజిల్ జనరేటర్ల వాడకంపై నిషేధం వంటి ఆంక్షలు విధించారు. కాలుష్యం మరింత పెరిగితే రెండో దశ కింద మరిన్ని కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాతావరణంలో ఓజోన్, పీఎం10 రేణువుల సాంద్రత పెరగడమే ఈ కాలుష్యానికి ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు. గాలి వేగం తక్కువగా ఉండటం, ఉష్ణోగ్రతల్లో మార్పుల వల్ల కాలుష్య కారకాలు గాలిలోనే నిలిచిపోతున్నాయని వారు విశ్లేషిస్తున్నారు. ఈ తరహా గాలిని పీల్చడం వల్ల పిల్లలు, వృద్ధులు, శ్వాసకోశ, గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారికి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో, ప్రజలు వీలైనంత వరకు బయటకు వెళ్లవద్దని, ఒకవేళ వెళ్లాల్సి వస్తే మాస్కులు ధరించాలని అధికారులు సూచిస్తున్నారు. ఇళ్లలో ఎయిర్ ప్యూరిఫైయర్లు వాడటం మంచిదని చెబుతున్నారు. కాలుష్య నియంత్రణ చర్యలకు ప్రజలు సహకరించాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

## శంషాబాద్ విమానాశ్రయంలో రూ. 2.37 కోట్ల విలువైన బంగారం పట్టివేత

హైదరాబాద్, అక్టోబర్ 16 (భారత శక్తి) : శంషాబాద్ విమానాశ్రయంలో భారీగా బంగారం పట్టుబడింది. కువైట్ నుంచి షార్జా మీదుగా హైదరాబాద్ చేరుకున్న ఒక ప్రయాణికుడిని డీఆర్ఐ అధికారులు తనిఖీ చేయగా, అతని వద్ద 7 బంగారు కడ్డీలు లభ్యమయ్యాయి. సుమారు 1.8 కిలోల బరువున్న ఈ బంగారు కడ్డీల విలువ సుమారు రూ. 2.37 కోట్లు ఉంటుందని డీఆర్ఐ అధికారులు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రయాణికుడి నుంచి స్వాధీనం చేసుకున్న వాటిలో 24 క్యారెట్ల స్వచ్ఛమైన 5 బంగారు బిస్కట్లు, రెండు కట్ పీసులు ఉన్నాయి. అధికారులకు అనుమానం రాకుండా వాటిని లగేజీ డోర్ మెటాలిక్ లాక్‌లో కొంత భాగాన్ని, అలాగే పొద్దు తిరుగుడు గింజలు ఉన్న ప్లాస్టిక్ పౌచ్‌లో మరికొంత బంగారాన్ని దాచి తరలించే ప్రయత్నం చేశాడు.

## అమెరికాలోని భారత టెక్కీలకు శుభవార్త.. హెచ్-4 వీసాదారులకు భారీ ఊరట

అమెరికా, అక్టోబర్ 16 : అమెరికాలో నివసిస్తున్న వేలాది భారతీయ టెక్ నిపుణుల కుటుంబాలకు శుభవార్త అందింది. హెచ్ 1బీ వీసాదారుల జీవిత భాగస్వాములు (హెచ్ 4 వీసా హోల్డర్లు) అమెరికాలో ఉద్యోగాలు చేసుకునే హక్కును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించడానికి యూఎస్ సుప్రీంకోర్టు నిరాకరించింది. దీంతో దాదాపు దశాబ్ద కాలంగా కొనసాగుతున్న న్యాయపోరాటానికి తెరపడినట్లయింది. ఈ నిర్ణయంతో వేలాది భారతీయ కుటుంబాల్లో నెలకొన్న అనిశ్చితి తొలగిపోయి, వారిలో ఆనందం వెల్లివిరిసింది. హెచ్ 1బీ వీసాదారుల జీవిత భాగస్వాములు ఉద్యోగాలు చేసుకునేందుకు అనుమతించే 'హెచ్ 4 ఈఏడీ' (ఎంప్లాయ్‌మెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్) విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ 'సేవ్ జాబ్స్ యూఎస్ఏ' అనే సంస్థ చాలా కాలంగా న్యాయపోరాటం చేస్తోంది. ఈ విధానం వల్ల అమెరికన్ల ఉద్యోగావకాశాలు దెబ్బతింటున్నాయని ఆ సంస్థ వాదిస్తోంది. అయితే, ఈ పిటిషన్‌పై విచారణ జరపడానికి సుప్రీంకోర్టు ఆసక్తి చూపలేదు. ఫలితంగా కింది కోర్టు ఇచ్చిన తీర్పు అమల్లో ఉంటుంది. అంటే హెచ్ 4 వీసాదారుల ఉద్యోగ హక్కు ఇకపై కూడా కొనసాగుతుంది. 2015లో నాటి అధ్యక్షుడు బరాక్ ఒబామా ఈ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. గ్రీన్ కార్డ్ కోసం దరఖాస్తు చేసుకుని, ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న హెచ్ 1బీ వీసాదారుల జీవిత భాగస్వాములకు ఇది ఒక వరంలా మారింది. ఈ సదుపాయం లేకపోతే గ్రీన్ కార్డ్ వచ్చేంత వరకు వారు ఖాళీగా ఉండాల్సి వచ్చేది. హెచ్ 4 వీసాదారుల్లో అత్యధికులు ఉన్నత విద్యావంతులు, నైపుణ్యం కలిగిన భారతీయ మహిళలే కావడం గమనార్హం. ఈఏడీ విధానం వల్ల వారు అమెరికాలో తమ కెరీర్‌లను కొనసాగించగలుగుతున్నారు. అనేక మంది పెద్ద కంపెనీలలో ఉన్నత స్థానాల్లో స్థిరపడగా, మరికొందరు సొంతంగా వ్యాపారాలు కూడా ప్రారంభించారు. గతంలో డొనాల్డ్ ట్రంప్ హయాంలో ఈ విధానాన్ని రద్దు చేసేందుకు ప్రయత్నాలు జరిగాయి. దీంతో చాలా కుటుంబాలు ఆందోళనకు గురయ్యాయి. ఇప్పుడు సుప్రీంకోర్టు నిర్ణయంతో చట్టపరమైన అడ్డంకులు తొలగిపోయినప్పటికీ, భవిష్యత్తులో రాజకీయపరమైన సవాళ్లు ఎదురయ్యే అవకాశం లేకపోలేదని కొందరు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఏదేమైనా ప్రస్తుతానికి ఈ నిర్ణయం అమెరికాలోని భారతీయ వృత్తి నిపుణులకు, వారి కుటుంబాలకు గొప్ప స్థైర్యాన్ని ఇచ్చింది. ఇది అమెరికా ఆర్థిక వ్యవస్థకు కూడా మేలు చేస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు.

## లోకేశ్ సారథ్యంలో జీఎస్టీ ప్రచారం పండుగలా సాగుతోంది

అమరావతి, అక్టోబర్ 16 (భారత శక్తి) : ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందితేనే 'వికసిత భారత్' లక్ష్యం సాకారమవుతుందని, రాష్ట్ర ప్రగతికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వంటి దార్శనికత ఉన్న నేతల సారథ్యంలో ఏపీ వేగంగా అభివృద్ధి పథంలో పయనిస్తోందని ఆయన ప్రశంసించారు. ఉత్సాహవంతుడైన యువ మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలో జీఎస్టీ సంస్కరణల ప్రచారం ఓ వేడుకలా సాగుతోందని కితాబిచ్చారు. అందుకు లోకేశ్‌ను హృదయపూర్వకంగా అభినందిస్తున్నానని తెలిపారు. గురువారం కర్నూలు సమీపంలోని నన్నూరు చెక్‌పోస్ట్ వద్ద నిర్వహించిన 'సూపర్ జీఎస్టీసూపర్ సేవింగ్స్' బహిరంగ సభలో ప్రధాని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో పలు కీలక ప్రాజెక్టులను ప్రారంభించారు.

*** ప్రధాని మోదీ ప్రసంగంలోని ముఖ్యాంశాలు పాయింట్ల రూపంలో...**

**ఏపీ ప్రగతి - కేంద్రం మద్దతు**

- ఆత్మనిర్భర్ భారత్, వికసిత భారత్ వంటి లక్ష్యాల సాధనలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తోంది.
- ఏపీ యువత ఎంతో చైతన్యవంతులు. వారి నైపుణ్యాలు దేశానికి గర్వకారణం.
- రాష్ట్రంలో విజన్ ఉన్న చంద్రబాబు, పవన్ కల్యాణ్ లాంటి నాయకులు ఉన్నారు. వారికి కేంద్ర ప్రభుత్వ సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది.
- గత 16 నెలలుగా ఏపీలో డబుల్ ఇంజన్ సర్కార్ పాలనతో ప్రగతి పరుగులు పెడుతోంది. ఢిల్లీ, అమరావతి రెండూ అభివృద్ధి లక్ష్యంగా కలిసి పనిచేస్తున్నాయి.
- భారతదేశ ఆర్థిక విప్లవంలో ఏపీ ఒక కీలక ప్రాంతంగా నిలుస్తోంది. దేశంతో పాటు ఏపీ ప్రగతిని కూడా ప్రపంచం గమనిస్తోంది.

**విశాఖలో గూగుల్ భారీ పెట్టుబడి**

- ప్రముఖ టెక్ దిగ్గజం గూగుల్, ఆంధ్రప్రదేశ్‌లో అతిపెద్ద పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చింది. దేశంలోనే తొలి అతిపెద్ద ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కేంద్రాన్ని విశాఖపట్నంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.
- అమెరికా వెలుపల గూగుల్ పెడుతున్న అతిపెద్ద పెట్టుబడి ఇదేనని గూగుల్ సీఈఓ స్వయంగా నాతో చెప్పారని ప్రధాని తెలిపారు.
- ఈ కేంద్రంలో అత్యాధునిక డేటా సెంటర్, ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్ వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు కానున్నాయి.
- ప్రపంచ దేశాలను కలుపుతూ ఏర్పాటు చేయనున్న సబ్‌సీ కేబుల్ ద్వారా తూర్పు తీరం మరింత బలోపేతం అవుతుంది.
- విశాఖలో రాబోతున్న కనెక్టివిటీ హబ్ కేవలం భారత్‌కే కాకుండా యావత్ ప్రపంచానికి సేవలు అందిస్తుంది. ఈ విషయంలో సీఎం చంద్రబాబు దార్శనికత అభినందనీయం.
- 21వ శతాబ్దంలో ప్రపంచ దేశాలు తయారీ రంగం కోసం భారత్ వైపు చూస్తున్నాయి. ఇందులో ఏపీ ఉత్పత్తి కేంద్రంగా రూపుదిద్దుకుంటోంది.

*** కాంగ్రెస్‌పై విమర్శలు - రాయలసీమ అభివృద్ధి**

- గత కాంగ్రెస్ ప్రభుత్వాలు ఆంధ్రప్రదేశ్ ప్రగతిని పూర్తిగా నాశనం చేశాయి. ఎన్డీఏ ప్రభుత్వ హయాంలోనే ఏపీకి అభివృద్ధి ద్వారాలు తెరుచుకున్నాయి.
- రాయలసీమ అభివృద్ధి చెందితేనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సాధ్యం. ఈ ప్రాంత ప్రగతికి తాజా ప్రాజెక్టులు కొత్త మార్గాలు వేస్తాయి.
- కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక నోడ్ల ద్వారా వచ్చే పెట్టుబడులతో రాయలసీమలోని ప్రతి జిల్లాలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.
- కర్నూలును 'భారత్ డ్రోన్ హబ్'గా తయారు చేయాలన్న ఏపీ ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం. 'ఆపరేషన్ సింధూర్' ద్వారా డ్రోన్ల శక్తి ఏమిటో దేశం చూసింది. డ్రోన్ల తయారీతో కర్నూలు దేశానికే గర్వకారణంగా నిలుస్తుంది.
- కృష్ణా జిల్లా నిమ్మకూరులో రక్షణ రంగానికి చెందిన నైట్ విజన్ గాగుల్స్, క్షిపణి సెన్సార్లు, డ్రోన్ గార్డుల తయారీ సంస్థ ఏర్పాటు కావడం శుభపరిణామం.

*** ప్రారంభించిన ప్రాజెక్టులు - దేశ ప్రగతి**

- రాష్ట్రంలో కనెక్టివిటీ, పరిశ్రమలను బలోపేతం చేసేందుకు అనేక ప్రాజెక్టులు ప్రారంభించాం. రూ.3,000 కోట్ల విలువైన ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టులతో దేశ ఇంధన సామర్థ్యం పెరుగుతుంది.
- గతంలో కాంగ్రెస్ హయాంలో విద్యుత్ కోతలు, బ్లాక్‌అవుట్‌లు ఉండేవి. ఇప్పుడు స్వచ్ఛ ఇంధన ఉత్పత్తిలో రికార్డులు సృష్టిస్తున్నాం.
- శ్రీకాకుళం నుంచి అంగుల్ వరకు గ్యాస్ పైప్‌లైన్‌ను జాతికి అంకితం చేశాం. చిత్తూరులో 20 వేల సిలిండర్ల సామర్థ్యంతో ఇండేన్ బాట్లింగ్ ప్లాంట్‌ను ప్రారంభించాం.
- సబ్బవరం నుంచి షీలానగర్ వరకు కొత్త హైవే, రైల్వే రంగంలో కొత్త ప్రాజెక్టులతో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందుతాయి.

*** జీఎస్టీ సంస్కరణలు - ప్రజలకు ప్రయోజనం**

- ప్రజల జీవితాలను సులభతరం చేయడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యం. రూ.12 లక్షల వార్షిక ఆదాయం ఉన్నవారికి పన్ను మినహాయింపు ఇచ్చాం. వృద్ధులకు ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలు అందిస్తున్నాం.
- నవరాత్రులకు ముందు జీఎస్టీ సంస్కరణలు తెచ్చి ప్రజలపై పన్నుల భారం తగ్గించాం. జీఎస్టీ సంస్కరణల వల్ల ప్రజలకు రూ.8 వేల కోట్ల మేర ఆదా కావడం సంతోషకరం.





# హైడ్రా.. ఆర్భాటం తప్ప
# అసలు విషయం లేదు..

**కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించి, డైనమిక్ లీడర్ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టాక..పలు పథకాలకు శ్రీకారం చుట్టారు..అయితే ఆయన ఆలోచనల నుంచి పురుడు పోసుకున్న అద్భుత ఆవిష్కరణ హైడ్రా..ఆక్రమణలకు గురైన చెరువులను, నీటి కుంటలను పరిరక్షించడం.. అక్రమ నిర్మాణాలను గుర్తించి కూల్చివేయడం హైడ్రా విధి.. హైడ్రా ఏర్పడిన తర్వాత సంచలనం సృష్టించింది.. ఆక్రమణదారుల గుండెల్లో దడ పుట్టించింది..హైడ్రా పేరు వినగానే వణికిపోయారు..నగర ప్రజలు చాలా సంతోషించారు.. నగరానికి మహర్దశ పట్టనుందని సంబరాలు చేసుకున్నారు..కానీ ఇది కేవలం తాత్కాలికమే అన్న విషయం అందరికీ అర్థం అయ్యింది.. ఉన్నవారికి ఒక న్యాయం.. లేనివారికి ఒక న్యాయం..ఈ కోవలోకి హైడ్రా చేరిపోయింది.. ఎన్నెన్నో అపవాదులు మూటగట్టుకుంది..చివరికి హైకోర్టు అక్షింతలు కూడా వేసింది.. ప్రారంభ ఆర్భాటం తప్ప.. హైడ్రాతో ఒరిగేది ఏమీ లేదన్నది మేధావులు, విశ్లేషకులు అంటున్న మాట..**

- **హైడ్రా పనితీరుపై బహిరంగ విమర్శలు..**
- **ఉద్దేశ్యం మంచిదే.. కానీ ఉపయోగం లేదు..**
- **పేదలపైన ప్రతాపం..పెద్దలపై ప్రేమ..**
- **చెరువుల పరిరక్షణలో కొంత విజయం..**
- **అన్ని సమస్యలను సమానంగా చూస్తే బెటర్..**
- **ఎంతో ఉన్నత ఆశయంతో ప్రారంభమైన హైడ్రా..**
- **హైడ్రామాతో అపనిందల పాలవుతున్న వైనం..**
- **హైడ్రా తీరును హైకోర్టు తప్పుబట్టినా మారని తీరు...**
- **బడాబాబులకు కొమ్ము కాస్తోందన్న తీవ్ర ఆరోపణలు..**
- **ముఖ్యమంత్రి డైరెక్షన్ లో నడుస్తూ విలువలకు తిలోదకాలు ఇస్తుందన్న అపవాదు..**
- **హైడ్రా పనితీరుపై " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ " అందిస్తున్న ప్రత్యేక కథనం..**

**( స్పెషల్ కరస్పాండెంట్ )**

**హైదరాబాద్, అక్టోబర్ 16 (భారత శక్తి) :** హైదరాబాద్ నగర పరిసరాల్లో అభివృద్ధి, ప్రణాళికా నియంత్రణ, రోడ్లు, డ్రైనేజ్, నీటి వనరులు, భవన నిర్మాణ నియంత్రణ వంటి అంశాలను ఒకే చోట సమన్వయం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం హైడ్రా అంటే హైదరాబాద్ రీజనల్ డెవలప్మెంట్ అథారిటీ అనే కొత్త సంస్థను ఏర్పాటు చేసింది.ఇది జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ., హెచ్ఎండబ్ల్యూ ఎస్ఎస్బీ, వంటి విభాగాల మధ్య ఉన్న సమన్వయ లోపాలను దూరం చేస్తూ, ఒకే గొడుగు క్రింద నగర అభివృద్ధి నియంత్రణ అనే లక్ష్యంతో రూపొందించబడింది.

**హైడ్రా పనితీరు ఎలా ఉంది.?**

హైడ్రా ఏర్పాటు తర్వాత ప్రారంభంలో పెద్ద ఎత్తున సమావేశాలు, ప్రాజెక్ట్ రివ్యూలు, స్మార్ట్ మానిటరింగ్ సిస్టమ్స్ మొదలైనవి ప్రవేశపెట్టబడ్డాయి.

కానీ, నగర ప్రజల దృష్టిలో ఇది "మరొక కొత్త బోర్డు మాత్రమే, పని తక్కువ – పబ్లిసిటీ ఎక్కువ" అన్న అభిప్రాయాన్ని తెచ్చుకుంది.అనధికార నిర్మాణాలు, లేఅవుట్లు, భూకబ్జాలు,డ్రైనేజ్, ట్రాఫిక్, రోడ్ల సమస్యలు, నకిలీ బిల్డింగ్ అనుమతుల వంటి అంశాలపై ఇప్పటికీ ప్రభావవంతమైన చర్యలు కనిపించకపోవడం విమర్శలకు కారణమైంది.

*** పారదర్శకత లోపం ప్రజలకు లాభం లేకపోవడం :**

విభాగాల సమన్వయం పేరుతో ఏర్పాటైన హైడ్రా,అధికారాల కేంద్రీకరణకు దారి తీసిందని, ప్రజా భాగస్వామ్యం తగ్గిందని నిపుణులు విమర్శిస్తున్నారు.

నగర ప్రజలు చెబుతున్నది ఏమిటంటే జీహెచ్ఎంసీలో మనం ఫిర్యాదు చేసినా, హెచ్ఎండీఏలో ఫిర్యాదు చేసినా ఇప్పుడు 'హైడ్రా'కి వెళ్లమంటున్నారు. కానీ అక్కడ స్పందన కనిపించడం లేదు. అన్నది పెద్ద విమర్శ..

ఈ విధంగా ప్రజా సమస్యలు పరిష్కారం కాకుండా, దారి తప్పుతున్నాయన్న భావన బలపడుతోంది..

**హైకోర్టు అక్షింతలు..చట్ట పరమైన ప్రశ్నలు :**

ఇటీవలి కాలంలో హైడ్రా ఏర్పాటు, దాని అధికారాల విస్తరణపై హైకోర్టు గట్టి ప్రశ్నలు లేవనెత్తింది. "ప్రస్తుత చట్టాల ప్రకారం హైడ్రా ఏర్పాటుకు న్యాయబద్ధత ఉందా?" "జీహెచ్ఎంసీ చట్టాన్ని సవరణ చేయకుండానే కొత్త సంస్థ ఏర్పాటేంటి?"అంటూ హైకోర్టు వ్యాఖ్యానించింది. అంతేకాక, పౌర హక్కుల సంఘాలు కూడా ఈ సంస్థను ప్రజాస్వామ్య ప్రక్రియలకు విరుద్ధంగా పేర్కొంటూ పిటిషన్లు వేశారు.









*** హైడ్రా విజయమా? వైఫల్యమా?**

హైడ్రా ఆశయాలు గొప్పవే —— సమగ్ర నగర అభివృద్ధి. కానీ ప్రజల దృష్టిలో అది మరో అధికార సంస్థ, మరో అడ్డంకిగా మారకూడదు. పారదర్శకత, ప్రజా భాగస్వామ్యం, బాధ్యతాయుతం ఈ మూడు అంశాలు లేకుండా ఏ సంస్థా నిలబడదు. హైడ్రా భవిష్యత్తు కూడా ఈ మూడీటి పైనే ఆధారపడి ఉంటుంది.మరీ ముఖ్యంగా హైడ్రా చెబుతున్నట్లు కొన్ని పనులు కనిపిస్తున్నా ఉదాహరణకు బతుకమ్మ కుంట, హీరో నాగార్జున ఎన్ కన్వెన్షన్ కూల్చివేత లాంటివి సంచలనం సృష్టించినా.. పేదల నిర్మాణాలను కూల్చివేయడం... పెద్దల జోలికి పోకపోవడం.. లంచాల ఆరోపణలు...కోర్టు అక్షింతలు.. ప్రభుత్వానికి కొమ్ముకాస్తూ పని చేస్తోందన్న అపవాదు.. ఇలా హైడ్రా సాధించింది ఏమీ లేదన్నది వాస్తవం అంటున్నారు విశ్లేషకులు...!

---

## వర్షా లు పూర్తిగా తగ్గుముఖంపట్టడంతో జీహెచ్ఎంసీ రోడ్డు సేఫ్టీ డ్రైవ్ పై కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఫోకస్..



హైదరాబాద్, అక్టోబర్ 16 (భారత శక్తి): ఇప్పటి వరకూ గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా రోడ్ల పై 16 వేలకు పైగా గుంతలు పూడ్చివేత - గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా ముమ్మరంగా కొనసాగుతున్న జీహెచ్ఎంసీ శానిటేషన్ స్పెషల్ డ్రైవ్.-10 రోజుల్లో 4,100 మెట్రిక్ టన్నుల వ్యర్థాల తొలగింపు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక నేపథ్యంలో నియోజకవర్గ పరిధిలో కట్టుదిట్టంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి. తనిఖీలు ముమ్మరం చేసిన ఎన్నికల అధికారులు.- ఎన్నికల షెడ్యూల్ విడుదల నుంచి నేటి వరకూ నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న కోటి రూపాయలకు పైగా నగదు పట్టివేత-గురువారం తనిఖీలలో భాగంగా టోలిచౌకీ వద్ద 10 లక్షల నగదు స్వాధీనం చేసుకున్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం.- జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక నేపథ్యంలో నేడు ( 4 వ రోజు ) కొనసాగుతున్న నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం. గురువారం 3 గంటల వరకు వచ్చిన నామినేషన్లు 19, అందులో ఒకటి తెలంగాణ ప్రజా జీవన రైతు పార్టీ అభ్యర్థిగా చుండి శోభన్ బాబు,సోషలిస్ట్ పార్టీ (ఇండియా)అభ్యర్థినిగా రచ్చ సుభద్ర రెడ్డి, పాత పార్టీ అభ్యర్థిగా మచ్చర్ల వెంకట్ రెడ్డి,మిగిలిన 16 మంది స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు.







---

## అమీర్‌పేట ముంపునకు "హైడ్రా" పరిష్కారం

- **నగరవ్యాప్తంగా ఇదే విధానం అనుసరించాలన్న హైడ్రా కమిషనర్**
- **నాలాల డీసిల్టింగ్ పనులు పరిశీలించిన హైడ్రా కమిషనర్**

హైదరాబాద్, అక్టోబర్ 16 (భారత శక్తి) : వర్షం వస్తే ఆందోళన. 10 సెంటీమీటర్ల వర్షం పడితే రహదారులన్నీ జలమయం. ఇక అమీర్‌పేట గురించి ప్రత్యేకంగా చెప్పాలా.. జూబ్లీహిల్స్, గాయత్రీ హిల్స్, యూసుఫ్‌గూడ, కృష్ణానగర్, మధురానగర్, శ్రీనివాస నగర్ ప్రాంతాల నుంచి వచ్చే వరద ముందుకు సాగక అమీర్‌పేటలో నడుం లోతు నీళ్లు ప్రధాన రహదారిపై నిలిచిపోవడం.. వాహన రాకపోకలకు ఇబ్బంది కలగడం.. ఇవన్నీ నగరవాసులకు ప్రతి ఏటా అనుభవంలోకి వచ్చిన వరద కష్టాలే. ఈ ఏడాది ఆ సమస్యకు హైడ్రా పరిష్కారం చూపింది. వరద కష్టాలకు తెర దించింది. ఇప్పుడు 10 సెంటీమీటర్ల వర్షం పడితే నీరు నిలవకుండా ముందుకు సాగేలా హైడ్రా చర్యలు తీసుకుంది. ఈ పనులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నిరంతరం పర్యవేక్షించారు. హైడ్రా, జీహెచ్ ఎంసీ, జలమండలి, ఇరిగేషన్ అధికారులతో పలుమార్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కార మార్గం చూపారు. ఈ క్రమంలోనే గురువారం కూడా అమీర్‌పేటలో పర్యటించి పూడుకుపోయిన నాలాలనుంచి మట్టిని, చెత్తను తొలగించే పనులను పర్యవేక్షించారు.




*** అమీర్‌పేట ఓ నమూనా..**

అమీర్‌పేటలో వరద ముప్పు తప్పించేందుకు అనుసరించిన విధానం నగరంలోని అనేక ముంపు ప్రాంతాలకు పరిష్కార మార్గమని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ తెలిపారు. పూడుకుపోయిన నాలాలను ఇదే మాదిరి తెరిస్తే చాలావరకు వరద సమస్యకు పరిష్కారం చూపగలమని చెప్పారు. హైడ్రా కమిషనర్ శ్రీ ఏ.వి. రంగనాథ్ అమీర్‌పేట్‌లోని మైత్రివనం జంక్షన్, గాయత్రీ నగర్ ప్రాంతాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మొత్తం 6 పైపులైన్లుండగా.. 3 లైన్లను పూర్తి స్థాయిలో పునరుద్ధణ పనులు పూర్తి చేసినట్టు అధికారులు కమిషనర్‌కు తెలిపారు. మరో 3 లైన్లలో పూడిక తీయడంతో పాటు.. ఈ వరదంతా గాయత్రీనగర్‌పై పడకుండా అక్కడ కూడా పైపులైన్లలో మట్టిని తొలగించే పనిని పూర్తి చేయాలని కమిషనర్ సూచించారు. వచ్చే వర్షాకాలానికి నీరు నిలవకుండా గాయత్రీ నగర్ కు ముంపు సమస్య లేకుండా చూడాలన్నారు.

**45 ట్రక్కుల మట్టి తరలింపు..**

అమీర్‌పేట జంక్షన్‌లో సారథీ స్టూడియోస్, మధురానగర్ వైపు నుంచి వచ్చే పైపులైన్లు కలుస్తాయి. ఎగువ నుంచి వరదతో పాటు భారీ మొత్తంలో చెత్త కూడా ఇక్కడకు చేరుతోంది. అలా దశాబ్దాలుగా చేరిన చెత్తతో అమీర్‌పేట జంక్షన్‌లో 6 పైపులైన్లు పూడుకుపోయి.. కొంతమొత్తంలోనే వరద నీరు ముందుకు సాగేది. ఏమాత్రం వర్షం పడినా వరద ముంచెత్తేది. శ్రీనివాస్‌నగర్ వెస్ట్ సైడ్ వరద కాలువ పైన కాంక్రీట్‌తో వేసిన పైకప్పు తెరచి పూడిక తీత పనులను హైడ్రా చేపట్టింది. పరుపులు, దిండులు ఇలా చెత్తతో మూసుకుపోయిన పైపులైన్లను తెరచింది. ఇప్పటి వరకూ ఇలా 45 ట్రక్కుల మట్టిని తొలగించింది. దీంతో ఈ ఏడాది 10 సెంటీమీటర్ల వర్షం పడినా ఇబ్బంది కలగలేదు. మరో 3 పైపు లైన్లలో కూడా పూడికను తొలగిస్తే 15 సెంటీమీటర్ల వర్షం పడినా అమీర్‌పేటలో వరద ముంచెత్తదని హైడ్రా, జీహెచ్ ఎంసీ, జలమండలి, ఇరిగేషన్ అధికారులు కమిషనర్‌కు తెలిపారు. ఇదే మాదిరి నగరంలోని ముంపు సమస్యను ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో కల్వర్టులు, అండర్‌గ్రౌండ్ పైపు లైన్లలో పూడికను తొలగించి ముంపు సమస్యకు పరిష్కారం చూపాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. కాలనీ అసోసియేషన్ సభ్యులు హైడ్రా బృందం చేపట్టిన పనుల పట్ల కృతజ్ఞతలు తెలిపారు.






Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.